ఆదివారం
ప్రజాశక్తి
4 నవంబర్, 2001

అంతరిక్ష భారతం

కార్మిక, కర్షక
దినపత్రిక సామాన్యుల
ప్రియపుత్రిక

ప్రజాశక్తి
దినపత్రిక

తియ్యటి పలుకులు....

ఏదైనా శుభవార్త వినిపించే ముందు - వినే మనిషికి మొదట తీపి.తినిపిస్తారు. ఆనక ఆ వార్త వినిపిస్తారు. ఇది అనాదిగా వస్తున్న ఆచారం. తియ్యటి వార్తని తీపి తినిపించి చెప్పాలని అప్పుడెప్పుడో రూలు పెట్టేరన్నమాట. మా అమ్మాయికి మంచి సంబంధం సెటిలైంది. మా అబ్బాయికి ఉద్యోగం దొరికింది. నాకు ప్రమోషన్ వచ్చింది. ఇవన్నీ తీపి వార్తలు. ఈ టైపు వార్తలు ఆత్మీయులకు వినిపించే ముందు నోరు తెరవమంటారు. తెరిచిన నోట్లో తీపి నింపేస్తారు. తర్వాత తీపివార్త చదువుతారు. అంచేత నోరు తెరవమని మనకి ఎవరైనా ఆర్డరు వేసినప్పుడు తీపి కబురు చెబుతున్నాడని అనుకోవాలి. పంటి డాక్టరు దగ్గిరకెళ్లినప్పుడు మాత్రం అర్థం మారుతుంది. పంటి డాక్టరు తప్పకుండా నోరు తెరవమనే అడుగుతాడు. తెరుస్తే నోట్లో స్వీటు పెట్టి స్వీటు మేటరు చెబుతాడని అపార్థం చేసుకోకూడదు. పళ్లూడగొట్టే పని మీద నోరు తెరవమన్నాడని అర్థం చేసుకోవాలి! వదిలేయండి!

ఒకరికి తీపివార్త సమస్తమైన వాళ్లందరికీ తియ్యగానే వినిపిస్తుందనే గ్యారంటీ లేదు. మనకి తీపిగా వున్న మేటరు మరొకరికి చేదుగా తగలడచ్చు. మా అమ్మాయికి సంబంధం కుదిరిందని పక్కింటాయన నోట్లో స్వీటు పెట్టడం వరకు కరెక్టే! ఆ అమ్మాయినే కోడలుగా చేసుకోవాలన్న ఆశతో వున్న ఆ పక్కింటాయనకి అది చేదు వార్తే అవుతుంది! అంచేత అతను నోట్లో వున్న స్వీటుని కళ్లనీళ్లెట్టుకుని కొరుకుతాడు. అంతేగాని తుపుక్కున ఊసేస్తే సంస్కారం తెలీని మనిషంటారు. కన్నీళ్లమాటేమిటని అడగాలనుకుంటున్నారా? దాందేముంది? ఆనందభాష్పాలంటాడు. ఆనందం ఎక్కువైనప్పుడు కూడా కన్నీళ్లే వస్తాయంటాడు. నవ్వినా కన్నీళ్లే అంటారు గదా! అదన్నమాట!

మనలో మాట

మాటాడటం ఒక ఆర్టు. తియ్యగా మాటాడటం మా గొప్ప ఆర్టు. అట్లా మాటాడటం నేర్చుకోమని సుమతీశతకకారుడు చెప్పనే చెప్పేడు. అతనికేం అతనట్లాగే చెబుతాడు. వళ్లుమండి పోతున్నప్పుడు మంటమీద మాటాడతామేగాని - తియ్యగా మాటాడే ఓపిక ఎక్కడ్నించి వస్తుంది? అంచేత తాను నొచ్చుకోకుండా ఇతరులను నొప్పించకుండా మాటాడటం తమాషాకాదు. సర్వసంగ పరిత్యాగులెవరో గుహల్లో వుంటారు. ఈ పనికి వాళ్లే బాగా సూటవుతారు. ఉప్పుకారం తింటున్న సగటు జనాభాకి ఈ విద్య వంటబట్టదు. కొడితే ఏడుస్తారు. కోపమొస్తే అరుస్తారు. అంతేగాని తీపి ఏడుపులూ తీపి అరుపులూ వాళ్లకి తెలీవు. మాడుమీద గట్టిగా ఒకటిచ్చుకుని తియ్యగా మాటాడమంటే వీలవదు. సగటుగాళ్లని వదిలేయండి. వాళ్లతో అన్నీ పేచీలే! చమత్కారులు కొందరుంటారు. వాళ్లకి తియ్యగా మాటాడటం బాగా తెలుసు. సగటు మనిషికి నిష్కారణంగా ఉరిశిక్షపడినా - ఆ కబురు శిక్ష అనుభవించే మనిషికి చాలా తియ్యగా చెబుతారు!

నిన్ను సింహాసనమెక్కిస్తాం. ఆ సింహాసనం ఖరీదైనది. రత్నాలు పొదిగిన సింహాసనం. దాన్ని అంటుకుంటే చాలు - నీ హోదా పెరిగిపోతుంది. అట్లాంటి సింహాసనమ్మీద నువ్వెక్కుతావన్నమాట. నీ మెళ్లో ఎంతో విలువైన తాడు తగిలిస్తాం. అది మామూలు తాడు కాదు. మణులు పొదిగిన తాడు. తళతళ మెరిసిపోయే తాడు. ఖరీదెక్కువైన తాడు. ఆ తాడు చెట్టుకొమ్మకి ముడివేస్తాం. ఆ కొమ్మ మామూలు కొమ్మకాదు. కల్పవృక్షం తాలూకు కొమ్మ. వజ్రాలు పొదిగిన కొమ్మ. వరాలిచ్చే కొమ్మ. ఇప్పుడు నీకాలికిందున్న సింహాసనాన్ని ఎవడో లాగేస్తాడు. ఎవడో లాగేస్తాడని తెలిసే నీ మెడకి తాడు ముడివేసేం, అంచేత - సింహాసనం ఒరిగిపోయినా - నీ మెడకి ముడివేసిన తాడు నిన్ను ఆదుకుంటుంది. గాల్లో నిన్ను ఎంచక్కా వేలాడదీస్తుంది. చిటుక్కుమని చిన్నశబ్దం వినిపిస్తుంది. ఆ పైన నువ్వు స్వర్గం చేరుకుంటావు. అక్కడ రంభోర్వశి మేనక తిలోత్తమలతో డేన్సు చేస్తావని చమత్కారులు తియ్యటి మాటలు చెబుతారు. ఆ చమత్కారాలకు ఏలికలనే ముద్దు పేరుంది. బివేరాఫ్‌దెమ్! ☆

లోపలి పేజీల్లో.....

ఆటల్లో దెబ్బలపై పిల్లల్ని గాభరా పెట్టొద్దు... 10



అంటు మామిడి తోట ... 15

'పుట్టపాకకు మరో జాతీయ పురస్కారం' ... 21

'నన్ను చంపుకోండి, ఈ యువకుడ్ని వదిలేయండి'. 22, 23

ఇంకా...

ఆరోగ్యం 6, 7
జీవనశైలి 8
బాల కథ 11
బాల నేస్తాలు 12, 13
కచేరి 14
క్రీడారంగం 17
కథ 18, 19
పలుకుబడి 24

వగైరా........


ప్రైవేటీకరణా... ప్రైవేటీకరణా..
అంటూ వందసార్లు ఫోన్లో
జపం చేస్తేనేగాని.. లైన్ కలవదయ్యా!
GANGA DHAR


స్వర్ణాంధ్ర
ప్రైవేటీకరణలు
ఘోరాలు
కరువు
అప్పులు
పథకాల వైఫల్యం
వరదలు
సంస్కరణలు
GANGA DHAR


WAR
ఆఫ్ఘన్



అంతరిక్ష భారతం

తాతా శ్రీనివాసరావు

అంతరిక్ష పరిశోధనా రంగంలో భారత్ ఏనాడో అగ్రదేశాల సరసన చేరింది. చిన్న చిన్న రాకెట్లను పరీక్షించే స్థాయి నుండి భూస్థిర కక్ష్యలో కమ్యూనికేషన్ ఉపగ్రహాలను ప్రయోగించే సమోన్నత స్థాయికి చేరుకుంది. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అత్యంత ఆధునికమైన పిఎస్ఎల్‌వి-సి3 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడంతో అంతరిక్ష రంగంలో భారత కీర్తి పతాక సగౌరవంగా రెపరెపలాడుతోంది. అక్టోబర్ 22న శ్రీహరి కోట (షార్) నుండి పిఎస్ఎల్‌వి-సి3 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకుపోయింది. మన దేశానికి చెందిన టెక్నాలజీ ఎక్స్‌పెరిమెంటల్ శాటిలైట్ (టెస్)ను, బెల్జియం ఉపగ్రహం 'ప్రోబా', జర్మనీకి చెందిన 'బర్డ్' లను మూడింటినీ ఏక కాలంలో ఈ రాకెట్ అంతరిక్షంలో విజయవంతంగా ప్రవేశపెట్టింది. ప్రయోగాన్ని విజయవంతం చేయడానికి అరహరం శ్రమించిన శాస్త్రవేత్తల బృందంతో పాటు యావద్దేశం విజయానికి పులకించిపోయింది. ఇలాంటి ఎన్నో విజయాల మెట్లపై భారత అంతరిక్ష పరిశోధనా రంగం పురోగమిస్తూ వస్తోంది.

విజయ పరంపర

1962లో జాతీయ కమిటీ ఏర్పాటుతో అంతరిక్ష పరిశోధనకు పునాదులు పడ్డాయి. 1963లో తిరువనంతపురం సమీపంలోని తుంబా రాకెట్ ప్రయోగ కేంద్రం (టెర్ల్స్) నుండి మొదటి సౌండింగ్ రాకెట్‌ను ప్రయోగించడంతో మన అంతరిక్ష ప్రస్థానం ఆరంభమైంది. 1975లో ప్రయోగించిన తొలి ఉపగ్రహం ఆర్యభట్టతో భారత విజయ పరంపర ప్రారంభమైంది. 1969 ఆగస్టు 15న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) స్థాపనతో నిర్దేశిత లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధమైన కృషికి శ్రీకారం చుట్టారు. ప్రధానంగా భారత్ అంతరిక్ష చరిత్రను మూడు విధాలుగా విభజించవచ్చును. మొదటి దశలో 1960 నుండి1970 వరకు పోటీతత్వంతో అంతరిక్ష పరిశోధనలకు అవసరమైన నిర్మాణాలు. రెండో దశ 1980 నుండి 90 వరకు ప్రయోగాత్మక, ప్రయోగాల దశ. ఈ దశలో పలు ఉపగ్రహాలను, సౌండింగ్ రాకెట్లను ప్రయోగాత్మకంగా పరీక్షించారు. విజయవంతంగా వివిధ ఉపగ్రహాలను, రాకెట్లను ప్రయోగించారు. ఇక మూడో దశ 1990 నుండి సాధించిన విజయాలను మరింత స్థిరికరించుకోవడం, వాణిజ్య పరంగా సమాచారాన్ని, పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం. ఇన్నేళ్ళ సుదీర్ఘ యానంలో ఇస్రో చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన విజయాలను సాధించింది. కొన్ని అపజయాలనూ ఎదుర్కొంది. ఎంత ప్రతికూల పరిస్థితుల్లోనూ అపజయానికి కృంగిపోక, విజయం కోసం శ్రమించి సాధించిన ఘన చరిత్ర ఇస్రోకు ఉంది. ఈ రంగంలో స్వావలంబన దిశగా భారత శాస్త్రవేత్తలు అమోఘమైన కృషి చేశారు. పూర్తి స్థాయిలో స్వావలంబన సాధించడానికి మనం మరింతగా శ్రమించాల్సివుంది. ఈ రంగంలో ఇంకా ఎంతో సాధించాల్సివుంది.

సోవియట్ చేయూత

సౌండింగ్ రాకెట్ల ప్రయోగ దశ నుండి ఆధునిక భారీ రాకెట్లను, ఆధునిక ఉపగ్రహాలను సొంతంగా ప్రయోగించే స్థాయికి మన దేశం చేరుకోవడానికి సోవియట్ రష్యా ఇచ్చిన సహకారం ఎంతో విలువైంది. అంతరిక్ష పరిశోధనలపై మనం జాతీయ స్థాయి కమిటీని నియమించే నాటికే సోవియట్ ఈ రంగంలో ఎంతో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. 1962 నాటికే సోవియట్ అంతరిక్షంలోకి ఒక మహిళను పంపగలిగే స్థాయికి చేరుకుంది. రష్యా తరువాత 12 సంవత్సరాలకు గాని అమెరికా ఈ పని చేయలేకపోయింది. మన తొలి ఉపగ్రహం ఆర్యభట్ట నిర్మాణంలోనూ, దానిని ప్రయోగించడంలోనూ రష్యా మనకు ఎనలేని సహకారం అందించింది. 1975లో ఆర్యభట్టను సోవియట్‌లోని బైకనూర్ నుండి కాస్మోస్ రాకెట్ ద్వారా ప్రయోగించారు. 1979లో రెండో ప్రయోగాత్మక ఉపగ్రహం భాస్కర -1ను కూడా రష్యాలోని కాస్మోడ్రోమ్ నుండి కాస్మోస్ ఉపగ్రహం ద్వారా ప్రయోగించారు. రష్యా ఇచ్చిన సాంకేతిక మద్దతుతో 1980లో శ్రీహరి కోట (షార్) నుండి ఎస్ఎల్‌వి-3 లాంచింగ్ రాకెట్‌ను ఇస్రో ప్రయోగించింది. ఈ రాకెట్ రోహిణి ఉపగ్రహం ఆర్ఎస్-డి1ను అంతరిక్ష కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఆర్యభట్ట తరువాత ఇస్రో రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ భాస్కర-1, భాస్కర-2ను ప్రయోగించింది. 1981లో మొదటి కమ్యూనికేషన్ ఉపగ్రహం యాపిల్‌ను ప్రయోగించారు. రోహిణి ఉపగ్రహాలను వరసగా ఎస్ఎల్‌వి-3 లాంచింగ్ రాకెట్ ద్వారా ప్రయోగించారు. 1992లో ఏఎస్ఎల్‌వి రాకెట్ ద్వారా స్ట్రెచ్డ్ రోహిణి శాటిలైట్ సిరీస్(ఎస్ఆర్ఓఎస్ఎస్-1,2,సి, సి2) ఉపగ్రహాలను ప్రయోగించారు. బహుళ ప్రయోజన కమ్యూనికేషన్ ఉపగ్రహం ఇన్‌శాట్-1ఎ 1982లో మొదటిసారిగా ప్రయోగాత్మకంగా ప్రయోగించారు. ఈ సిరీస్‌లో వరుసగా తొమ్మిది ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది. మన దేశంలో కమ్యూనికేషన్లు, టెలివిజన్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు, అనూహ్యమైన ప్రగతిని సాధించడానికి వీలు కలిగింది. 1988 నుండి ఇండియన్ రిమోట్ సెన్సింగ్ శాటిలైట్స్(ఐఆర్ఎస్-1ఎ, 1బి, 1ఇ, పి2, 1సి,పి3, 1డి) సిరీస్‌ను పిఎస్ఎల్‌వి లాంచింగ్ రాకెట్ల ద్వారా ప్రయోగించారు. గత నెల ఇస్రో ప్రయోగించిన



భారత అంతరిక్ష పరిశోధ పితామహుడు
డాక్టర్ విక్రమ్ సారాభాయ్

జాతికే గర్వకారణం శ్రీహరికోట



భారత అంతరిక్ష పరిశోధనలో మన రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేట సమీపంలో ఉన్న శ్రీహరి కోటకు అగ్రస్థానం ఉంది. ఇక్కడ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్న రాకెట్ ప్రయోగ కేంద్రం ఉంది. ఫ్రెంచి గయానాలోని 'కౌరు' సాంకేతికంగా, భౌగోళికంగా రాకెట్ ప్రయోగాలకు అత్యంత అనువుగా ఉండడంతో ప్రథమ స్థానంలో ఉంది. భూమధ్య రేఖకు అతి దగ్గరగా 13 డిగ్రీల అక్షాంశంలో శ్రీహరి కోట ఉండడతో దీనికి ఎనలేని ప్రాధాన్యత ఏర్పడింది. ఇక్కడి నుండి భూమ్యాకర్షణ శక్తిని అధిగమించి రాకెట్ ప్రయోగాలను ఎలాంటి ఆటంకంలేకుండా జరుపుకోవచ్చని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఈ అవకాశం అమెరికా, రష్యాల్లో ఉన్న రాకెట్ ప్రయోగ కేంద్రాలకు కూడా లేదు. ఇక రక్షణ పరంగా కూడా తూర్పున బంగాళాఖాతం, పశ్చిమాన పులికాట్ సరస్సు ఉండడం వ్యూహాత్మకంగా కలిసి వచ్చింది. శ్రీహరి కోట నుండే తొలి రాకెట్ పిఎస్ఎల్‌విని ప్రయోగించారు. ఇక అప్పటి నుండి ఈ సంవత్సరం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న జియోసింక్రనస్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (జిఎస్ఎల్‌వి-డి1), అక్టోబర్ 22న ప్రయోగించిన అత్యంత ఆధునికమైన పిఎస్ఎల్‌వి-సి3 వరకు ఇక్కడి నుండే విజయవంతంగా ప్రయోగించారు. శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రంగా ఆవిర్భవించడానికి ఇస్రో వ్యవస్థాపక ఛైర్మన్ విక్రమ్ సారాభాయ్ కృషి ఎంతగానో ఉంది. శ్రీహరికోటను రాకెట్ ప్రయోగ కేంద్రంగా చేయాలని సారాభాయ్ ఈ ప్రాంతాన్ని 1963లో ఎంపిక చేయగా, దీనిని కేంద్ర ప్రభుత్వం 1969లో ఆమోదించింది. రాకెట్లను ప్రయోగించడంతో పాటు వాటికి అవసరమయ్యే భారీ ఇంధన మోటార్లను కూడా ఇక్కడే తయారు చేస్తున్నారు. రాకెట్‌ను ప్రయోగించడానికి అవసరమైన అన్ని రకాల పరీక్షలు చేయడానికి అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఇక్కడ అందుబాటులో ఉంది. అన్ని ముఖ్య విడిభాగాల పని తీరును స్థిర పరీక్షల ద్వారా తెలుసుకోవడానికి అవసరమైన సౌకర్యాలు ఉన్నాయి. భారీ రాకెట్ల ప్రయోగానికి అవసరమైన లాంచింగ్ ప్యాడ్‌లతో పాటు, చిన్నచిన్న సౌండింగ్ రాకెట్లను ప్రయోగించిందుకు వీలుంది. రాకెట్ మార్గాన్ని తెలుసుకునే ఆధునిక వ్యవస్థ, మొబైల్ సర్వీస్ టవర్, ద్రవ ఇంధనం నిల్వ చేయడానికి అవసరమైన వసతులు, అన్ని వసతులున్న కంట్రోల్ సెంటర్ ఉంది. రాకెట్ ప్రయోగానికి సిద్ధం చేసిన తరువాత కావాల్సిన సూచనలు ఇవ్వడానికి ఇక్కడ అన్ని సాంకేతిక వనరులు ఉన్నాయి. రాకెట్ లాంచింగ్ ప్యాడ్ నుండి ఆరు కిలోమీటర్ల దూరంలో నిర్మించిన సర్వీస్ టవర్ నుండి ఉన్నత స్థాయి శాస్త్రవేత్తలు ప్రయోగాన్ని విజయవంతం చేయడానికి అవసరమైన సూచనలు ఇస్తారు. ప్రయోగించిన రాకెట్లను మూడు వేల కిలోమీటర్ల వరకు వీక్షించి, వాటి జాడను తెలిపే పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన రాడార్లు ఇక్కడ ఉన్నాయి. ఇంతటి ఘన చరిత్ర ఉన్న ప్రాంతం మన రాష్ట్రంలో ఉండడం నిజంగా మనకు గర్వకారణం. అంతరిక్ష శాఖ (డిఓఎస్) పరిధిలో ఇస్రోకు అనుబంధంగా షార్ కాకుండా 11 సెంటర్లు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా తిరువనంతపురం సమీపంలోని తుంబా రాకెట్ కేంద్రం, ఒరిస్సాలోని బాలాసూర్ రాకెట్ ప్రయోగ కేంద్రాలు ఉన్నాయి. మిగిలినవి వివిధ దశల ప్రయోగ కేంద్రాలు.

లాంచింగ్ రాకెట్ జిఎస్ఎల్‌వి ఈ సిరీస్‌లో చివరిది, అత్యంత ఆధునికమైనది. దీని ప్రయోగంలో రష్యా సరఫరా చేసిన క్రయోజనిక్ ఇంజన్‌ను వినియోగించారు. అంతరిక్ష రంగంలో మన దేశం అనేక విజయాలు సాధించినప్పటికీ క్రియోజనిక్ ఇంజన్లను స్వంతంగా తయారు చేసుకోవడంలో వెనుకబడి ఉన్నాం. ఇప్పుడు ఈ రంగంపై మన శాస్త్రవేత్తలు ప్రత్యేక శ్రద్ధ పెట్టి కృషి చేస్తున్నారు.

అమెరికా ఆంక్షలు

అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన అనేక విజయాలు అమెరికాను కలవరానికి గురిచేశాయి. రాకెట్లను విజయవంతంగా ప్రయోగించడం అంటే ఇదే పరిజ్ఞానంతో ఆధునిక క్షిపణులను మన దేశం తయారు చేస్తోందని అమెరికా అనుమానిస్తోంది. సోవియట్ పతనం అనంతరం అంతరిక్షంలో మన దేశం పూర్తి స్థాయి స్వావలంబన దిశగా అనేక ప్రయోగాలు చేసింది. రాకెట్లలో వాడే క్రయోజనిక్ ఇంజన్లను మాత్రం రష్యా నుండే తెప్పించుకునేది. ఈ ఇంజన్లను మనకు అందకుండా చేయడానికి అమెరికా ఏవో కుంటి సాకులు చూపి రష్యాపై తీవ్రమైన ఒత్తిడి చేసి సరఫరా నిలిపివేయించింది. రష్యాలో అమెరికా తొత్తుగా ఉన్న ఎల్సిన్ అధ్యక్షుడిగా ఉండడంతో మనకు ఈ ఇంజన్లు అందకుండా తేలికగానే అమెరికా నిలువరించగలిగింది. దీనితో జిఎస్ఎల్‌వి ప్రయోగంలో జాప్యం జరిగింది. అణ్వస్త్ర పరీక్షలు జరిపారనే నెపంతో అమెరికా మన అంతరిక్ష పరిశోధనలపైనా, ఇస్రోపైనా ఆంక్షలు విధించింది. ఏడు ఇంజన్లు సరఫరా చేస్తామని రష్యా చేసుకున్న ఒప్పందం అమలు కాకుండా అమెరికా అడ్డుకుంది. ఇప్పుడు రష్యా వీటిలో రెండు ఇంజన్లను సరఫరా చేయడంతో జిఎస్ఎల్‌విని ప్రయోగించగలిగాం. 2004-2005 నాటికి మనమే స్వంతంగా క్రయోజనిక్ ఇంజన్లను తయారు చేసుకునే సామర్థ్యం పొందగలమని ఇస్రో ఛైర్మన్ కస్తూరి రంగన్ ప్రకటించారు. 2004 నాటికి

రాకెట్ అంటే.....?



అంతరిక్ష పరిశోధనలో మనకు తరచూ వినిపించే పదం రాకెట్. ఉపగ్రహాలు. మరి ఈ రెండింటికి ఉన్న తేడా ఏమిటి? ఏది ఏవిధంగా పని చేస్తుందో తెలుసుకోవాలన్న ఆసక్తి అందరికీ ఉంటుంది. రాకెట్ మనం రోజూ చూస్తున్న విమానం లాంటిదే. కాకపోతే ఇది పూర్తిగా పరిమాణంలో చిన్నదిగా ఉండి సాంకేతికంగా ఉన్నత స్థాయిలో ఉంటుంది. ఇవి ప్రధానంగా వాహక రాకెట్లు మాత్రమే. 1500 కిలోల బరువు వరకు ఉన్న ఉపగ్రహాలను కూడా మన దేశం తయారు చేసిన రాకెట్లు అంతరిక్షంలో కక్ష్యలోకి తీసుకుపోగలవు. మన దేశం ఇప్పటి వరకు పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (పిఎస్ఎల్‌వి), అగ్యూమెంటెడ్ పోలార్ శాటిలైట్ వెహికిల్ (ఎఎస్ఎల్‌వి), జియోసింక్రనస్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (జిఎస్ఎల్‌వి) సిరీస్‌లో పలు రాకెట్లను ప్రయోగించింది. ఈ సిరీస్‌లోనే అత్యంత ప్రధానమైన జిఎస్ఎల్‌వి-డి1 రాకెట్ లాంచింగ్ వెహికిల్‌ను మన దేశం విజయవంతంగా ప్రయోగించడంతో అన్ని దేశాల కంటే అమెరికా ఎక్కువ కలవరపడింది. జిఎస్ఎల్‌వి పరిజ్ఞానం ద్వారా 5000 కిలోమీటర్ల దూరంలోని సుదూర లక్ష్యాలను ఛేదించ కలిగే శక్తివంతమైన క్షిపణులను తేలికగా తయారు చేయవచ్చును. అణ్వాస్త్రాలు ప్రయోగించే క్షిపణులను కూడా ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించి మన దేశం తయారు చేసుకోవచ్చును. వేలాది కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించడానికి మన దేశం రూపొందిస్తున్న 'సూర్య' క్షిపణుల్లో ఈ పరిజ్ఞానాన్ని మన దేశం వినియోగించవచ్చని కూడా అమెరికా రక్షణ నిపుణులు అనుమానిస్తున్నారు. అందుకే అమెరికా జిఎస్ఎల్‌వి రాకెట్ తయారీకి అవసరమైన క్రయోజనిక్ ఇంజన్లను రష్యా నుండి మన దేశానికి అందకుండా చాలా కాలం అడ్డుకుంది. ఇప్పటి వరకు మన దేశం అంతరిక్షంలోకి పంపించిన ఉపగ్రహాలను ఈ మూడు రకాల రాకెట్ల ద్వారానే కక్ష్యలోకి పంపించాం.

ఇస్రో నూతన పథకాలు

ఇస్రో 2004 వరకు చేవట్టనున్న వథకాలను ప్రకటించింది. ఐ.ఆర్.ఎస్. సిరీస్‌లో 2002-2003 సంవత్సరంలో పి-6, పి-5 రాకెట్లను ప్రయోగించనుంది. ఇన్‌శాట్ ఉపగ్రహాల సిరీస్‌లో 2001-2002 సంవత్సరంలో 3ఎ, 3సి, 2002-03 సంవత్సరాల్లో 3ఇ, 2003-04 సంవత్సరాల్లో 3డి ఉవగ్రహాలను ప్రయోగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. వీటితో పాటు 2002-03 సంవత్సరాల్లో జిశాట్-2, జిశాట్-3ని ప్రయోగిస్తారు. పి.ఎస్.ఎల్.వి. రాకెట్ సిరీస్‌లో 2002 సి-4, 2002-03 సంవత్సరాల్లో సి-5, సి-6, 2003-04 సంవత్సరాల్లో సి-7ను ప్రయోగిస్తారు. జి.ఎస్.ఎల్.వి. రాకెట్ల సిరీస్‌లో 2002-03 సంవత్సరాల్లో డి-2, డి-3, 2003-04 సంవత్సరాలో సి-1ను ప్రయోగిస్తారు. ఇది కాక పూర్తిగా వ్యవసాయ రంగ సమాచారం కోసం ఒక ఉపగ్రహాన్ని కూడా ప్రయోగించనున్నారు. చంద్రుడిపై పూర్తి స్థాయి అధ్యయనానికి ఒక కమీషన్‌ను కూడా నియమిస్తున్నట్లు ఇస్రో ఛైర్మన్ కస్తూరి రంగన్ చెప్పారు.

ఉపగ్రహం అంటే.....?



అంతరిక్ష పరిశోధనకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించేవే ఉవగ్రహాలు. ఇవి నేరుగా అంతరిక్షంలోకి వెళ్ళలేవు. వీటిని రాకెట్లకు అమర్చి అంతరిక్షంలోకి పంపిస్తారు. నిర్దేశిత స్థిర కక్ష్యలో ఉవగ్రహాలను రాకెట్లు ప్రవేశపెట్టిన వెంటనే అవి పని ప్రారంభిస్తాయి. ఒక సారి కక్ష్యలో ప్రవేశపెట్టిన తరువాత గ్రౌండ్ కంట్రోల్‌తో ఇవి సంబంధాలు కలిగి ఎప్పటికప్పుడు సమాచారాన్ని పంపిస్తాయి. మన దేశం ఇప్పటి వరకు 30కి పైగా ఉపగ్రహాలను అంతరిక్షంలో ప్రవేశపెట్టింది. వీటిలో కొన్ని కాల పరిమితికి ముందుగానే పని చేయడం మాని వేశాయి. మరి కొన్ని వాటి నిర్దేశిత గడువు ముగిసినా ఇంకా పని చేస్తూనే ఉన్నాయి. మన దేశం ప్రధానంగా తొలి రోజుల్లో ప్రయోగాత్మక ఉవగ్రహాలను పంపించింది. తొలి ఉవగ్రహం ఆర్యభట్టను మన దేశం విజయవంతంగా ప్రయోగించ గలిగింది. ఇప్పటి వరకు మనం ప్రధానంగా సమాచార, ప్రసారాల అవసరాలకు సంబంధించిన ఉపగ్రహాలను, భూమి, భౌగోళిక స్వరూపం, సముద్రం, ఇతర సహజ సంపదల గురించి తెలుకోవడానికి ఉవయోగవడే రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలను ప్రయోగించాం. ఈ సిరీస్‌లో ప్రధానంగా సమాచారం కోసం ఇన్‌శాట్ ఉపగ్రహాలు, రిమోట్ సెన్సింగ్ కోసం ఐఆర్ఎస్ ఉపగ్రహాలను ప్రయోగించాం. వీటిల్లో యాపిల్‌తో పాటు ఇతర ఉపగ్రహాలు ఉన్నాయి.

మన దేశం జివిఎస్ఎల్వి సిరీస్‌తో పాటు పివిస్ఎల్వి సిరీస్ వెహికిల్స్ ప్రయోగానికి మార్గం సుగమం అయినట్లే.

బహుళ ప్రయోజనాలు

ఉపగ్రహాల ప్రయోగం ప్రారంభమైన తరువాత వాటిని వాణిజ్య అవసరాలకన్నా సామాజిక అవసరాలకు ఎక్కువగా ఉపయోగించుకోవాలని భావించారు. అభివృద్ధికి కావాల్సిన కమ్యూనికేషన్ సౌకర్యాలు, అక్షరాస్యత, దూర విద్య, గ్రామీణాభివృద్ధి, వాతావరణ పరిశోధనలు, వ్యవసాయ అవసరాలు, సహజ వనరులు, సముద్ర సంబంధమైన పరిశోధనలు, దేశరక్షణ, పర్యావరణం, భూ స్వరూపం, ఖనిజ నిక్షేపాలు, పట్టణాభివృద్ధి, జల వనరులు, భౌగోళిక స్వరూపం వంటి అనేక రంగాల కోసం ఈ వరిజ్ఞానం ఉపయోగపడుతోంది. ఈ ఉపగ్రహాల ద్వారానే భూమిపై ఉన్న ప్రతి దానిని ఒక డయామీటర్ వ్యాసార్థంలో కూడా ఫొటోలు తీయగలిగే అవకాశాలు ఉన్నాయి. గూఢచర్య ఉపగ్రహాలు చేసే పని ఇదే. ఆర్యభట్టను విజయవంతంగా ప్రయోగించి అంతర్జాతీయ ప్రమాణాలకు అనువుగా అంతరిక్ష పరిశోధన రంగంలో ప్రయోగాలు చేపట్టగల సత్తా ఉందన్న విషయాన్ని భారత్ చాటుకుంది. రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలకు రూపకల్పన చేసిన ఈ రంగంలో మన దేశం ఎంతో ప్రగతిని సాధించింది. చాలా దేశాలు ఈ విషయంలో మన దేశంపైనే ఆధారపడుతున్నాయి. 1975-76లో శాటిలైట్ ఇన్‌స్ట్రుమెంట్ టెలివిజన్ ఎక్స్‌పెరిమెంట్ (సైట్) ప్రయోగం ద్వారా విద్యా బోధనకు ఉపయోగించుకోవడం ఎలాగో మనదేశం ప్రపంచానికి తెలియచెప్పింది. ఇన్‌శాట్ సిరీస్ ప్రయోగంతో టెలికమ్యూనికేషన్ల రంగంలో మన దేశం అద్వితీయ ప్రగతిని సాధించడానికి ఉపయోగపడింది. దేశదేశాలతో టెలిఫోన్ సౌకర్యం ఏర్పడింది. రిమోట్ సెన్సింగ్ వలన అడవులు, మైదానాలు, బంజరు భూములు, నేలల్లో ఉన్న రకాలు లభ్యమవుతుండడం వలన వ్యవసాయ రంగం అభివృద్ధిలో కీలక పాత్రను పోషిస్తోంది. ఐఆర్ఎస్ ఉపగ్రహం ప్రపంచంలో ఉన్న శక్తివంతమైన రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాల్లో ఒకటి. శ్రీహరి కోటలో రాకెట్ ప్రయోగ కేంద్రాన్ని 1971లో నిర్మించిన తరువాత మొదట ఎస్ఎల్వి-3ని ప్రయోగించారు. దీనితో స్వంతంగా రాకెట్లను ప్రయోగించగలిగిన దేశాల్లో మన దేశం ఆరవదిగా నిలిచింది. 1984లో మన దేశానికి చెందిన వ్యోమగామి రాకేష్ శర్మను సోవియట్ వ్యోమనౌకలో అంతరిక్షంలోకి పంపించడంతో వ్యోమగాములను పంపించడంలో మన దేశంలో 14వ దేశం గుర్తింపు పొందింది. అంతరిక్ష పరిజ్ఞానం సైనిక అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. అంతరిక్ష పరిజ్ఞానాన్ని శాంతి ప్రయోజనాల కోసం, సామాజిక అవసరాల కోసం, సమాజాభివృద్ధి కోసం ఉపయోగించుకున్నప్పుడే వేలాది కోట్లు వెచ్చించి చేస్తున్న అంతరిక్ష పరిశోధనలకు ప్రయోజనం ఉంటుంది. వీటిని సమాజ హితం కోసం కాక మానవాళి విధ్వంసానికి, ఆయుధ పాటవాన్ని అభివృద్ధి పరచుకోవడానికి, ప్రపంచ దేశాలపై ఆధిపత్యం సాధించడానికి ఉపయోగించుకుంటే వినాశనం తప్పదు. ☆

ప్రయోగించిన ఉపగ్రహాలు

1975: ఏప్రిల్ 19న మొదటి శాటిలైట్ ఆర్యభట్ట ప్రయోగం. ఏప్రిల్ 1న ప్రభుత్వ సంస్థగా మారిన ఇస్రో.

1979: భూపరిశోధన కోసం ప్రయోగాత్మక ఉపగ్రహం భాస్కర-1 ప్రయోగం. 1981 నవంబర్ 20న భాస్కర -2 ప్రయోగం.

1981: జూన్ 19న ఎరినా పాసింజర్ పేలోడ్ (ఆపిల్) ప్రయోగం

రోహిణి సిరీస్‌లో ప్రయోగించిన ఉపగ్రహాలు :

1980 జులై 18న రోహిణి ఆర్.ఎస్.-1; 1981 మే 31 ఆర్ఎస్-డి1; 1983 ఏప్రిల్ 17 ఆర్ఎస్‌డి-2; 1987 మార్చి 24 స్ట్రచ్‌డ్ రోహిణి శాటిలైట్ సిరీస్ : (ఎస్ఆర్ఓఎస్ఎస్)-1; 1988 ఏప్రిల్ 13 ఎస్ఆర్ఓఎస్ఎస్-2; 1992 మే 20 ఎస్ఆర్ఓఎస్ఎస్-సి; 1994 మే 4 ఎస్ఆర్ఓఎస్ఎస్-సి2లను ప్రయోగించారు.

ఇండియన్ నేషనల్ శాటిలైట్ (ఇన్‌శాట్) సిరీస్‌లో ప్రయోగించిన ఉపగ్రహాలు :

1982 ఏప్రిల్ 10న ఇన్‌శాట్-1ఎ; 1983 ఆగస్టు 30 ఇన్‌శాట్-1బి; 1988 జులై 21; ఇన్‌శాట్-1సి; 1990 జూన్ 12న ఇన్‌శాట్-1డి; 1992 జులై 10 ఇన్‌శాట్-2ఎ; 1993 జులై 23 ఇన్‌శాట్-2బి; 1995 డిసెంబర్ 7 ఇన్‌శాట్-2సి; 1997 జూన్ 4 ఇన్‌శాట్-2డి; 1999 ఏప్రిల్ 3 ఇన్‌శాట్-2ఇ; 2000 మార్చి 22న ఇన్‌శాట్-3బి లను ప్రయోగించారు.

ఇండియన్ రిమోట్ సెన్సింగ్ శాటిలైట్స్ (ఐఆర్ఎస్) సిరీస్‌లో ప్రయోగించిన ఉపగ్రహాలు :

1988 మార్చి 17 ఐఆర్ఎస్-1ఎ; 1991 ఆగస్టు 29 ఐఆర్ఎస్-1బి; 1993 సెప్టెంబర్ 20 ఐఆర్ఎస్-1ఇ; 1994 అక్టోబర్ 15 ఐఆర్ఎస్-పి2; 1995 డిసెంబర్ 28 ఐఆర్ఎస్-1సి; 1996 మార్చి 21 ఐఆర్ఎస్-పి3; 1997 సెప్టెంబర్ 29 ఐఆర్ఎస్-1డిలను ప్రయోగించారు.

2001 అక్టోబర్ 22న టేస్ ఉపగ్రహాన్ని ప్రయోగించారు

ఈ ఉపగ్రహాలను ప్రయోగించడానికి ఎస్ఎల్వి-3, ఎఎస్ఎల్వి, పిఎస్ఎల్వి, జిఎస్ఎల్వి సిరీస్‌లో పలు రాకెట్‌లను ఇస్రో ప్రయోగించింది.

డా॥ గోపాలం శివన్నారాయణ,
న్యూరాలజిస్టు
డా॥ వి.శ్రీనివాసరెడ్డి,
న్యూరాలజిస్టు, విజయవాడ

ప్రతి ప్రాణి ఆయువు మెదడులో ఉంటుంది. మెదడు అంటే ప్రాణి. ప్రాణి అంటే మెదడు. మెదడు బ్రతికే వుంటే ఆ ప్రాణి బ్రతికి వున్నట్లు. మెదడు నిదురపోతే – ప్రాణి నిదురపోయినట్లు. మెదడు చనిపోతే ప్రాణి చనిపోయినట్లు. ఇక్కడ ప్రాణి అంటే మన కంటికి కనిపించే అతి చిన్న క్రిమి. కీటకం మొదలు ఉన్నతమైన మానవజాతి వరకు అని అర్థం.

ప్రపంచంలో ఏదైనా జబ్బు మెదడుకు తగిలితే ఫిట్స్ రూపంలో కనిపిస్తుంది. అలాగే అదే జబ్బులు ఊపిరితిత్తులకు అయితే దగ్గుగా, గుండెకి అయితే చిన్న భూకంపం అంటారు. అదే పెద్దగా జరిగితే పెద్ద భూకంపం అంటారు. అలాగే ఫిట్స్‌లో కూడా చిన్న, పెద్ద ఫిట్స్ వుంటాయి.

ఎలాగైతే, ఎప్పుడు ఎక్కడ భూంకంపం వస్తుందో చెప్పలేమో అలాగే ఫిట్స్‌ని కూడా ముందుగా ఊహించటం కష్టం. ప్రతి క్షణం ప్రాణిని కాపాడే మెదడు పని చేయకుండా పోవటం వలన ప్రాణి స్పృహ కోల్పోయి దెబ్బలైనా తగలవచ్చు. ఈ కారణం వలన ఈ రోగం బారిన పడిన రోగి చాలా అభద్రతా భావం, న్యూనతకు గురికావటం, సంఘంలో చులకనగా చూడబడటం జరుగుతుంది. కాని ప్రపంచంలో ఇంతవరకు ఫిట్స్ వలన చనిపోయిన సందర్భాలు చాలా చాలా తక్కువ. కాని ఫిట్స్ నుంచి కోలుకున్నాక ఆ మనిషి భూమి మీద ఉన్న ఏ ఇతర మనిషికంటే కూడా తక్కువ కాదు. కాని దురదృష్టవశాత్తు అజ్ఞానం అనే కారుమబ్బులు కమ్మిన నిరుపేద దేశాల్లో ఈ ఫిట్స్ రోగులు ఎంతో మానసిక హింసకు గురి అవుతున్నారు. ఎవరికి వారు సమస్య తమ

టీచరు 'అజ్ఞానం' వలన అతి చిన్న వయస్కురాలైన ఎనిమిదేళ్ళ పాప ఈ ఫిట్స్ జబ్బు వలన పడిన మానసిక హింస, ఆ తల్లిదండ్రులకు జరిగిన మానసిక సంఘర్షణ మనసున్న ఏ మనిషినైనా కలవరపరచక మానదు. ఈ సంఘటన నాకు జరిగితే... నేను ఊహించలేకపోతున్నాను.

'ఫిట్స్' గురించి ప్రతి మనిషికి అవగాహన అవసరం. ఫిట్స్ రోగి కూడా మనలాంటి మనిషే. మనం ఎంతమాత్రం ఆ జబ్బు నుంచి దూరంగా ఉండలేము అని తెలియాలి.

ప్రతి డాక్టరు కూడా ఈ విషయాల్ని పేషెంటుకి, రోగి బంధువులకు విడమరచి చెప్పటానికి కొంచెం శ్రమ తీసుకోవాలి. అది ఆ రోగి కుటుంబం మొత్తానికి ఎనలేని సేవ.

విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిన అల్లోపతి వైద్యంతో ఫిట్స్‌ని అదుపు చేయగలగటం చాలా సులువు.

ఫిట్స్ రోగులను కించపరచకండి



గుండెపోటుగా, వంటికి అయితే జ్వరంగా, ఎముకకు అయితే విరగటంగా, ప్రేగుకు అయితే వాంతి, విరేచనంగా జరుగుతుంది.

ఊపిరితిత్తులు వున్న వారికి దగ్గు తప్పదు. అలాగే పైన అవయవాలు వున్న వారికి ఆ అవయవాల జబ్బు లక్షణాలు తప్పవు. అలాగే మెదడు వున్న వారికి 'ఫిట్స్' రాక తప్పవు.

శరీరంలో వున్న ప్రతి అవయవాన్ని, ప్రతి అణువుని పూర్తిగా తన అధీనంలో ఉంచుకొని ప్రాణి జీవన గతుల్ని నిర్దేశించేది ఆ ప్రాణి మెదడు. అలాంటి మెదడుకి జబ్బు చేసినపుడు శరీరంలోని అన్ని అవయవాలు స్పృహ కోల్పోయి కకావికలంగా, ప్రళయంలో చిక్కుకు పోయినట్లుగా ప్రవర్తించే గొప్ప భయానక పరిస్థితి పేరే ఫిట్స్ (మూర్ఛ) లేక కమ్ములు. భూమి ఉన్నచోట భూకంపం తప్పదు. ఆకాశం ఉన్నచోట పిడుగు పడక తప్పదు. సముద్రం వున్నచోట ఉప్పెన, అగ్నిపర్వతం వున్నచోట పేలుడు తప్పదు. అలాగే మెదడు వున్నచోట ఫిట్స్ తప్పవు. భూమి చిన్నగా కంపించితే

దాకా వస్తే కాని పట్టించుకోని ఉదాశీనతతో వున్నా నిజంగానే ఆ సమస్య వారికి వచ్చినప్పుడు వాళ్ళకు ధైర్యాన్ని, ఆత్మబలాన్ని సరైన వైద్యాన్ని అందించే వారు ఎవరో కూడా తెలుసుకోలేని దౌర్భాగ్యం, నిరాశకు లోనవుతున్నారు.

అందువలన ప్రతి మనిషి తన తోటివారి కష్టాన్ని, సుఖాన్ని నిశితంగా గమనిస్తూ ఉండాలి. వీలైనంత వరకు వారికి మంచి మార్గాన్ని, మంచి సలహాను లేదా ఎంతో కొంత ఆర్థిక సహాయాన్ని అందించాలి.

ఒక చక్కటి తెలివిగల బిడ్డకి విధివశాత్తు మెదడువాపు వచ్చి ఫిట్స్ జబ్బు వచ్చింది. ఆ బిడ్డ చదువులో కొంచెం వెనుకబడింది. ఆ టీచరు ఆ బిడ్డను బెదిరించటం కోసం మూడవ తరగతి నుండి ఒక్క రోజు రెండవ తరగతిలో (శిక్ష రూపంలో) కూర్చోబెట్టింది. ఆ బిడ్డ అవమానం భరించలేక స్కూలు రెండో అంతస్థు నుండి క్రిందకు దూకి ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. ఈ విషయాన్ని ఆ బిడ్డ తల్లి హైదరాబాద్ నుంచి వచ్చి నాకు చెప్పి ఏడ్చినపుడు చాలా బాధ కలిగింది.

ఈ రోగానికి వైద్యం చేయటానికి చాలా ఓర్పు, నేర్పు అవసరం.

ఇంగ్లీషు మందులు ఎందుకు సరిగా పని చేయటం లేదు?

ఇంగ్లీషు మందులు వాడుతున్నాము అయినా తగ్గలేదు. అందుకని వేరే వైద్యానికి వెళ్ళాము అని చాలా మంది పేషెంట్లు చెబుతుంటారు. ఈ విషయంలో డాక్టర్ల వైపు నుంచి కొన్ని కారణాలు, పేషెంటు వైపు నుంచి కొన్ని కారణాలు వున్నాయి.

డాక్టరు వైపు :

(1) మందుల మీద పూర్తి అవగాహన లేకపోవటం వలన, (2) ఖరీదైనవి, కొత్తరకం వాడి తగ్గించవచ్చు అని అపోహ. (3) ఫిట్ ఫిట్‌కి ఎక్కువ ఎక్కువ మందులు కలుపుకొని పోవటం, (4) పేషెంటు చెబుతున్న విషయాల్ని సరిగా అర్థం చేసుకోకపోవటం, (5) పేషెంటు మీద సానుభూతి లోపించటం వంటివి డాక్టరు వైపు కారణాలు.

పేషెంటు కారణాలు :

(1) సొంత వైద్యం, సగం సగం పరిజ్ఞానం,

(2) డాక్టరు మీద, సైన్సు మీద అవగాహన, నమ్మకం లేకపోవటం (3) నిర్లక్ష్య ధోరణి, మందుల్ని సరిగా వాడకపోవడం, డోసుల్ని తమంతట తామే మార్చుకోవటం (4) ఆర్థిక దుస్థితి, (5) మాయదాక్టర్ల ప్రలోభానికి లోనై ఇంగ్లీషు మందులు వాడటం మానివేయటం.

మూర్ఛలు (ఫిట్స్) గురించి

తెలుసుకోవలసిన ముఖ్య విషయాలు :

ఫిట్స్ అనగా మెదడులో జరిగే తీవ్రమైన విద్యుత్ ప్రకంపనాలు బయటకు ఫిట్స్‌లాగ కనిపిస్తాయి. మెదడుకు ఏ విధమైన ఇబ్బంది కలిగినా ఫిట్స్ రావచ్చు. ఫిట్ అనేది ఒక రోగ లక్షణం మాత్రమే. ఫిట్ అనేది రోగం కాదు. అనేక రోగాలలో కనపడే ఒక లక్షణం.

తీసుకోవలసిన జాగ్రత్తలు :

ఫిట్ వలన ప్రాణానికి హాని తక్కువ. ముఖ్యంగా ఫిట్ వచ్చినపుడు రోగి వున్న పరిస్థితి వలన ప్రమాదం ఉంటుంది. ఫిట్స్ వున్న రోగి ప్రమాదకర పరిస్థితులకు దూరంగా వుండాలి (నిప్పు, నీరు, వాహనములు నడపడం).

ఫిట్స్ మొదలుకాక ముందే తెలిస్తే నోటిలో మెత్తటి గుడ్డ పెట్టాలి. ఫిట్స్ మొదలు అయ్యాక గట్టి వస్తువులుకాని, వ్రేళ్ళుకాని నోటిలో పెట్టరాదు.. రోగికి దెబ్బలు తగలకుండా పరుపుమీద కాని, నేలమీద కాని పడుకోబెట్టాలి. రోగిని గోడుగా వుంచి శ్వాస బాగా ఆడేట్లుగా చూడాలి.

ప్రమాదకర ఫిట్ లేక స్టేటస్ ఎపిలెప్టికస్ అంటే ఏమిటి?

(1) ఒక అరగంటలో రెండు అంతకంటే ఎక్కువ ఫిట్‌లు, (2) ఫిట్‌కి ఫిట్‌కి మధ్యలో పూర్తి స్పృహ రాకపోవటం. (3) ఒక ఫిట్ వచ్చి కనీసం అరగంటపాటు స్పృహ రాకపోవటం.

ఈ పరిస్థితులలో వెంటనే దగ్గరలో గల అర్హత కలిగిన వైద్యున్ని సంప్రదించాలి.

ఫిట్స్ వున్న రోగి తన చిరునామా, వైద్య వివరాలు, వైద్యుని పేరు, ఫోను నెంబరు గల గుర్తింపు కార్డును ఎల్లప్పుడూ దగ్గర ఉంచుకోవాలి.

మూర్ఛ వైద్యం – వైద్య పరంగా చాలా చిన్న సమస్య, కాని సాంఘికంగా మూర్ఛ రోగికి అది చాలా గడ్డు సమస్య. సమాజం ఈ జబ్బుని సరిగా అర్థం చేసుకొని, మూర్ఛరోగి కూడా మిగిలిన మనుషుల్లాగా జీవనం సాగించటం కోసం సమాజంలోని ప్రతి ఒక్కరిని జ్ఞానవంతులుగా మార్చాలి.

ఈ విషయంలో ఈ మూర్ఛ గురించి పూర్తిగా, బాగా తెలుసుకోవలసిన వారు రోగి తల్లిదండ్రులు, టీచర్లు, స్కూలు యాజమాన్యం, ప్రైవేటు, ప్రభుత్వ డాక్టర్లు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థలు, ఉపాధి కల్పన చేయగలిగిన ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు. ఇంతమంది సహకారంతోనే ఒక మూర్ఛరోగి మిగిలిన మనుషుల్లాగా సంతోషంగా ఉండగలడు. ☆

డాక్టర్ సలహాలు

నా వయస్సు 20సంవత్సరాలు. నా కుడి భుజం వెనక భాగాన కిందికి నడుము వరకు అరచేయంత వెడల్పుతో మచ్చ ఏర్పడింది. మిగతా భాగం కంటే ఈ ప్రాంతంలో వెంట్రుకలు ఎక్కువగా ఉంటాయి. డాక్టర్లకు చూపిస్తే ఇది పుట్టమచ్చ లాంటిదే. ఏం కాదన్నారు. దీనివల్ల ఏ బాధ లేకున్నా చూడటానికి చాలా వికారంగా ఉంది. సర్జరీ వల్ల నయమవుతుందా? ఎంత ఖర్చు అవుతుంది?

– అనూష, విశాఖ

మీరు మీ పుట్టుమచ్చకు సంబంధించి ప్లాస్టిక్ సర్జన్‌ను సంప్రదించండి. ఖర్చు ఐదువేలరూపాయల వరకు ఉండవచ్చు. ఈ పుట్టుమచ్చ సహజంగా 10-20 సంవత్సరాల వయస్సులో మొదలవుతుంది. ప్రమాదంలేనిది.

నాకు మూడు నెలల నుండి తామర సోకింది. నిర్లక్ష్యం కారణంగా పెద్దదయ్యింది. తరువాత ఆయింట్‌మెంట్స్ వాడితే తగ్గినా మచ్చలు మాత్రం అలాగే వున్నాయి. ఈ మచ్చలు శరీరంలో కలిసిపోవాలంటే ఎలా? తేనే రాస్తే ఫలితముంటుందా?

– బి.వి.నాయుడు, కొత్తమల్లంపేట

మొదట మీరు వ్యాధి(తామర) తగ్గినదా లేదా అన్న విషయాన్ని చర్మవ్యాధుల నిపుణుల దగ్గరకు వెళ్ళి నిర్ధారణ చేసుకోవాలి. తామరకు సరియైన వైద్యము చేయాలి. పైపూత మందుతోపాటు మాత్రలు కూడా నాలుగు,ఆరు వారాలు పాటు తీసుకోవాలి. ఈ విధంగా సరియైన వైద్యం తీసుకున్న తరువాత మచ్చకు ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్ అవసరం లేదు. ఆరు నెలలనుంచి సంవత్సరం లోపు మచ్చ దానంతటఅదే తగ్గిపోతుంది.

డాక్టర్ కె. విజయకుమార్ రాజు,

ఎం.డి.(డర్మటాలజీ) చర్మవ్యాధుల నిపుణులు, ఒంగోలు.

★ ★ ★ ★

నా వయస్సు 19. రెండేళ్ళ క్రితం నా ఐదు పళ్ళు పుచ్చిపోతే వాటిని కడిగి సిమెంట్ చేశారు. అయితే కొద్దిరోజుల నుండి పంటి చిగుళ్ళ నుండి రక్తం కారుతోంది. దీనికి పరిష్కారం ఏమిటి?

– చీరా విజయలక్ష్మి, విశాఖ

పంటిలో సెకండరీ ఇన్‌ఫెక్షన్ ఉండినచో చీము,రక్తము రావుటకు అవకాశం ఉంది. పళ్ళను శుభ్రపరచుట మరియు రూట్‌కెనాల్ ట్రీట్‌మెంట్ థెరపీ ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చు. విధిగా దంతవైద్యుని సంప్రదించి తగు వైద్యము తీసుకొనవలెను.

నా వయస్సు 18 సంవత్సరాలు. నా పళ్ళు కొంచెం ఎత్తు. ఆర్థోగ్నాతిక్ సర్జరీ ద్వారా ఒక్క రోజులో ఎత్తుగా వున్న పంటి ఎముకలను, దవడను తగ్గించవచ్చని ఒక వ్యాసంలో చదివాను. కాని దానికి ఎంత ఖర్చు అవుతుంది. క్లిప్పు పెట్టుకోవడం ఇష్టం లేదు?

– పేరు రాయలేదు, చెన్నూరు

క్లిప్పులు అవసరం లేకుండా ఎత్తుపళ్ళు, వంకర పళ్ళను ఆర్థోగ్నాతిక్ సర్జరీ ద్వారా సరిచేయబడును. ఈ సర్జరీకు పదివేలు నుండి పదిహేనువేలు వరకు ఖర్చు అవుతుంది. మీరు దంతవైద్యుని సంప్రదించండి.

డాక్టర్ బి.వి.సుబ్రహ్మణ్యం, బి.డి.యస్.

దంతవ్యాధి నిపుణులు, ఒంగోలు.

బలమున్నవాడిదే ప్రపంచమా?

అంపశయ్య నవీన్

"ఈ ఒసామా బిన్ లాడెన్ అనే వాడు అమెరికా వాళ్ళకు దొరుకుతాడంటారా? యుద్ధం ప్రారంభమై మూడువారాలు దాటి పోతోంది కదా... ఇంతవరకు ఈ లాడెన్ అతీగతీ లేదు" అంటూ వచ్చాడు మా పక్కింటి పుల్లారావు.

"లాడెన్ దొరుకుతాడో లేదో నేను చెప్పలేను గానీ ఈ యుద్ధం మాత్రం పూర్తిగా అన్యాయమైన యుద్ధమని మాత్రం నేను చెప్పగలను. కేవలం ఒక్క వ్యక్తికోసం ఒక దేశం మీద దండయాత్ర చెయ్యడం, కొన్నివేల మంది అమాయకుల్ని బలి చెయ్యడం..."

"ఒక్క వ్యక్తి అంటారేమిటి మీరు... ఈ లాడెన్ అనే వాడి వెనక ఎంతమంది ఉగ్రవాదులున్నారో మీకు తెలీదా? ఈ ఒక్క వ్యక్తి అనే వాడు అమెరికాలో మొన్న ఎంత విధ్వంసం సృష్టించాడో మనందరం చూశాం కదా... ఈనాటికైనా ప్రపంచంలో ఎక్కడెక్కడో వున్న ఉగ్రవాద సంస్థలనన్నింటినీ మళ్ళీ లేవకుండా వాటి నడ్డివిరక్కొట్టే ఓ బ్రహ్మాండమైన ప్రయత్నం జరుగుతోంది - దాన్ని మనందరం సపోర్టు చెయ్యాల్సిన అవసరముందని నా అభిప్రాయం... ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలించి వేయడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నానికి మనందరం చేయూతనివ్వడం మన కర్తవ్యం... మన బాధ్యత..."

"ప్రపంచంలో ఉగ్రవాదం మితిమీరిపోతోందన్నమాట నిజమే... కానీ ఈ ఉగ్రవాదం ఇవ్వాళ్ళ కొత్తగా తలెత్తిందేమీ కాదు.. ఇవ్వాళ్ళ అమెరికా మీద ఉగ్రవాదులు దాడి చేసి అమెరికా అహాన్ని దారుణంగా దెబ్బతీశారు. కాబట్టి అమెరికాకు ఉగ్రవాదాన్ని అణిచివెయ్యాలని బుద్ధి పుట్టింది - భారతదేశంలో ఇరవయ్యేళ్ళుగా ఉగ్రవాదం చెలరేగుతోంది. అయినా ఆ ఉగ్రవాదానికి ప్రధాన కారణమైన పాకిస్తాన్‌ను అమెరికా ఎప్పుడూ సపోర్టు చేస్తూనే ఉంది. మొన్నటిదాకా తాలిబాన్లకు, ఒసామా బిన్ లాడెన్‌కు కొండంత అండగా నిలిచిన పాకిస్తాన్ ఇవ్వాళ్ళ అకస్మాత్తుగా అమెరికాకు వత్తాసు పలుకుతోంది. ఏమిటిదంతా? ఇరవయ్యేళ్ళుగా కాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ ఇవ్వాళ్ళ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతోందంటే ఎవరు నమ్ముతారు? ఆమాటకొస్తే ఇవ్వాళ్ళ ప్రపంచంలో ఉగ్రవాదం పెరిగిపోవడానికి అమెరికాయే కారణం కాదా?"

"గతం గతః అన్నారు. ప్రతిదానికి మనం గతంలోకి వెళ్ళి అమెరికా అప్పుడు ఇట్లా చెయ్యలేదా? అట్లా చెయ్యలేదా అంటూ చరిత్ర పాఠాలు వల్లెవేస్తే ఏం లాభం?... ఇప్పుడైతే అమెరికా ఓ మంచిపనికి శ్రీకారం చుట్టింది... ఈ దెబ్బతో ప్రపంచంలో తీవ్రవాదం అనేది లేకుండా పోతుందని నా నమ్మకం..."

"తీవ్రవాదం లేకుండా పోతుందన్నది ఓ భ్రమ మాత్రమే - తీవ్రవాదానికి అసలు కారణాలేమిటో తెలుసుకోకుండా, జబ్బొకటైతే మందొకటి ఇవ్వడం వల్ల ఏ సమస్య కూడా పరిష్కారం కాదు.. ఇవ్వాళ్ళ ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఉగ్రవాదం చెలరేగడానికి అనేక కారణాలున్నాయి... వాటిని తొలగిస్తే తప్ప ఉగ్రవాదం అంతంకాదు - ఉదాహరణకు అరబ్ - ఇజ్రాయిల్ సమస్యను తీసుకుందాం... ఈ ఉగ్రవాదం అనేదాన్ని మొట్టమొదలు పి.ఎల్.ఓ. అంటే పాలస్తీనియన్ లిబరేషన్ ఆర్గనైజేషన్ అన్న సంస్థ ప్రారంభించింది. అయితే ఈ పి.ఎల్.ఓ. అనే సంస్థ ఆవిర్భవించడానికి దారి తీసిన పరిస్థితులేమిటో మనం ఆలోచించాలి. రెండవ ప్రపంచయుద్ధానికి ముందు ఇప్పుడు ఇజ్రాయిల్ అనే దేశం వున్న చోట పాలస్తీనా అనే దేశముండేది. దాని స్థానంలో హిట్లర్ కారణంగా ప్రపంచంలో చెల్లా చెదరైపోయిన యూదులకో దేశాన్ని సృష్టించాలన్న ఉద్దేశంతో ఇంగ్లాండ్, అమెరికా లాంటి అగ్ర దేశాలు ప్రపంచంలో ఎక్కడెక్కడో వున్న యూదుల్నందర్నీ తెచ్చి పాలస్తీనాలో దించారు.. తర్వాత 1945లో పాలస్తీనా స్థానంలో 'ఇజ్రాయిల్' అనే దేశాన్ని సృష్టించారు. దాంతో కొన్ని లక్షల మంది పాలస్తీనీయులు తాము పుట్టి పెరిగిన దేశంలోనే కాందిశీకులుగా మారిపోయారు. వాళ్ళను ఇజ్రాయిల్ దేశానికి చెందిన యూదులు తన్ని తగలేశారు. దాంతో పాలస్తీనీయులు చుట్టుపక్కలున్న లెబనాన్, జోర్డాన్, సిరియా, ఈజిప్టు మొదలైన దేశాల్లోకి కాందిశీకులుగా వెళ్ళారు... పాలస్తీనీయులకు జరిగిన అన్యాయాన్ని ఎదిరించడం కోసం జోర్డాన్, సిరియా, ఈజిప్టు మొదలైన అరబ్బు దేశాలన్నీ ఇజ్రాయిల్ మీద మూడుసార్లు యుద్ధం చేసి మూడుసార్లూ ఇజ్రాయిల్ చేతిలో ఓడిపోయాయి. ఇజ్రాయిల్ అరబ్బుల మీద గెలవడానికి ప్రధానమైన కారణం ఏమిటనుకున్నారు? ఇజ్రాయిల్‌కు అమెరికా లాంటి ఓ అత్యంత బలమైన దేశం అండగా నిలవడమే. అరబ్బులకు జరిగిన అన్యాయాన్ని పట్టించుకోకుండా అమెరికా, బ్రిటన్ మొదలైన అగ్రరాజ్యాలు ఇజ్రాయిల్‌నే బలోపేతం చేస్తూ వచ్చాయి. దాంతో పాలస్తీనీయులు పి.ఎల్.ఓ. అనే సంస్థను స్థాపించి ఇజ్రాయిల్‌ను లొంగదీయాలని ప్రయత్నించారు. వీరిలో కొందరు ఉగ్రవాదాన్ని చేపట్టారు. పాలస్తీనా వాసులకు జరిగిన దారుణమైన అన్యాయం కారణంగానే కదా ఉగ్రవాదం ఉద్భవించింది? ఈనాటికి కూడా అరబ్-ఇజ్రాయిల్‌ల మధ్య అనుక్షణం యుద్ధ వాతావరణమే తాండవిస్తున్నది. మామూలు యుద్ధంలో గెలవలేమని రుజువైపోవడంతో అరబ్బులు ఉగ్రవాదాన్ని ఆశ్రయించారు. ఇవ్వాళ్ళ 'బిన్‌లాడెన్' అనే ఉగ్రవాద భూతం ఉద్భవించడానిక్కూడా ఈ అరబ్ - ఇజ్రాయిల్ వివాదం కూడా ఒక కారణమే. ఇజ్రాయిల్ కారణంగా నిరాశ్రయులైపోయిన కొన్ని లక్షల మంది పాలస్తీనా అరబ్బులకు మళ్ళీ ఆశ్రయం కల్పించబడేంత వరకు ఉగ్రవాదం అంతమైపోదు. పాలస్తీనీయుల కోసం పాలస్తీనా అనే రాజ్యాన్ని మళ్ళీ ఏర్పాటు చేసి వాళ్ళనక్కడ గౌరవప్రదంగా జీవించేలా చెయ్యడం అమెరికా నిర్వహించాల్సిన ఓ గురుతరమైన బాధ్యతే.

"అంటే.. ఇప్పుడున్న ఇజ్రాయిల్‌ను అంతం చేసి పాలస్తీనాను సృష్టించమంటారా ఏమిటి?"

"ఇజ్రాయిల్‌ను అంతం చెయ్యాలనడం లేదు.. అరబ్బు దేశాలతో జరిగిన మూడు యుద్ధాల్లో ఇజ్రాయిల్ ఈజిప్టులోని కొంత భాగాన్ని, సిరియాలోని కొంతభాగాన్ని, జోర్డాన్‌లోని కొంతభాగాన్ని ఆక్రమించుకుంది. 1945లో సృష్టించబడిన ఇజ్రాయిల్‌తో పోలిస్తే ఇప్పటి ఇజ్రాయిల్ రెండు మూడింతలు విస్తరించింది. ఇజ్రాయిల్ దురాక్రమణ చేసి ఆక్రమించుకున్న ఈ భూభాగాల్ని ఖాళీ చేయించి అక్కడ పాలస్తీనా రాజ్యాన్ని ఏర్పాటు చెయ్యొచ్చు. "పాలస్తీనా స్టేట్" అనేది ఏర్పడే వరకు మధ్య ప్రాచ్యంలో ... అంటే మిడిల్ ఈస్ట్‌లో ఎప్పుడూ యుద్ధ వాతావరణమే ఉంటుంది. అనుక్షణం ఇజ్రాయిల్ చేతిలో దెబ్బతింటున్న అరబ్బులు ఉగ్రవాదాన్ని ఆశ్రయిస్తూనే ఉంటారు. ఒక బిన్‌లాడెన్ పోతే మరో బిన్‌లాడెన్ ఉద్భవిస్తూనే ఉంటాడు. మరో విషయమేమిటంటే ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పుకుంటున్న అమెరికాకు ఆ నెపంతో మరో దేశం మీదకు దండెత్తే హక్కు ఎవరిచ్చారు? ప్రపంచంలో ఏ సమస్య తలెత్తినా దాన్ని పరిష్కరించడానికి ఐక్యరాజ్యసమితి అనే సంస్థ ఉంది కదా... అమెరికా తన మీద ఉగ్రవాదులు దాడి చేశారన్న విషయాన్ని ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చెయ్యొచ్చు కదా... ఐక్యరాజ్యసమితిని పూర్తిగా నిర్వీర్యం చేసే బలముంది కాబట్టి తనే ప్రపంచ పోలీసు మ్యాన్‌గా మారతానంటే ఎలా?" అన్నాన్నేను. ☆



విద్యకు కాసేపు విరామం
ప్రకటించి
పాశ్చాత్యాంశమై ప్రభవించిన
జ్యోతిష్యాన్ని
తర్కించాల్సిన అగత్యం!
దోపిడీల పరంపరలో
మేధాపహరణం ప్రముఖం
కాలుష్యాల జాబితాలో
మేధాకాలుష్యం ప్రథమం

కష్టాలు కన్నీళ్ళు కర్మఫలం కాదు
వైధవ్యం విధిరాత కాదు!
గ్రహాల్ని నిద్రలేపి
దిక్కుల్ని పలకరించి
లెక్కపై లెక్కవేసి
భవిష్యత్తు శూన్యం అంటుంది జ్యోతిష్యం
మనిషి మనుగడ నశించి
వర్తమానం మరణిస్తుంది
భవిష్యత్తుకు వర్తమానం పునాది

వర్తమానానికి భూతకాలం సంవేది!
కృషి శ్రమ నిబద్ధతలో
అకుంఠిత దీక్షలో భవిష్యత్తు వుంది
గీతలో బ్రహ్మరాతలో లేదు!
వారఫలం రాశిఫలం
జాతకం హస్తసాముద్రికం
సోది చిలకజోస్యాలు
సనాతన సాంప్రదాయం
ఛాందసం
మౌఢ్యం పెంచి
మనువును ప్రతిష్ఠించి
పోచమ్మ తలుపులమ్మ
పోలేరమ్మ గంగానమ్మ
పోతురాజుకు సుప్రభాతాలు
రాతి యుగానికి మరల్చే
ఆటవిక కుయుక్తులు!
శాస్త్రీయ విద్యాబోధనలో
చదువుకు పరమార్థం వుంది
బ్రతుక్కి కృతార్థత వుంది
యుగయుగాల దేవుడు
శాస్త్రీయ విద్యకు చిక్కిచంద్రుడు
కటిక శిలను అంటున్నాడు!

- అడిగోపుల వెంకటరత్నమ్

కూలిన శకలాల కింద...

మనిషినుండి మృగానికి
మనసునుండి మాంసానికి
మారడానికి
ఏ మత్తు మందు లేకుండానే
మరణించడం నేటి యుగం...
ఏ చరిత్ర పాఠాల్లోనో
నేర్చుకున్న యుద్ధనీతి
ఇపుడు చందమామ కథల్లో కూడా
కానరావేమో!

ఇపుడు
ఏ దేశ చరిత్ర చూసినా
నెత్తురు వానల మరకలు...
మనిషిని మనిషే
మోసం చేసుకుంటూ
పాలిష్డైన పాతరాతియుగంలో
పయనిస్తూ...

గ్రహాలు దాటేస్తూ
గుహల్లోకి పరుగుతీస్తూ
మేడ క్రింద మందుపాతర
మేడలోన కలత నిదుర...!

నీ 'జిహాద్' నినాదం
రేపటి చరిత్ర గోడపై
ఏ మరకంటిస్తుందో....!
దెబ్బతిన్న పులి నినాదం
చరిత్రనేమలుపు తిప్పనున్నదో...
మరణమిపుడు
మనిషికి భయపడుతోంది
మనసు

గాలిదుమారపు గాలిపటమైనా
పంజరం వదిలేసిన పక్షిలా
మనిషినొదిలేసినందుకు తృప్తి
పడుతోంది...!
ఆకాశ హర్మ్యాలు మీద నుండి
మాంసపు ముద్దలుగా
మనుషులు రాలుతున్నప్పుడు
నవ్వే ప్రతిదేశపు
రాబందులకు విందులతో
మొహం వాచిపోతోంది...
అయినా...
కూలిన శకలాల కింద
అయిన వాళ్ల ఆనవాళ్లేరుకోవడం
ప్రజలకలవాటే...
పడిపోయిన లెక్కల్ని చూసుకోవడం
ప్రభుత్వాలకలవాటే....!

- తాళ్ళపెల్లి రాంబాబు

ఆటల్లో దెబ్బలపై పిల్లల్ని గాభరా పెట్టొద్దు

వి.ఆర్.వాగోలు

ఒక రోజు నేను రోడ్డుపై నిలబడి ఉండగా ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. కొంతమంది 3-5 సంవత్సరాల వయస్సు గల పిల్లలు గుంపుగా ఆడుకుంటున్నారు. వారిలో ఒక చిన్నపిల్లవాని కాలికి చిన్నముల్లు గుచ్చుకుంది. వెంటనే ఆ పిల్లవాడు కూర్చుని తన చేతితోనే ఆ ముల్లును తీసివేశాడు. పిల్లలందరూ చుట్టూ చేరి తమ సహచరునికి ఏమైందా అనుకుంటూ ఆతృతతో చూస్తున్నారు. ముల్లు గుచ్చుకున్న ప్రాంతంలో నుండి కొద్దిగా రక్తం బయటకు వచ్చింది. పిల్లవాడి సహచరులలో కొందరు 'అరే రక్తం వస్తున్నది' అన్నారు. అప్పటివరకూ బాగానే వున్న పిల్లవాడు రక్తం చూడగానే 'అమ్మో రక్తం వస్తున్నది. కట్టుకట్టండి. రక్తం పోతున్నది కట్టు కట్టండి' అంటూ పెద్దగా అరుస్తూ ఏడవడం ప్రారంభించాడు.

తోటి పిల్లలు 'రక్తం ఆగిపోయిందిలే ఇక ఏడవకు, అంటున్నా వినిపించుకోకుండా అదే పనిగా రక్తం కారిపోతున్నది, కట్టుకట్టండి అంటూ పెద్ద పెద్దగా ఏడుస్తున్నాడు. పిల్లవాడు చేస్తున్న హడావుడి చూసి పిల్లవాడికి ఏమయిందా అని పెద్దలు వచ్చి చూశారు. చూసి రక్తం కారడం లేదురా ఏడవకు అని ఎంత చెప్పినా ఏడుపు ఆపలేదు. చివరికి పిల్లవాడి అమ్మానాన్నలు వచ్చి చెప్పినా సరే ఆ పిల్లవాడు ఏడుపు మానలేదు. మరింత గట్టిగా 'ముందు కట్టుకట్టండి రక్తం కారిపోతుంది కట్టు కట్టండయ్యో' అంటూ ఏడుస్తున్నాడు.

పిల్లవాడి ఏడుపుతో అచట గుమిగూడిన పెద్దలందరూ నవ్వుకుంటున్నారు. ఆ చిన్నారి భయం, ఆతృత, ఆందోళన వారికి నవ్వు తెప్పించాయి. అయితే పిల్లవాని ఏడుపు మాత్రం ఆపలేకపోయాయి. పిల్లవాడి నాన్న వాడిని ఇంటికి తీసుకొని వెళ్ళి ఒక చిన్న గుడ్డ ముక్కను కాలికి కట్టిందాకా ఏడుపు ఆపలేదు. ఎపుడైతే కాలికి కట్టుకట్టారో వెంటనే ఆ బాలుడు ఏడుపు ఆపేశాడు. పై సంఘటన చూసే వారికి, వినే వారికి నవ్వు తెప్పిస్తున్నప్పటికీ పిల్లవాడి మనస్సులో ఒక సంఘటన పట్ల గూడు కట్టుకొన్న భయం, అభద్రతా భావం, ఆందోళన, దాని నివారణా పద్ధతి పట్ల పిల్లవానికి గల ఆలోచన ప్రస్ఫుటంగా గోచరిస్తున్నాయి. అంతేకాదు పిల్లలు తమ పరిసరాలను, సంఘటనలను నిశితంగా గమనిస్తున్నారనడానికి దీనిని ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

కొంతమంది పిల్లలు నిత్యజీవితంలో అనేక దెబ్బలు తింటుంటారు. చిన్నారులు ఆటపాటల్లో చిన్నచిన్న దెబ్బలు తగిలినపుడు రెండు రకాలుగా ప్రవర్తిస్తుంటారు. ఆటలాడే సమయంలో పొరపాటున క్రిందపడినా, దెబ్బలు తగిలినా ముందుగా తమనెవరైనా గమనిస్తున్నారేమోనని పరిశీలిస్తారు. ఒకవేళ తననెవరూ గమనించడం లేదని అనుకుంటే వెంటనే లేచి బట్టలకంటిన దుమ్మును దులుపుకొని పరుగెడతారు. అలాకాక తననెవరైనా గమనిస్తున్నారేమోనని పరిశీలిస్తారు. అలాకాక తననెవరైనా గమనిస్తుంటే, తాను పడినందుకు లేదా తనకు తగిలిన దెబ్బలను చూచి నవ్వుతూ ఉంటే వెంటనే ఏడుపు లంకించుకుంటారు. దానికి తోడు పిల్లవాని తల్లిదండ్రులెవరైనా ఆ సమయంలో కనిపిస్తే మరింత శృతి పెంచి ఏడుపులంకించుకుంటారు.

పై విషయాలు గమనిస్తే ఒక సంగతి స్పష్టంగా తెలుస్తుంది. అదేమంటే పిల్లలకు కావలసింది కాస్తంత ప్రేమ, ఆప్యాయత, అనురాగం, బుజ్జగింపు. చిట్టిపొట్టి చిన్నారులలో యిది మరీ అధికం. పిల్లలు తమకు దెబ్బలు తగిలినపుడు తమ బాధను అర్థం చేసుకుని తమను దగ్గరకు తీసుకొనే వారెవరైనా ఉన్నారేమోనని అలా దగ్గరకు తీసుకోవాలని కోరుకుంటారు. అలా జరగదని భావించినపుడు వెంటనే దుమ్ము దులుపుకుని తన దారిన తాను వెళ్ళిపోతాడు. తనకు దెబ్బలు తగిలితే తనను దగ్గరకు తీసుకొని హత్తుకొని బుజ్జగించే వారున్నారని తెలియగానే దెబ్బల తీవ్రత గుర్తుకు వస్తుంది. అపుడు ఏడుపు లంకించుకుంటాడు. తన వారి నుండి సానుభూతిని, ఆప్యాయతను కోరుకుంటాడు. వాటిని పొందడానికి శాయశక్తులా ప్రయత్నిస్తుంటాడు. తనకు దెబ్బలు తగిలాయని తద్వారా తాను బాధపడుతున్నాననే విషయం తల్లిదండ్రులు తెలుసుకుని వారు వచ్చి ఓదార్చాలని భావించడం జరుగుతుంది.

తీవ్రమైన దెబ్బలు తగిలితే అది వేరే విషయం. ఎక్కువ మంది బాలబాలికలు చిరుప్రాయంలో అనేక ఆటపాటల్లో పాల్గొంటూ వుంటారు. వీటిలో అనేక దెబ్బలు తగులుతుంటాయి. పిల్లలు వీటిని ఎక్కువగా పట్టించుకోరు. అయితే తన సహచరులు అరే రమేష్‌కు దెబ్బతగిలి రక్తం వస్తున్నది అంటూ దెబ్బలు తగిలిన పిల్లవాడిని గాభరా పెట్టి అయోమయానికి గురి చేస్తుంటారు. అప్పటివరకు దెబ్బల వలన బాధ తెలియని పిల్లలు సైతం చుట్టూ జరుగుతున్న హడావుడి వల్ల స్పందిస్తారు. దీనికి తోడు దెబ్బలు తగిలిన పిల్లలను ఇంట్లో తల్లిదండ్రులు అలా ఎందుకు చేశావని రెండు అంటిస్తారేమోననే భయంతో కూడా ఏడుపు లంకించుకుంటారు. పిల్లలు ఆటలాడుకోవడాన్ని, పిల్లలను గమనించడం ఎల్లప్పుడు కుదిరే విషయం కాకపోయినా ఆటలాడుకొనే విషయంలో పిల్లలకు తగు జాగ్రత్తలు చెప్పడంతో పాటు వీలున్నప్పుడు పిల్లలను ఓ కంట కనిపెడుతుండాలి. చిన్న చిన్న గాయాల పట్ల పిల్లలను జాగరూకులను చేసినట్లయితే ఆటపాటలు మానసిక ఉల్లాసాన్నిస్తాయనడంలో సందేహం లేదు. కాని పిల్లలతో పాటు పెద్దలూ హడావుడి పడి పసి హృదయంలో మరింత అభద్రతా భావం రేపకుండా చిన్న చిన్న గాయాలు ఏమీ చేయవని, కాస్తంత జాగ్రత్తగా ఉంటే ఆటపాటలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెప్పడం ద్వారా చిన్నారులు ఆటల్లో జాగరూకులై ఉండి వాటిని తమ శారీరక, మానసిక ఉల్లాసానికి సాధనాలుగా మలచుకొంటారనడంలో ఎటువంటి సందేహం లేదు. ☆

'నోరు మంచిదయితే...!'

పూర్వం ఆహ్లాదక, విచారక అరణ్యాలను ఆనందుడు, కలహుడు అనే రెండు సింహాలు పరిపాలి స్తుండేవి. ఆ రెండు అరణ్యాలు పక్కపక్కనే ఉన్నాయి. ఆహ్లాదక రాజ్య రాజు ఆనందుడు సౌమ్యుడు, పరిపాల నాధ్యక్షుడు. పాలనా సమస్యలను యుక్తితో అధిగమిస్తుండేవాడు. ఎన్ని కష్టాలు ఎదురైనా చిరునవ్వు వదిలేవాడు కాదు. అతడిననుసరించి అతని కింది ఉద్యోగులు కూడా నిత్య సంతోషులుగా ఉండేవారు.

విచారక అరణ్య రాజు కలహుడు మాత్రం ముక్కోపి. సంతోషించాల్సిన సమయంలో కూడా విచారవదనంతో ఉండే వాడు. అంతేకాక కిందిస్థాయి ఉద్యోగులను నిత్యం దూషిస్తుండేవాడు. తన మిత్రులపై కూడా వారి పరోక్షంలో దూషణ భాషణలు చేస్తుండేవాడు.

ఒకసారి ఆ రెండు అరణ్యాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాలు పడక, ఆహారం దొరక్క ఆకలికి అలమటిస్తూ ఎన్నో పక్షులు, జంతువులు చనిపో సాగాయి.

కలహుడు ఈ కరువుకు ఇతరులను నిందిస్తూ కాలం వెళ్ళబుచ్చసాగాడు. ఆనందుడు మాత్రం కరువు నుండి ప్రజలను రక్షించేందుకు తాత్కాలి కంగా శిబిరాలు నిర్వహించాడు. వాటికి కావాల్సిన వైద్యసాయాన్ని కూడా ఎప్పటికప్పుడు అందేలా చూడసాగాడు. కోశాగారంలో ఉన్న డబ్బును ఇందుకోసం ఖర్చు చేశాడు. ఈ విషయం విన్న కలహుడు ఆనందుడ్ని నిందించాడు. వాడికి తెలివి లేదని అన్నాడు.

ఇలా కొన్ని రోజులు గడిచాయి. కలహుడి సభకు హాజరయ్యే వారి సంఖ్య పలచబడింది. ఒకరోజు సభకు కేవలం పదిమంది మాత్రమే వచ్చారు. విషయం తెలియని కలహుడు కారణమేమిటని మంత్రి వినయుణ్ని గద్దించి అడిగాడు.

అతను భయపడు తూనే 'మహారాజా.... మీరు కోప్పడనంటే ఒక విషయం చెబుతాను' అన్నాడు.

'చెప్పు!' తీవ్రస్వ రంతోనే అన్నాడు కలహుడు.

'కరువు ప్రభావం వలన మనరాజ్యంలో తిండికి నానా కష్టాలు పడుతున్నారు. రోజుకు ఒక్కపూట తినడం కూడా కష్టమవుతోంది. కొందరు మరణించారు కూడా. మిగిలిన వారు ఆహ్లాదక రాజ్యం వెళ్ళారు. రాజా....! ఇంకో విషయం' అని నసిగాడు.

ఈ మాటల ప్రభావం వలన శాంతపడిన కలహుడు 'చెప్పండి' అన్నాడు.

'ఈ విషయం మీకు తెలియ చేస్తున్నందుకు నన్ను క్షమించండి. ఎక్కువశాతం ఆనందుడి సౌమ్యతకు, మృదుభాషణకు, ప్రేమతో మాట్లాడే గుణానికి ఆకర్షితులయ్యే వెళ్ళారు' అన్నాడు వినయుడు.

మంత్రి మాటలతో తాను చేసిన తప్పేమిటో అర్థమయ్యింది కలహుడికి. వెంటనే కరువు నుండి అడవిలో ఉన్న వారిని రక్షించేందుకు చర్యలు మొదలుపెట్టాడు. ఆనం దుడి సలహాలతో రాజ్యపరిపాలన సాగించి మంచి పేరు తెచ్చుకున్నాడు.

-శాఖమూరి శ్రీనివాస్

కథలు పంపండి

నేస్తాలూ,

మీరు ఏమైనా కథలు రాస్తే వాటిని ఈ శీర్షికకు పంపండి. బాగున్న వాటిని వీలు వెంబడి ప్రచురిస్తాం. మీరు పంపే కథలు విజ్ఞానం అందించేవి గాను, మంచి విషయాలు బోధించేవి గాను ఉండాలి. ఇప్పటికే వచ్చిన కథలు కాకుండా మీరు సొంతంగా రాసిన కథలు పంపండి. మీ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు చూపించి వారి సంతకంతో పంపితే ప్రచురిస్తాం.



చిన్నారి చిత్రకారులు

మర్ల మాధవరావు,
9వ తరగతి,
జడ్‌పి హైస్కూల్,
పాలవలస, బారువా,
శ్రీకాకుళం జిల్లా

గోలి వేణు,
8వ తరగతి,
శ్రీ చైతన్య
హైస్కూల్
రామన్నపేట,
నల్గొండ జిల్లా

సిహెచ్. రాజ్‌కుమార్, 8వ తరగతి
ఎస్‌వీఎస్‌నికేతన్, చినకాకాని

షేక్ తబ్బు, 5వతరగతి
విద్యానగర్, మిర్యాలగూడ

దా | రి | క | ను | క్కో | ం



ప్రోత్సాహం..దివ్యఔషధం

నేస్తాలూ,

ఏ రంగంలోనైనా తగిన ప్రోత్సాహం ఉంటే వృద్ధిలోకి రావడం సులభం. విద్యార్థులుగా మనం ఉన్నత చదువులు చదివేందుకు ఎవరో ఒకరు మనల్ని ప్రోత్సహిస్తే మనం ఉన్నతులుగా ఎదగవచ్చు. నాకే జరిగిన ఓ సంఘటన ద్వారా మీకు నేను ఈ విషయం గురించి చెప్పదలచుకున్నాను. నేనిప్పుడు పదవ తరగతి చదువుతున్నాను. నాకు తొమ్మిదవ తరగతి వరకు మంచి మార్కులు వచ్చేవి కావు. మా నాన్నగారు బాగా కొట్టేవారు, తిట్టేవారు. వేసవి సెలవులు వచ్చాయి. మా నాన్నగారు ఓ రోజు నా చదువు గురించి మా అమ్మతో బాధపడుతుండగా నేను విన్నాను. నాకు చాలా బాధ కలిగింది. ఇకనుండైనా మంచిగా చదవాలనుకున్నాను. కాని నాకు ఎవరి ప్రోత్సాహం లేదు. అందుకే మా నాన్న గారికి ఓ లేఖ రాయాలనుకున్నాను.

'పూజ్యులైన నాన్న గారికి, మీ ఎదురుగా మాట్లాడే ధైర్యం లేక ఇలా లెటర్ రాస్తున్నాను. ఈ లేఖను పూర్తిగా చదవగలరు. నేను చదువులో వెనకపడినందుకు మీరు చాలా బాధపడుతున్నారని నాకు తెలుసు. ఇకనుండి నేను బాగా కష్టపడి చదువుతాను. కాని దానికి మీ ప్రోత్సాహం కావాలి. మీరు నాకు ప్రోత్సాహం కంటే మొదటి నుండి దండనే ఎక్కువ విధించారు. అస్తమానం తిట్టేవారు. మీ కొట్టిందానికంటే కూడా ఆ తిట్లే నాకు ఎంతో బాధ కలిగించాయి. ఎన్నోసార్లు వెక్కివెక్కి ఏడ్చాను. మీరు కొట్టినందుకు బాధపడే వాడిని కాని చదువులో వెనకపడినందుకు మాత్రం కాదు.'

మా నాన్నగారు నేను రాసిన లేఖను చదివి నా దగ్గరకు వచ్చారు. నాకు చాలా భయం వేసింది. కొడతారేమో అనుకున్నాను. కాని ఆయన నన్ను దగ్గరకు తీసుకుని ఇంతకు ముందెన్నడూ మాట్లాడనంత ఆప్యాయంగా మాట్లాడారు. అప్పుడు నా ఆనందానికి హద్దులులేవు. ఒక చదువులోనే కాకుండా అన్ని విషయాల్లో ప్రోత్సహించారు. ఆయన నాతో స్నేహంగా ఉండటం ప్రారంభించారు.

వేసవి సెలవులు ముగిసాయి. పాఠశాల ప్రారంభమైంది. ప్రతిరోజు పాఠశాల అయిపోగానే చదువుకు ప్రత్యేకంగా సమయం కేటాయించే వాడిని. మా నాన్న ఆఫీసు నుండి రాగానే టీవీ కూడా చూడకుండా నాకు అర్థంకాని పాఠాలను వివరించేవారు. క్వార్టర్లీ పరీక్షల్లో నాకు వచ్చిన మార్కులు చూసి తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆశ్చర్యపోయారు. కనుక నేస్తాలూ...మా నాన్నగారి ప్రోత్సాహం లేకుంటే నా చదువు అలాగే ఉండిపోయేది. ప్రోత్సాహం ఔషధంలా పనిచేస్తుందని, అది మనలో ఉన్న నిరుత్సాహాన్ని తరిమికొడుతుందని నాకు అర్థమయ్యింది.

ఉంటాను...

-పి. ఫణీంద్రకుమార్, హైదరాబాద్.

కలంస్నేహం

పేరు : ఎన్. హేమంత్
వయస్సు : 11
చదువు : 6వ తరగతి
హాబీలు : క్రికెట్ ఆడటం, బొమ్మలు గీయడం, చదువుకోవడం
పూర్తి చిరునామా : సన్నాఫ్ ఎన్. క్రిష్ణమూర్తి, వెంకటేశ్వర కాలనీ, టెక్కలి, శ్రీకాకుళం జిల్లా

పేరు : పి. శంకరయ్య
వయస్సు : 14
చదువు : 9వ తరగతి
హాబీలు : క్రికెట్, క్యారమ్స్, చెస్ ఆడటం, కథలు చదవడం
పూర్తి చిరునామా : కేరాఫ్ గవర్నమెంట్ హైస్కూల్, నాగార్జునసాగర్, మం : పెదవూర, జిల్లా : నల్లగొండ

పేరు : నామనంది నరేష్
వయస్సు : 15
చదువు : 10వ తరగతి
హాబీలు : క్రికెట్ ఆడటం
పూర్తి చిరునామా : సినిమా థియేటర్ దగ్గర, గ్రామం, మండలం : చిట్యాల, జిల్లా : నల్లగొండ

'గణితం గమ్మత్తు'

నేస్తాలూ,

ఈ వారం మీకు ఒక గణితం గమ్మత్తును పరిచయం చేయాలనుకుంటున్నాను. ఒక అంకెను మీ స్నేహితుడిని కోరుకోమనండి. దానిని రెండుతో గుణించండి. వచ్చిన ఫలితానికి 11 కలపాలి. ఆ మొత్తాన్ని 5చే గుణించాలి. తర్వాత వచ్చిన సంఖ్యలో పెద్ద అంకె నుండి చిన్న అంకెను తీసివేయాలి. అదే మీ స్నేహితుడు కోరుకున్న అంకె అవుతుంది. ఎలాగో చూద్దామా...

మీ స్నేహితుడు కోరుకున్న సంఖ్య 2 అనుకుందాం. దానిని రెండుతో గుణిస్తే నాలుగు అవుతుంది. 4కు 11 కలిపితే 15 అవుతుంది. 15ను 5చే గుణిస్తే 75 అవుతుంది. పెద్ద అంకె అయిన 7 నుండి చిన్న అంకె అయిన 5 తీసివేస్తే ఫలితం 2. అదే మీ స్నేహితుడు కోరుకున్న అంకె. ఇలాంటివి మీకు కూడా ఏమైనా తెలిస్తే పరిచయం చేయండి. ఉంటాను...

-ఎస్. మహేష్, రామకృష్ణాపురం, మందమర్రి మండలం, ఆదిలాబాద్ జిల్లా.

మాటల కోట - 32

1		2	●	3		4	●	5	●
●	●	6			●		●	7	8
9			●	●	10			●	
	●	●	11	12	●		●	●	
13		14	●	15	16	●	17		
●	●	18		●	19			●	●
20	21		●	22	●	●	23		24
●		●	25		26	●		●	
27		28	●	29		30	●	31	●
	●	32			●	33			●

అడ్డం

1. సంతోషంలాంటిది., ఇటీవలి ఓ సినిమా (3)
3. మనదేశ బడ్జెట్ ఎప్పుడు దీంతోనే ఉంటుంది (3)
6. స్థాయి, స్తోమత (3)
7. అటునుండి కారణం (2)
9. నుదురు (3)
10. బాగోలేదు...ఒక అక్షరం లేకున్నా అర్థం మారదు (3)
11. హిందీ నలుపు (2)
13. బహుమానం (3)
15. 'మనసా,..., కర్మణా' అంటారు (2)
17. ఒత్తు కోల్పోయిన సమైక్య (3)
18. తీవి (2)
19. కుదరదని కచ్చితంగా చెప్పండి (3)
20. వందతో నమస్కారం (3)
23. కొందరు రాజకీయ నాయకులు 'తిరుగుబాటు....'ఎగరవేస్తుంటారు (3)
25. నూరుపద్యాలు రాస్తే ఇదంటారు (3)
27. కుండ (3)
29. ఉత్సవం (3)
32. తడబడిన ఒక్కడు (3)
33. ఒక వాద్య పరికరం (3)

నిలువు

2. దంతం బహువచనం (3)
3. బావి కొలతల్లో పొడవు, వెడల్పుతో పాటు ఇది కూడా ముఖ్యమే (2)
4. ఇంగ్లీష్ టేల్, హిందీ నహీహై కలిస్తే (4)
5. పొగ (2)
8. జాబిలి (4)
9. ఒకానొక..3, 1, 4 (3)
12. అగ్నిపర్వతం పేలితే వెలువడేది (2)
14. యుద్ధం (3)
16. కత్తి (2)
17. సమయానికి డబ్బులు లేవు. ఎవరినైనా ఇది చేయమనండి (4)
21. నోటి లోపలి భాగం (3)
22. చింతకలిగిన పండు (4)
24. తాతా కాదు., బైబైకి ముందు చెప్పేది (2)
26. చివర కోల్పోయిన కండువా (2)
27. కింది నుండి కోక (2)
28. తాంబూలంలో వాడేది (2)
30. వర్తమానం, భవిష్యత్తు కాదు (2)
31. దొరికితే దొంగ., దొరక్కపోతే...(2)

గతవారం జవాబులు : అడ్డం : 2. విశ్వదాభిరామ 7. కన్ను 8. మరో 10. రణం 11. కష్టం 13. చలం 14. బలుపు 16. పతకం 17. స్నేక్ 18. అహం 19. రుచి 22. పోతం 24. త్రయం 25. భత్యం 26. తిథి 28. డవ 29. గానం 30. స్నో 31. నిప్పు 32. ఆనందో **నిలువు :** 1. ప్రథమ 2. విశ్వం 3. దారుణం 4. రాకల 5. మన్ను 6. అరిష్టం 9. రోమాలు 10. రసం 11. కలంస్నేహం 12. ఈత 14. బడికిపో 15. పుకారు 16. పల్లె 18. అసత్యం 20. చిత్ర 21. విమానం 23. తంతి 25. భవనం 27. ధిని 28. డత

అద్వానీ ఆంత్రాక్సు

రుక్మిణి

"భామా... భామా... చూడు మన హోంమంత్రి అద్వానీగారు ఇల్లు మార్చి పారేశారు. మార్చిన ఇంటిక్కూడా అబ్బో... ఎన్నో మరమ్మత్తులు... మర్మాలు.... అదీ ప్రధాని వాజ్‌పేయీ గారింటికి దగ్గరగా మార్చేసుకుని సెటిలై... ప్రహరీలు... పహారాలు గట్రా ఏర్పాట్లు చేసుకుంటున్నారట!"

"వాస్తు... వాస్తు.. వాస్తే కావచ్చు చిట్టిబాబూ... వాస్తుపీడ బహుగట్టిదని పీకల్దాకా నమ్ముతాడాయె! అదీగాక 'వేదగణితం' కూడా ఒకటి ఏడ్చిందిగా! ఏవేవో లెక్కలు గట్టి కొలతలు కొలిచుంటారు...

"అదేం కాదు... అద్వానీగారంటే మాటలా! పాపం వారు ఎందరో ఉగ్రవాదుల హిట్‌లిస్టుల్లో వున్నారు గదా... ఏ క్షణాన ఏం జరుగుతుందోనని అంతా పకడ్బందీ... పటిష్టమైన ఏర్పాట్లు... అసలు నీకెపుడూ వాస్తునీ... వేదగణితాన్నీ... జ్యోతిషాన్నీ తిట్టడవే సరిపోతుంది గానీ... మన దేశం పట్లా... మన సంస్కృతి పట్లా అసలు నీకు ప్రేముందనుకోను!"

"ఆగాగు.. ఏంటి చిట్టిబాబూ... మన దేశం పట్ల నాకు ప్రేమలేదూ? అంటే నాకు 'దేశభక్తి' లేనేలేదు అనేగదా నువ్వంటున్నది! 'మన సంస్కృతి' అదేదో తెలవని సంస్కారం నాది... అంతేనా? ఘోరం... ఘోరం చిట్టిబాబూ.. అంటే నీ ఉద్దేశ్యంలో నేను పక్కా నెంబర్‌వన్ 'దేశద్రోహిని' అంతేగదా! నేను పక్కా పక్కదేశం సీక్రెటు ఏజంటును గదా... అంతేనా...? అయ్యో.. అయ్యో... చివరికి నా బతుకిట్లా తగలబడి పోయిందిరా దేవుడా... నన్నూ... నా దేశభక్తినీ... నా శీలాన్నీ శంకించి పారేస్తున్నారు - నేనేం చేతున్రా దేవుడో... నాకింక వేరే గతేముంది? నాయనో!"

భామ ఆరున్నొక్క శృతిలో బుడిబుడి రోగాలకు తగులుకోంగానే ముందు చిట్టిబాబు హడలిపోయి అవాక్కైపోయాడు. పైగా ఆవిడగారు వెక్కుతూ.. చీర చెంగుతో పరపరా చీది పారేస్తుంటే పాపం చిట్టిబాబు హృదయం ముందు కకావికలై ఆనక ద్రవించి.. దయా గుణం స్రవించి ఏరులై పారసాగింది.

"అబ్బే... అబ్బే... ఊర్కో... ఊర్కో భామా! అహఁ.. నిన్నంత మాటంటానా...? అసలట్లా అన్నానా? ఛ... ఛ... ముందు విషయం సాంతంగా విను! వినమంటే - అద్వానీ గారి ఇంటి కాంపౌండు ఎత్తు ఆకాశమంత పెంచి పెద్ద కోటబురుజులా... ఛత్రపతి శివాజీ దుర్గంలా తయారు చేసి పారేశారు మరి! అడుగడుగునా ఎలక్ట్రానిక్ పరికరాలు... అద్భుతమైన అమెరికా శిక్షణ పొందిన స్పెషల్ కమెండోలు... అస్సలు అనుమతీ... ఆనవాలూ లేకుండా చీమంటే చీమకూడా లోనికి దూరకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసి పారేశారు మరి! అదీ...భద్రతా ఏర్పాట్లంటే అట్లా వుండాలి మరి! అద్వానీ గారంటే మాటలా?"

పరవశించి పోతున్న చిట్టిబాబు వంక భామ బహుజాలిగా చూసింది. ఆనక నింపాదిగా కొంగుబొడ్లో దోపుకుని చిట్టిబాబుకు ఎదురుగ్గా భైరాయించింది!

"సరేగాని చిట్టిబాబూ... మొన్న ఆగ్రాలో ఏం జరిగిందో తెలుసుగదా"?

"ఏం జరిగిందో నాకేం తెలుసు!"

"అయ్యో నారాత.. మన యువ కాషాయదళ వీరకిశోరాలు మన భారతదేశానికే తలమానికమైన అద్భుత అందాల పాలరాతి కట్టడం... మన దేశ సౌంస్కృతికి ఔన్నత్యం అనదగిన మన తాజ్‌మహల్ ప్రాంగణంలోనే వీరంగం చేసి పారేశారు. పూలను పరపరా తెంపి పచ్చని పచ్చిగడ్డి మీద తమ ప్రతాపం చూపారు - నానా యాగీ! అసలు ఆ కొద్ది సమయంలోనే తాజ్‌మహల్‌ను ఒక బార్ అండ్ రెస్టారెంటు పచ్‌లా మార్చి అక్కడున్న రక్షక భటులెంత చెప్పినా చెవికెక్కించుకోకుండా నానా గత్తరా చేసి పారేశారు. వాళ్ళ పై నాయకులు కూడా ఆ

విషయాన్నంతగా పట్టించుకోలేదు - తేలిగ్గా చప్పరించేశారు!"

"అరెరె... అదేంటీ? అది మంచి పద్ధతి కాదు గదా?"

"తర్వాత మరో మంచి రోజు చూసుకుని బజ్‌రంగ్‌దళం, విహెచ్‌పీదళం సుప్రీంకోర్టు ఆర్డరును కూడా పక్కన బెట్టి ప్రస్తుతం వివాదాస్పదంగా మిగిలిపోయిన అయోధ్యలోని 'స్థలం'లోకి బహు మొరటుగా అందరినీ ధిక్కరించి లోనికి పోయి పూజల తంతు ముగించుకుని చంకలెగరేసుకుంటూ వచ్చారు - అది కోర్టు ధిక్కారమే కాదు - ఎంతో మంది లౌకిక వాదుల ఆలోచనల మీద కొట్టిన దెబ్బ... వాళ్ళ నమ్మకాల మీద క్రూరమైన పరిహాసం! తమ కరుడుగట్టిన మతోన్మాద మధ్య యుగాల నాటి విన్యాసాలను అతి నగ్నంగా... జులాయిగా ప్రదర్శించిన వైనం! రాబోయే యు.పి. ఎన్నికల దృష్టి కూడా దీని వెనకచాటు బాగోతం! దేశంలోని లౌకిక వాదులందర్నీ సవాల్ చేసే మతిమాలిన చర్యే గదా!"

భామ క్రమంగా రెచ్చిపోతుండడంతో చిట్టిబాబు బిత్తరపోయాడు. ఆయనగారి చేతిలోని పేపరు జారి క్రిందపడింది. గంగిరెద్దులా ప్రతిదానికీ 'అవునూ... ఔనౌనూ" అని ఊరికే తలాడించి పారేస్తున్నాడు.

"పైగా.. దేవుడి పూజను అడ్డుకునే కోర్టు ఎక్కడుందీ... ఇదంతా ఆ భగవంతుడి ఆదేశం! ఈ కోర్టులూ.. చట్టాలూ.. మా ముందూ, 'మా' భగవంతుడి ముందూ చెల్లవుగాక చెల్లవని ఢంకా బజాయించి మరీ ఎదురు దాడిక్కూడా దిగారు గదా"!

"ఔ... ఔ... అహ... ఓహో...."! అని చిట్టిబాబు నీళ్ళు నమిలాడుగానీ... ఈ అద్వానీగారి కాంపౌండు కోట బురుజులకీ... అమెరికా తర్ఫీదు కమెండోలకీ... భామ చెప్పే ఈ విషయాలకూ సంబంధం ఏంటో అర్థం గాక జాగ్రత్తగా ఓ గుప్పెడు జుత్తు పీక్కున్నాడు గానీ... తలాడించడం మాత్రం మానలేదు.

"నీకర్థం కాదని నాకు తెలుసుగానీ చిట్టిబాబూ... ఈ రెండు విషయాల్లోనూ మన ప్రధాని వాజ్‌పేయి గారిని నిలదీస్తే ఆయనగారు కాలుమడిచినంత తేలిగ్గా "అబ్బే... అక్కడంతా 'భద్రతా ఏర్పాటు' సరిగ్గా లేకపోవడం వల్లనే అట్లా జరిగి పోయిందీ... అబ్బెబ్బే.... మాది యన్డీయే అజెండా... మా జెండా వేరే! అబ్బే... ఇక ముందు అట్లా జరగదూ... బహుదొడ్డ కట్టుదిట్టాలు చట్టాలూ ఏర్పాటు చేస్తాం అని సర్ది కొచ్చాడు. మొత్తం దేశానికి సంబంధించిన విషయాల్లో మన ప్రధాని గారే భద్రతా... రక్షణా గురించి అంతచులకనగా మాట్లాడారు గదా... ఇంకా మన విశాలమైన భారతదేశ రక్షణ ప్రయోజనాలకు 'తెహల్కా' టేపుల్లో... అవినీతి కన్నంలో దొంగలా దొరికిన మాజీ రక్షణ మంత్రి ఫెర్నాండెజ్‌గారు మాత్రమే అత్యంత సమర్థనీయమైన మంత్రిగా వారికనిపించింది - ఎవరెన్ని నిరసనలు చేసినా అభ్యంతరాలు పెట్టినా వినకుండా తిరిగీ వారికే రక్షణ మంత్రిత్వ శాఖను కట్టి పెట్టారు మిత్రమా... ఇక మరినేను మాత్రం దేశద్రోహిని ఎట్లా అయ్యానో గదా... ఒక అద్వానీగారి భద్రతకూ... దేశ రక్షణ మంత్రిగా తెహల్కాలో ఇరుకున్న మాజీ ఫెర్నాండెజ్‌గారికీ రక్షణ మంత్రిత్వం అంటగట్టిన నా దేశంలో నాలాంటి కడుహీన, పేద దరిద్రులకు 'దేశద్రోహి' ముద్ర వేసి పారేస్తిరి గదా నా పెనిమిటి గారూ!"

ఆ దెబ్బకు బిక్కచచ్చి చిట్టిబాబు కాళ్ళు నిటారుగా నిగడదన్ని వెనక్కి వాలి బలవంతంగా మూర్ఛపోయే మార్గాలు వెదికే ప్రయత్నంలో పడ్డాడు!

"శ్రీవారూ.. అద్వానీగారికి రోజుకు అరడజను 'ఆంత్రాక్సు' పొడి బాపతు కవర్లు వస్తున్నాయట.. వాటి నుండి భద్రత సంగతేమిటో ఆలోచించారా?" భామ కవ్వింపుగా అంది.. బాబు ఒక్కసారే బిర్రబిగుసుకుని నిటారైపోయాడు.

"పోన్లే... నువ్వేం టెన్షను పడిపోకు.. ఆ ఆంథ్రాక్సు అద్వానీగారి మీరేం పని చేయదు - ఎందుకంటే వారి 'కాషాయం' ఈ ఆంథ్రాక్సు కన్నా అయిదింతలు మహా పవర్‌ఫుల్లాయె! అదేం లెక్క మన అద్వానీ గారికి...

చిట్టిబాబు లటుక్కున సోఫాలో నోరు బార్లా తెరిచి కూలబడ్డాడు! ☆

అంటు మామిడి తోట...

లక్ష్మి

కాళిదాసు గొప్పకవి. ఎంత గొప్పకవో మనకనవసరం. అతనొక మగాడు. అంచేత మగాళ్లను వెనకేసుకురావడంలో ఆ మహాశయుడు ముందుంటాడు. శకుంతల కథ చదివే వుంటారు. ఎవరో కని అడవిలో పారేస్తే - ఆ అడవిలో వున్న కణ్వ మహర్షి ఆ చిట్టి పాపను తెచ్చుకుని పెంచుకున్నాడు. మహర్షికి సంసారం గురించి తెలీదు. అంచేత అక్కడున్న లేడికూనలూ, కుందేళ్లూ, పక్షులూ ఆ పాపకు ఆట పాటలన్నీ నేర్పాయి. శకుంతలకు అవే నేస్తాలుగా కుదిరేయి. ఆ పాప పెరిగి పెద్దదయింది. యవ్వనంలో అడుగు పెట్టింది. అందాలరాశిగా ఆ అడవికి పెద్ద అలంకారమైంది. ఈ పరిస్థితుల్లో ఆ అడవికి దుష్యంతుడనబడే రాకుమారుడు వేటకొచ్చి శకుంతలను చూసేడు. చూసి మోహించేడు. మోహించి గాంధర్వ వివాహం చేసుకున్నాడు. వివాహం చేసుకుని ఆమె పొందులో స్వర్గాన్ని చూసేడు. ఆనక వెళ్లొస్తానన్నాడు. మరినామాటేమిటి నాథా అని శకుంతల అడగలేదు. ఆమె అడక్కపోయినా దుష్యంతుడే చెప్పేడు. రాజదూతలొస్తారన్నాడు. పల్లకీలు తెస్తారన్నాడు. సకల లాంఛనాలతో, రాచమర్యాదలతో శకుంతలను అంతఃపురానికి తీసుకొస్తారన్నాడు. కాబోసనుకుంది శకుంతల. ఆ తర్వాత ఇంతే సంగతులని తెలుసుకోలేకపోయింది!

ఎవరో వస్తారని కొన్నాళ్లపాటు శకుంతల ఆశతో ఎదురు చూసింది. రోజులు గడుస్తున్న కొద్దీ ఆశ అణగారిపోయి - ఆందోళన పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆమె పండంటి బిడ్డను కూడా కన్నది. ఆ బిడ్డడు సింహాల్తో ఆడుకుంటుంటే మురిసిపోతూ - భర్తకి దూరంగా బతుకుతున్నందుకు కృంగిపోతూ బతికింది. ఈ కథలో కథానాయకుడు దుష్యంతుడు! కథా నాయకుడు కదు దుర్మార్గుడే. కానీ ఆ మాట రాయడానికి కవిగారికిష్టం లేదు. ప్రేమించిన వాడు మోసగాడని రాస్తే హీరో లక్షణం దెబ్బతింటుంది. అంతకంటే ముఖ్యంగా మగజాతికి మచ్చ పడుతుంది. మగవాడైన కవిగారికి ఈ గొడవ నచ్చలేదు. చిన్న మెలిక పెడితే సదరు మచ్చ నుంచి హీరో బయటపడే ఛాన్సుంటుందనే ఉద్దేశంతో - దుష్యంతుడికి జ్ఞాపక శక్తి నశించిందన్నాడు. హీరో లక్షణానికి మతిమరుపు కూడా మచ్చే అవుతుందనే పాయింటు గుర్తుకొచ్చి - అదొక శాపమని సరిపెట్టేడు. శాపమన్న తర్వాత ఎవరేమి ప్రశ్నిస్తారు? ఎవరేమి విమర్శిస్తారు?

దాసుడి తప్పులు దండంతో సరి అన్నట్టు హీరోగారి తప్పులు శాపంతో కొట్టుకుపోతాయని శాస్త్రం చెప్పేడు. కథా నాయకుడు కదు ఉత్తముడే! కానీ దుర్మార్గాలు చేయాలి. తన తప్పు లేకుండా చేయాలి. ఇదెట్లా సాధ్యమవుతుంది? శాపమహిమ అని చేతులు దులుపుకున్నాడు. మతి మరుపుని అడ్డం పెట్టుకుని కథ నడిపించేడు మహానుభావుడు. ఈ విద్యకి చేతులెత్తి నమస్కరించక చేసేదేముంది? అదుగో - అప్పట్నుంచి మగాళ్లందరికీ మతిమరుపు అనే సాకు శ్రీరామ రక్షగా నిలిచి వుంది. కావాలని తప్పుడు పనులు చేస్తారు. అదేమిటని అడిగితే మైండు పని చేయలేదని శాపం టైపులో చెబుతారు. జీవితానికి మరుపొక వరం అన్నాడు నేటి బాధలకవి. అతను కూడా మగాడే. తేనెటీగల్లాగా సమస్తమైన బాధలూ మెదడ్ని ముట్టడించి చిటుకు చిటుకుమని కుడుతూ వుంటే - ఆ బతుకు పరమనరకమవుతుందని కవిగారి బెంగ! అందుకే మనిషికి మరుపు చాలా అవసరమన్నాడు. మరిచిపోవడం కష్టంగా వుందని చెబితే గట్టిగా ప్రాక్టీసు చేయమని చివాట్లు పెడుతున్నాడు. అప్పటికీ వీలుకాకపోతే మరిచిపోయినట్టు నటించమని సలహా యిచ్చేడు!



దీన్ని జీవిత ధ్యేయంగా పెట్టుకున్నారు మగమహాశయులు. తమకి అనుకూలంగా వుండే సమాచారం యావత్తూ కలకాలం గుర్తు పెట్టుకోడం - ప్రతికూలంగా వుండే మేటర్ని వెంటనే మరిచిపోయినట్టు నటించడంతో కులాసాగా బతికేస్తున్నారు. ఆఫీసులో బోనసు పదిహేను వేలు శ్రీవారి చేతికొస్తున్నాయని తెలిసినప్పుడు - ఆమె ఆనందానికి అవధులుండవు. బోనసు విషయం భర్త చెప్పడు. పక్కింటి పద్మ చెబుతుంది. పద్మవాళ్లాయన శ్రీవారికి కొలీగ్. ఆ మనిషి మగవాడిగా తప్పు పుట్టేడు. ఆఫీసులో ఏం జరిగినా పద్మకి చెప్పడం అతని అలవాటు. అతని పుణ్యమాని - అతను పద్మకి చెప్పిన బోనసు విషయం - పద్మ ద్వారా తనకు తెలుస్తుంది! అంచేత - బోనసు యిస్తున్నార్టగా అని శ్రీవార్ని అడుగుతుంది. ఎవరు చెప్పేరూ అని శ్రీవారు అడుగుతాడు. పద్మ చెప్పింది అంటుంది. పద్మంటె ఎవరని అడుగుతాడు. మీ రామ్మూర్తిగారి వైఫని చెబుతుంది. మా రామ్మూర్తి ఎవరని అడిగేస్తాడు. మీ కొలీగని గుర్తు చేస్తుంది. అతను ఆమెకు చెబితే ఆమె నీకు చెప్పిందా అని అనవసరంగా ఆశ్చర్యపోతాడు!

అంతేగాని - తన నోటితో తాను - బోనసు యిస్తున్నారని చెప్పడు. బోనసు విషయం ఎవరెవరో చెబితేనేగానీ నాకు తెలీలేదు. ఆ విషయం మీరే నాకు స్వయంగా చెప్పి వుంటే బావుండేది అని చురక కూడా అంటిస్తుంది భార్యామణి! నాకు అంత అదృష్టం కూడానా నీలా అని నిట్టూరుస్తాడతను. వెధవ మతిమరుపు జాడ్యంతో చచ్చిపోతున్నానని కూడా అంటాడు. అప్పటికి ఆమె అనవసరంగా తృప్తి పడుతుంది. ఆ డబ్బుతో గాజులు చేయించుకోవాలనుకుంటున్నాను అని టెండరు పెడుతుంది. అంతకంటేనా అంటాడతను నీళ్లు నములుతూ. వారం గడుస్తుంది. డబ్బు తెచ్చేరాని అడుగుతుంది నీలు. ఏండబ్బా అంటాడతను. మీ బోనసు అంటుందామె ఆందోళనగా. అవునుకదూ? నీకావిషయం చెప్పడమే మరిచిపోయేనని కథ చెప్పడం ప్రారంభిస్తాడు. బోనసు డబ్బు తీసుకోగానే ఫ్రెండెవరికో ఏక్సిడెంటైందని ఫోనొచ్చిందంటాడు. ఆసుపత్రికి వెళ్లి అవసరాలకు పనికొస్తుంది వాడుకోమని ఆ పైకం మొత్తం అతనికిచ్చేనంటాడు!

అంటే - దానం చేసేరా అని అడుగుతుంది. అంతడబ్బు దానం చేసేందుకు నా పేరు కూడా కోటేశ్వరరావు కాదంటాడు. అప్పుగా యిచ్చేనంటాడు. మరి ఆ సంగతి అప్పుడే నాకెందుకు చెప్పలేదని అడుగుతుంది. సమాధానం మామూలే. మరిచిపోయేనంటాడు! ఫినిష్! ఆ ఒక్కమాటతో ఆమె నోటికి తాళం పడుతుంది. గాజుల విషయం గాలిక్కొట్టుకుపోతుంది! ఇంటో ఇవ్వవలసిన బోనసు ఏమైందో చెప్పడం మరిచిపోతాడేగాని - అత్తవారిస్తానన్న అంటుమామిడి తోట గురించి మాత్రం ఏళ్లు గడిచినా మరిచిపోడు. మీకు మతిమరుపు జాస్తి అన్నారు గదా - అంటుమామిడి తోట యింకా గుర్తుందేమిటి విడ్డూరమని భార్య చురక తగిలించినా సిగ్గు పడడు! అంటుమామిడి తోట కదా - మెదడ్లో బాగా అంటుకుపోయిందంటాడు. అంతేగాని - అనుకూలంగా వుండే సమాచారం కలకాలం గుర్తు పెట్టుకోడం - ప్రతికూలంగా వుండే మేటర్ని వెంటనే మరిచిపోయినట్టు నటించడమనే మగాడి లక్షణానికి అంకితమై వున్నానని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రకటించడు! ☆



ప్రకృతి అందాలకు నిలయం 'సింహాచలం'

యాసలపు సూర్యారావు

విశాఖ జిల్లాలో గల సింహాచలం నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించడానికి రాష్ట్రంలోని పర్యాటకులు మాత్రమే కాక రాష్ట్రేతర ప్రాంతాల నుండి కూడా నిత్యం పర్యాటకులు సందర్శిస్తుంటారు. ఈ ఆలయం సింహాచలంలోని ఎత్తైన పర్వతంపై వెలసినది. ఈ ఆలయ కట్టడాలన్నీ అతి ప్రాచీనమైనటువంటి రాతి కట్టడాలు. దేవాలయం మొత్తంగా పెద్దపెద్ద రాళ్ళను శిల్పులు తమ శిల్ప కళా చాతుర్యంతో అపురూపంగా తీర్చిదిద్దారు. అలాంటి అందమైన రాతి కట్టడాలతో నిర్మించిన ఆ ఆలయం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ప్రధాన ఆలయానికి చుట్టూ అందంగా చెక్కబడ్డ పెద్ద పెద్ద రాళ్ళను ఏర్చికూర్చిన మండపాలు వెలసి వుంటాయి. ఆ మండపాలపై శిల్పులు చెక్కిన అందమైన అపురూపమైన నగిషీలు చూడముచ్చటగా వుంటాయి. ఈ క్షేత్రం వద్ద పూర్వం కొండ కోనల నుండి సెలయేటి ధారలు జాలువారుతూ వుండేవి. అవి యాత్రికులకు ముచ్చట గొల్పేవి. కాలగమనంలో ఆ జలాలు అంతరించిపోయాయి. చివరకు ఒకే ఒక్క చోట కొండల నుండి జలధార రావడం జరుగుతోంది. యాత్రీకులు ఆ జలధారలోనే స్నానాలు చేస్తారు. ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా గంధోత్సవం జరుగుతుంది. అది తిలకించేందుకు మన రాష్ట్ర నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా వందలాది మంది విచ్చేస్తారు. సింహాచలం కొండపైనే కాకుండా ఆ చుట్టు పక్కల చక్కటి హరిత పర్వతాలు ప్రకృతి సౌందర్యంతో కనువిందు కల్గిస్తాయి. సింహాచలం కొండపై వివిధ రకాల వృక్షాలను పెంచారు. ఎటుచూసినా కన్పించే పచ్చదనం ఆనందానుభూతులను కల్గిస్తుంది. ఆ చుట్టూ ఎత్తైన పర్వతాలు ఉదయం పూట మంచుతో నిండి వుంటాయి. ఆ మంచుపై పచ్చని చెట్ల సందుల్నుండి ఉదయభానుని లేత కిరణాలు నేలపైకి దూసుకొస్తాయి. అవి ప్రకృతి అందాన్ని మరింత దేదీప్యమానం చేస్తాయి. ఆ ప్రదేశాలను తిలకించే వందలాది పర్యాటకులు ఆనందానుభూతులను పొందుతారు. ఈ క్షేత్రం విశాఖ పట్టణానికి అతి చేరువలోనే ఉండడం పర్యాటకులకు మరింత సదుపాయంగా వుంది. ప్రతి నిత్యం విశాఖ నుండి బస్సు సౌకర్యం వుంటుంది. రాష్ట్ర దేవాదాయ శాఖ వారు మరింత శ్రద్ధ కనబర్చి కొండపై ఇంకా చక్కని శిల్ప సంపదను సేకరించి ముఖ్యమైన ప్రదేశాలలో వాటిని అమర్చి కళాత్మకంగా తీర్చిదిద్దినట్లయితే పర్యాటకులను మరింతగా ఆకర్షించేందుకు వీలు కలుగుతుంది. కేవలం భక్తి పేరు మీద వ్యాపారం సాగించేదిగా యాత్రా స్థలం మారడం సరికాదు. అక్కడకు అందరూ భక్తులే వస్తారనుకోవడం సరికాదు. నేటి మానవుడు యాంత్రిక జీవిగా మారిపోతున్న రోజులివి. ఈ స్పీడ్ యుగంలో ప్రతి మనిషి క్షణం తీరిక లేకుండా మారిపోయాడు. ఈ నేపథ్యంలోనే జీవితంలో తాము ఎదుర్కొంటున్న అనేక సమస్యల నుండి ఏ కొంచమైనా ప్రశాంతత దొరుకుతుందన్న భావనతో యాత్రలు సాగిస్తూ వుంటారు. అలాంటి వారికి పర్యాటక కేంద్రంలో వ్యాపార మాయాజాలం ఎదురైతే వారెంతో నిరాశకు గురవుతారు. పర్యాటకులకు తగిన సౌకర్యాలు లభ్యం కాకపోతే వారు ఆ ప్రదేశాన్ని పర్యటించడానికి వెనకాడవచ్చు. ఇందుకు రాష్ట్ర పర్యాటక శాఖ వారు, దేవాదాయ శాఖవారు సింహాచలం లాంటి క్షేత్రాలలో అపరిశుభ్రతకి, అవినీతికి తావులేకుండా పర్యాటకుల యోగక్షేమాలను దృష్టిలో పెట్టుకొని మరిన్ని చక్కటి సౌకర్యాలు కల్పించడం క్షేమదాయకం.



సునంద.కె

సమిష్టి కృషికి నిదర్శనం దక్షిణాఫ్రికా విజయం



ఇలా ఎంతకాలం...? భారత క్రికెట్ జట్టు పరాజయాల పరంపరకు తెరపడేదెప్పుడు? వన్‌మ్యాన్ షో, డబుల్ మ్యాన్ షో నుండి బయటపడేదెప్పుడు? సగటు భారతీయ క్రికెట్ అభిమాని ఆత్మఘోష ఇది. భారత క్రికెట్ చరిత్రను పరిశీలిస్తే వన్డే టోర్నీల్లో ఎకాఎకిన ఫైనల్స్‌కు చేరిన సందర్భాలు చాలా తక్కువ అనేది క్రికెట్ అభిమాని ఎవరినడిగినా చెబుతారు. ప్రపంచకప్ మొదలుకొని ముక్కోణపు వన్డే టోర్నీ వరకు ఆరంభ మ్యాచ్‌ల్లో చతికిల పడడం, చివరి దశలో విజృంభించడం, అభిమానుల్లో ఆశలు రేకెత్తించడం, కీలకమైన ఫైనల్లో తుస్సుమనిపించడం.. ఇదీ భారత క్రికెట్ తీరు (ఏవో కొన్ని టోర్నీలు దీనికి మినహాయింపు). కెప్టెన్‌గా ఎవరున్నా కొనసాగుతున్న ప్రక్రియ ఇదే.. తాజాగా దక్షిణాఫ్రికాలో పరాజయం కూడా ఇదే రీతిలో కొనసాగింది. పసికూన కెన్యాచేతిలో ఘోర ఓటమి పాలవడం మన జట్టు నిలకడను స్పష్టం చేసింది. ముక్కోణపు వన్డే టోర్నీలో పసికూన కెన్యా చేతిలో ఘోర ఓటమిని జీర్ణించుకోలేకపోతున్న అభిమానులకు ఫైనల్స్‌కు చేరుకుందన్న ఆనందం ఎంతోకాలం నిలవలేదు. షరా మామూలుగానే ఫైనల్లో దారుణమైన ఆటతీరుతో భారత జట్టు చేతులెత్తేసింది. ఏమాత్రం పోరాట పటిమ చూపనితీరే అభిమానులను ప్రధానంగా కలవరపరుస్తోంది. ముఖ్యంగా ఫైనల్లో ఓటమి చెందడం ఇది వరుసగా తొమ్మిదోసారి కావడం గమనార్హం. భారత్ ఫైనల్స్‌కు చేరుకున్నా గెలుస్తుందనే నమ్మకం సగటు అభిమానిలో కలుగకపోయినా ఏమూలో మిగిలివున్న ఆశలు కూడా ఆవిరయ్యాయి. ఈ టోర్నీని పరిశీలిస్తే ఒక విషయం అర్థమవుతోంది. టోర్నీలో సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలి, రాహుల్ ద్రావిడ్‌ను మినహాయిస్తే మిగతా బ్యాట్స్‌మెన్ ఎవరూ రాణించలేదు. వారు ముగ్గురిని అవుట్ చేస్తేచాలు మ్యాచ్ గెలిచినట్లేననే భావన దక్షిణాఫ్రికా ఆటగాళ్లలో కనపడడం ఇందుకు తార్కాణం. యువ బ్యాట్స్‌మెన్ వీరేంద్ర సెహ్వాగ్, యువరాజ్‌సింగ్, శివసుందర్ దాస్ తమకు లభించిన అవకాశాన్ని సక్రమంగా వినియోగించుకోలేకపోయారు. ముఖ్యంగా పేస్ బౌలర్లకు సహకరిస్తున్న దక్షిణాఫ్రికా పిచ్‌లపై యువరాజ్ సింగ్ పూర్తిగా విఫలమయ్యాడు. తన ప్రతిభకు తగ్గ ఆటతీరును అతను ఏమాత్రం ప్రదర్శించలేకపోయాడు. వీరేంద్ర సెహ్వాగ్ ఒకటి రెండు మ్యాచ్‌ల్లో మెరుపులు మెరిపించినా మొత్తంమీద జట్టు అతనిపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చలేకపోయాడనడంలో సందేహం లేదు. ఇక వన్డే టోర్నీ చివర్లో హడావిడిగా దక్షిణాఫ్రికా చేరిన వివిఎస్ లక్ష్మణ్ కూడా విఫలమయ్యాడు. రితీందర్‌సింగ్ సోధి, దీప్‌దాస్ గుప్తా కూడా బ్యాటింగ్‌లో క్లిక్ కాలేదు. ఏ జట్టుకైనా కీలకమైనది మిడిలార్డర్ బ్యాటింగ్. ఆ విషయంలో భారత జట్టు చాలా బలహీనంగా కనపడుతోంది. భారత జట్టు ఇంకా సచిన్ టెండూల్కర్, గంగూలిపైనే ప్రధానంగా ఆధారపడుతున్నదని ఈ టోర్నీ నిరూపించింది. ఓపెనర్లు విఫలమైతే ఆదుకునే మిడిలార్డర్ బ్యాటింగ్ మనకు లేదని తేలిపోయింది. ఆస్ట్రేలియానే తీసుకోండి. ఆరంభంలో వికెట్లు పడిపోయినా మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ ఆదుకున్న సందర్భాలు కోకొల్లలు. కానీ మన జట్టును తీసుకుంటే చాలా అరుదు. సచిన్, గంగూలి వికెట్లు ఆరంభంలో పడిపోతే మిగతా బ్యాట్స్‌మెన్ కంగారుపడి వరుసగా వికెట్లు పారేసుకున్న సందర్భాలే ఎక్కువ. ప్రస్తుత ముక్కోణపు వన్డే టోర్నీలో కూడా ఇదే పరిస్థితి పునరావృతమైంది. మన జట్టు ఓటమికి బౌలింగ్‌కన్నా బ్యాటింగ్ లోపమే ప్రధాన కారణమని ఎన్నో సందర్భాల్లో స్పష్టమైంది. ఫైనల్లోనూ ఇదే జరిగింది.

ఇక ఈ సిరీస్‌లో భారత బౌలింగ్‌ను పరిశీలిస్తే శ్రీనాథ్, వెంకటేశ్ ప్రసాద్ రాణించలేదనేది సుస్పష్టం. వారి బౌలింగ్‌లో పస లోపించింది. అగార్కర్ కొన్ని మ్యాచ్‌ల్లో ఫరవాలేదనిపించినా మొత్తం మీద అతని ప్రదర్శన నిరాశాజనకంగా ఉంది. అనిల్ కుంబ్లే బౌలింగ్‌లో కూడా గత వైభవం కనిపించలేదు. ఆకట్టుకునేలా బౌలింగ్ చేసింది ఒక్క హర్భజన్‌సింగ్ మాత్రమే. ఇక ఈ సిరీస్‌లో చెప్పుకోదగినది సచిన్, గంగూలి నెలకొల్పిన కొన్ని రికార్డులు మాత్రమే భారత్‌కు సంతృప్తినిచ్చేవి. కెన్యాతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో తొలి వికెట్‌కు అత్యధిక సెంచరీల భాగస్వామ్యం నెలకొల్పిన ఆటగాళ్లుగా రికార్డు సృష్టించడం సంతోషం కలిగించిన అంశం. విండీస్ ఓపెనర్లు డెస్మండ్ హేన్స్, గ్రీనిడ్జ్ పేరుమీద ఉన్న 15 సెంచరీల భాగస్వామ్యాన్ని బద్దలు కొట్టిన జోడీగా వారు చరిత్రకెక్కారు. ఇది మినహాయిస్తే ముక్కోణపు వన్డే టోర్నీ ద్వారా భారత్‌కు ఒనగూడింది ఏమీ లేదు. ఫైనల్లో వరుసగా తొమ్మిదోసారి పరాజయం పాలవడం తప్ప. 2003 ప్రపంచకప్‌కు సరిగా ఏడాది సమయమే ఉంది. ఈ పరిస్థితుల్లో భారత్ ఆటతీరు ఇదే విధంగా కొనసాగితే వచ్చే ఫలితమేమిటనేది సుస్పష్టం. దీనిని మార్చేందుకు సెలక్షన్ కమిటీ [illegible] కూర్పులో చేపట్టాల్సిన మార్పులపై దృష్టి సారించాలి. ప్రధానంగా మిడిల్ ఆర్డర్‌ను పటిష్టపరిచేందుకు ప్రయత్నించాలి. ఆల్‌రౌండర్ల కొరత పూరించే దిశగా చర్యలు తీసుకోవాలి. అన్నిటికన్నా ముఖ్యంగా ప్రతిభకు పట్టం కట్టే విధానాలను అనుసరించాలి. అప్పుడే జట్టు పరిస్థితి మారుతుంది. ☆



భారతంలో బాలభీముడు!

జె.శ్యామల

చీకటిపడి చాలా సేపే అయింది. అందునా చలికాలం. ఊళ్ళో రోడ్డు మీద రద్దీ తక్కువగా ఉంది. ఇళ్ళల్లో పిల్లలందరూ అల్లరి చేస్తూ, అమ్మ ఆప్యాయంగా పెడుతుంటే కడుపునిండా అన్నం తినటమో, లేదంటే బుల్లితెర చూస్తూ సంబరపడటమో, కాదంటే హోమ్‌వర్క్ బుద్ధిగా చేసుకోవడమో చేస్తున్న వేళ...

రోడ్డు మీద ఓ షాపు దగ్గర నిలబడి లోపల్నుంచి కనిపిస్తున్న టి.వి.ని ఆసక్తిగా చూస్తున్నాడు భీముడు. పేరుకు భీముడేగానీ పిల్లాడు మాత్రం బక్కగానే ఉంటాడు. ఒంటిమీద చిరుగుల చొక్కా చలిని ఆపటం లేదు. అలా అని ఇంటికి పోవాలని వాడికేమాత్రం ఆసక్తి, ఆరాటం లేవు.

టి.వి.లో ఏదో సినిమా నడుస్తోంది పాట... డ్యాన్స్ బాగుంది. చేతులు చొక్కా లోపలికి దాచుకుంటూ టి.వి.నే చూస్తున్నాడు. షాపుకెవరో కస్టమర్లు వచ్చారు. యజమాని వాళ్ళని ఆహ్వానిస్తూ, భీముడివైపు చిరాగ్గా చూశాడు.

'ఏం చూస్తున్నవ్‌ర ఇక్కడ, అక్కడ.. పోపో...' కసురుకున్నాడు. భీముడికి అక్కడ్నుంచి కదలక తప్పలేదు. ఇలాటి కసుర్లూ, విసుర్లూ వాడికలవాటే. అందుకే వాటి గురించి పెద్దగా ఆలోచించలేదు. పరధ్యానంగా ఇంటివైపు అడుగులేశాడు.

ఇంటికెళ్తే ఏముంది? "ఇంతదంక ఏడదిరిగొచ్చినవ్? అన్నీ మీ నాయన బుద్ధులే వస్తున్నా"యంటూ అమ్మకసురుకొని, ఆ తర్వాత "తిండి తిందువురా" అంటూ పని చేసే ఇళ్ళ నుంచి తెచ్చిన చద్దెన్నం పులుసు కలిపి పెట్టింది.

"అమ్మా! ఏడన్నం గావాలే" అన్నాడు.

"నీకిప్పుడదొక్కటే తక్కువయింది. మీ నాయనొస్తడు. అడుగు. ఏడిగిస్తడు" అంది. మాటలోనే నాయన రోజూ మాదిరే తూలుకుంటూ వచ్చాడు. అమ్మ తనకు లేకపోయినా సరే. తండ్రికి మాత్రం కడుపు నిండా పెట్టింది. అయినా సరే. బూతులు తిట్టి, నాలుగు కొట్టి అప్పుడు నిద్దరపోయాడు.

తండ్రంటే తనకు చచ్చేంత భయం. అందుకే గప్‌చిప్‌గా కళ్ళు మూసుకు పడుకున్నాడు. పక్కనే తమ్ముడు, చెల్లి ఒకటే ఆలోచనలు. ఆ టి.వి. పోరల్ని జూస్తె ఎట్లుంటరు. ఐసుక్రీములు తినుకుంటా, మంచి, మంచి బట్టలేసుకొని, బొమ్మలతోని ఆడుకుంటా, నవ్వుతా ఉంటరు. ఒకసారి అమ్మ ఎంతసేపైన రాకుంటే, ఆమె పన్జేసే ఇంటికి బోయిండు. ఇంటి ముంగల ఐస్‌క్రీమ్ బండి. ఆళ్ళ పిల్లలు పెద్ద పెద్దయి చాకోబార్లంట తింటున్నారు. తనక్కూడా కొనియ్యమని అమ్మనడిగిండు – అమ్మబండోణ్ణి ఎంతకొక్కటని అడిగి, ధరవిని 'అమ్మో' అంది.

ఆడేమో "ఏమనుకున్నవ్ మరి. ఇది క్వాలిటీ ఐస్‌క్రీమ్. తక్కువ రేట్ల ఉండవ్. అదుగో ఆ వీధి కొనాకు ఓ బండి ఉన్నది జూడు. ఆడి దగ్గర రూపాయి ఐస్‌ఫ్రూట్‌లుంటయ్. ఆడికిబో..." చెప్పాడు.

"భీమా! ఇవి మనకొద్దుర. అవ్వదగ్గర మంచిగ పల్లీలు కొని బెడత" అంది. "నాకేమొద్దు" మొడికేశాడు తను.

ఇంతలో "పని మధ్యలో వదిలేసి ఏంజేస్తున్నావ్" ఇంటామె అరిచింది. "అమ్మ అరుస్తా ఉంది. నేనొస్తగానీ నువ్వెళ్ళు" అంది అమ్మ. ఐస్‌క్రీమ్ తినాలన్న కోరిక దాని మాదిరే కరిగిపోయింది.

దసర పండుగకు కొత్త అంగీ కొనమంటే "ఏమిరా దొరలింట్లో పుట్టిననుకుంటున్నవా? ఆయమ్మ ఆళ్ళ బాబు అంగీ ఇచ్చింది. అదేసుకో మంచిగనే ఉన్నది. కొత్తది నేనేడనుంచి తెయ్యాలె. వచ్చె పైసలన్నీ మీ నాయన తాగుడుకే సాల్తలేవు" అంది.

ఎప్పుడు జూడు ఎవరిదో అంగీ ఏసుకొనుడే.

దివాలొచ్చింది. టపాసులడిగితే అయ్య తన్నిండు. చెత్తలల్ల కాలకుంట మిగిలిపోయినవి ఏరుకొని కాల్చిండు.

ఇంక సంకురాత్రికి అందరు రంగురంగుల పతంగులు ఎగరేస్తావుంటే తనక్కూడ ఒకటి కొనిపెట్టమన్నాడు. అమ్మనేమో పేపరుకు అన్నమంటించి పతంగి జేసి ఇచ్చింది. ఏంబాగలేదు. ఎట్లైనా ఒక రంగు రంగుల పెద్ద పతంగి పెట్టకోవాల్నని కట్టె పట్టుకొని పరుగెత్తుతా ఉంటే కాల్లో గాజుపెంకు దిగింది. ఒకటే రక్తం. అమ్మ ఏడుపు, తిట్లు, కాలికి కట్టు, కుంటినడక. పది దినాలగ్గాని తగ్గలే.

టి.వి.లో జలేబీ అనుకుంటా జిలేబీ తినే కుర్రాణ్ణి, పొంగిన పూరీలను తినే పిల్లల్ని, రస్నాలు తాగే పిల్లల్ని, మ్యాగీ తినే పిల్లల్ని గుర్తుకు తెచ్చుకుంటూ నిద్రపోయాడు భీముడు. నిద్రలో కల. ఆ కలలో పెద్ద ప్లేట్లో పూరీలు, జిలేబీలు. "నాకే అన్నీ, అన్నీ' అరుస్తున్నాడు

భీముడు. తల్లితట్టిలేపింది. "ఏందిర అట్లరుస్తున్నవ్" అడిగింది.

''పూరీలు, జిలేబీలు'' అమాయకంగా బదులిచ్చాడు భీముడు. 'నీయబ్బ ఎప్పుడు సూడు తిండే" విసుక్కుంది. 'అయినా ఒక్కరోజన్నా పిల్లలకి అవన్నీ తను పెట్టిందా. ఏందో ఈజన్మ" తన మీద తనే విసుక్కుంది అమ్మ భారతమ్మ. మళ్ళీ ఇద్దరూ నిద్రలోకి జారుకున్నారు.

★ ★ ★ ★

తెల్లారింది. భీముడికి మెలకువొచ్చింది. తమ్ముడింకా లేవలేదు. చెల్లి లేచి ఏడుపు మొదలెట్టడంతో నాయన లేచిండు. "పొద్దుగాలే దీని ఏడుపు. రాత్రేల మీ అమ్మ ఏడుపు. సీసీ. ముందుగల దాన్నెత్తుకోర" అరిచాడు.

చెల్లినెత్తుకొని భీముడు "ఊకో, ఊకో" అన్నాడు.

"నువెళ్ళి చాయ్, బీడీలు తేపో" ఆర్డరేశాడు తండ్రి.

"పైసలు" మెల్లిగా అడిగాడు భీముడు.

"మా అమ్మ అటెన్క ఇస్తదని జెప్పు. జెల్దిపో" అరిచాడు.

భీముడు చెల్లినెత్తుకునే పరుగెత్తి తండ్రికి చాయ్, బీడీలు తెచ్చిచ్చాడు.

మంచిగ చాయ్‌తాగి, బీడి ఎలిగించిండు తండ్రి. ఇంతలో అమ్మొచ్చింది. చెల్లికి పాలిచ్చి, జెల్దిజెల్ది నూకలొండి కారం నూరి అయ్యకు పెట్టింది. ఇళ్ళనుంచి తెచ్చిన అన్నం తనకు, తమ్మునికి బెట్టి తను తిన్నది.

"భీమా ఇస్కూలు టైమయితా వుంది. జెల్దిపో" అంది భారతమ్మ.

"నేను బోనె. పుస్తకాల్లేవు. ఫీజు గట్టలే. సార్ మొన్ననే కోపమయిండు. ఎట్ల బొమ్మంటవ్" అన్నాడు భీముడు.

"ఇంటున్నవా? పోరగాని ఫీజు గట్టాలి. లేకుంటే ఆని చదువు ఆగమయితది. వచ్చిన పైసలన్ని తాగనీకే బోతే ఏమయిపోతం" మొగుడితో అంది భారతమ్మ.

"సాలుసాలు. ఆన్ని చదివిస్తె కలెక్టరయి పోతడా? ఎర్రి మొకమా. దేశంల కొలువుల్లేక ఎంతమందున్నరో నీకు తెల్వదు. సదివింది సాలుగాని సైకిల్‌షాప్ ఎంకటసామికి పనోడుగావాల్నంట. భీముణ్ణి పంపితే పనొస్తది. పైసలొస్తయ్. అంతగ్గావ్నాలంటె ఒకేపాలి పదో తరగతి పరీచ్చ గూడ రాయొచ్చంట. అట్లజేస్తే సాలు. 'ఒరేయ్ భీమా! ఎంటకసామి తానికి బోదం జెల్దిరా' రెండోమాటకు చోటు ఇవ్వకుండా ఆర్డరేశాడు.

భీముడు అయిష్టంగా తల్లికేసి చూశాడు.

భారతమ్మ నిస్సహాయంగా తలదించుకుంది.

★ ★ ★ ★

అన్నట్లుగానే తండ్రి భీముణ్ణి పన్లో కుదిర్చాడు. భీముడు అక్కడి సైకిళ్ళను జూస్తూ "హా" ఇస్కూల్లందరూ సైకిల్ కొనుక్కుంటా ఉంటే తనక్కూడా తొక్కాలనిపించి అడిగిండు'' సైకిలంటె నేనేడనించి తేవాలె. అయ్యనడుగు' అంది తల్లి. తనకు అయ్యతోని మాట్లాడే ధైర్యమేది? ఎర్రగ, కోపంగ జూసె ఆయన కళ్ళంటేనే తనకు భయం. "ఏందిర, సైకిలుకు గాలికొట్టుబిడ్డా అంటే పగటి కలలు గంటున్నావ్. మంచి పనోడివే. జెల్దిగానీ" కసిరాడు వెంకటస్వామి. భీముడు ఉలిక్కిపడి గాలికొట్టసాగాడు. సైకిళ్ళు అద్దెకు తీసుకుబోయే వాళ్ళను చూస్తుంటే భీముడి మదిలో ఏదో ఆలోచన మెరిసింది.

కొద్దిరోజులు గడిచాయి. ఆ రోజు వెంకటస్వామి పంచరయిన సైకిల్‌ను బాగుజేసి బీడి కాల్చుకుంటూ "నేను ఒక్క పావుగంటలొస్త. దుక్నం భద్రం కలలుగంట కూసోకు" చెప్పి వెళ్ళాడు.

భీముడు సైకిళ్ళవైపు చూశాడు. తనకు నచ్చిన సైకిల్ తీసుకున్నాడు. ప్రేమగా చేత్తోతాకాడు. ఎన్నాళ్ళకు తన కోరిక తీరుతోంది అనుకుంటూ బయటకు నడిపించాడు. దాన్నెక్కి తొక్కాలని ప్రయత్నించాడు. బ్యాలెన్స్ కుదరటం లేదు. 'దగ్గరుండి నేర్పించనీకి దోస్తు మల్లేశు ఇప్పుడింటె ఎంతబాగుండు' అనుకున్నాడు. కాళ్ళకు పెడల్ అందటం లేదు. ప్రయత్నం మీద ప్రయత్నం. ఇంతలో ఎదురుగా రెండు బర్రెలు. భీముడు వణికి పోయాడు. ఏం జరిగిందో తెలీదు. సైకిల్ దభీమని కిందపడింది. దాంతోపాటే భీముడు.

"అబ్బా" ఏడుస్తూ పైకి లేచ్చాడు. ఒళ్ళంతా గీరుకుపోయింది. ఇంతలో ఎదురుగా వెంకటస్వామి.

"బద్మాష్. దుక్నం భద్రమని జెప్పిపోతే సైకిలెక్కి సవారిజేస్తావ్. సూడు సైకిలెట్ల పాడయిందో. నీపనొద్దు. నువొద్దు. మీ నాయనకు జెప్త" కోపంగా అరిచాడు వెంకటస్వామి.

"నీకాల్మొక్త. మా నాయనకు జెప్పకు" బతిమాలాడు భీముడు.

"చెప్పకుంటే ఈ నుక్సాన్ డబ్బులెట్లబే. నేనింక

మంచోణ్ణి గాబట్టి తన్నకుంట ఊకుంటున్నా" అన్నాడు వెంకటస్వామి. దెబ్బల బాధకు తోడు, నాయనను తలచుకుంటే భీముడికి ఇంకా భయమేసింది.

సాయంత్రమయింది. ఇంటికెళ్ళాడు. గీరుకుబోయిన భీముడి వంటిని చూసి భారతమ్మ "ఏమయిందిరా భీమా? ఈ దెబ్బలేంది" ఆదుర్దాగా అడిగింది.

భీముడికి ఏడుపు తన్నుకు వచ్చిందది. ఏడుస్తూనే జరిగిందంతా జెప్పాడు.

మొగుడొచ్చి ఏం గొడవ చేస్తాడో అని ఆమె కూడా భయపడింది. దెబ్బల మీద మందు రాయబోయింది. ఒళ్ళు వెచ్చగా తగిలింది. కొంచెం జరమున్నట్లుంది. ఎప్పుడో దాచి ఉంచిన జరంగోలీని తెచ్చి భీమునికిచ్చింది. ఉరుక్కుంటూ వెళ్ళి చాయ్, బన్ను తెచ్చింది. "జరమొస్తేనే బాగున్నది. రోజయితే ఈ బన్నుండదు. చాయుండదు" మనసులోనే అనుకున్నాడు భీముడు.

"ఇంక పండుకో" పాత చీరె తెచ్చి కప్పింది. కళ్ళు మూసుకున్నాడు భీముడు. భయం వల్ల నిద్ర కూడా రావటం లేదు. ఓ అరగంట గడిచింది. చిన్నగా కునుకు పట్టిందో, లేదో అంతలోనే అరుపులు 'నాయనొచ్చిండు' అనుకున్నాడు భీముడు.

'ఆడేడి. సక్కంగ పన్జేసుకోమంటే ఓనర్‌లేని టైమ్‌ల సైకిల్ తీసి తొక్కుతాడు. సైకిల్‌ని పడేసిండంట. రిపేరుకు ఇరవై రూపాయలివ్వమంటున్నాడు వెంకటస్వామి" అరిచాడు.

"ఆడు పోరడు. దోస్తులను జూసి సైకిల్ తొక్కాలనుకున్నాడు. పాపం ఆనికి వల్లంత గీరుకొని పోయింది" జరమొచ్చింది. ఇప్పుడే పన్నడు. నీకు దండం బెడత. ఆన్నేమనకు. ఎంకటసామి డబ్బులు ఎట్లనన్న ఇద్దం తియ్" బతిమిలాడింది భారతమ్మ.

"అవ్, అవ్, నీకు ఆడంటే సాలు డబ్బొస్తది. నేనడిగితే మాత్రం యాడ్నించొస్తయ్ అంటవ్. అసలు నిన్ను తన్నాలె" అంటూ ముందుకు రాబోయాడు.

"నీకోసం అమ్మగారిచ్చిన కూరదాచి ఉంచిన. ముందుగాల బువ్వతిందువురా" తెలివిగా దృష్టి మళ్ళించింది.

ఏ కళనున్నాడో కంచం ముందు కూర్చున్నాడు.

"హమ్మయ్య" అనుకుంది భారతమ్మ.

అప్పటిదాకా భయంతో వణికిన భీముడు కూడా గండం గడిచిందనుకొని కుదుటపడ్డాడు.

★ ★ ★ ★

భీముడికి ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదు. కోడికూతతో మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచి చూస్తే అంతా నిద్రలో వున్నారు. రాత్రి జరిగిందంతా గుర్తుకొచ్చింది. "తెల్లారితే అమ్మ పన్లోకి బోతది. అటెన్క నాయన లేస్తడు. నన్ను కొట్టకుండ వదల్తడా? ఎట్లా, ఏం జెయ్యాలె" అనుకుంటూ ఉంటే రైలు కూత వినిపించింది. వెంటనే భీముడికి స్కూల్లో పిల్లలు గుర్తొచ్చారు. సెలవులొస్తె సాలు ఆళ్ళంతా రైలెక్కి పట్నం బోయొస్తా ఉంటారు. రైలెక్కాలని తనక్కూడా ఎప్పటి సందో మనసుల ఉన్నది కాని ఎట్ల..." కడుపు ఉబ్బిపోతున్నట్లుగా అనిపించింది. గుడిసె బయటకు నడిచాడు. ఒకటికి పోయి వస్తూ ఉంటే 'టేసన్‌కు పోయి రైలెక్కితే' ఆలోచన, పైసలైతే లేవు. ఈడనే ఉంటే నాయనతోని తన్నులు తప్పవు. ఏమయితే గానీ మొండిగా అనుకొని స్టేషన్‌వైపు నడిచాడు.

ఏదో బండి రెడీగుంది. ఎవరో అనుకుంటుంటే అది పట్నం బండని అర్థమయింది. ఎక్కేశాడు. బండి కదిలింది. తలుపు దగ్గరే నిలబడ్డాడు. మొదటిసారి రైలు ప్రయాణం. చెట్లు, స్తంభాలు, పొలాలు వెనక్కి వెళ్ళిపోతుంటే ఆశ్చర్యంగా చూస్తూ నిల్చున్నాడు. కొంచెం సేపటికి కాళ్ళు పీకుతున్నట్టనిపించింది. ఎదురుగుండా అద్దంలో తన మొహం కనిపించింది. 'ఛీ జిడ్డు' అనుకున్నాడు. జనాలందరూ ఇంకా నిద్రమత్తులో వున్నారు. అట్నుంచి టి.సి. వస్తున్నట్లు కనిపించింది. భీముడి బుర్ర చురుగ్గా పని చేసింది. వెంటనే టాయ్‌లెట్‌లోకి వెళ్ళాడు. రైలు చేసే ధన్‌ధన్ చప్పుడుతో పాటు, భీముడి గుండె కూడా ధన్‌ధన్ అన్నట్లనిపించింది.

కొంచెం సేపు గడిచింది. నీళ్ళు మొహం మీద చల్లుకుని, ఒంటికున్న చొక్కాతోనే తుడుచుకున్నాడు. మెల్లిగా తలుపు తీసి బయటికొచ్చాడు. టి.సి. లేదు. 'హమ్మయ్య అనుకొని మెల్లిగా ముందుకెళ్ళాడు. ఓ బెర్త్ కింద కొరికి పడేసిన యాపిల్ కనిపించింది. 'అంతమంచి పండును అట్ల పడేసిండ్రు. ఎన్నాళ్ళనుంచో తనకు సేపు తినాలని కోరిక. మెల్లగా కూర్చుని చేయి ముందుకు చాపి పండునందుకొని మళ్ళీ ఇవతలకు వచ్చాడు. వాష్ బేసిన్ దగ్గరకెళ్ళి పండుకంటుకొన్న మట్టిని కడిగేశాడు. కూర్చుని దాన్ని తినటం మొదలెట్టాడు. అబ్బ! ఎంతబాగుంది!' అనుకున్నాడు.

పూర్తిగా తెల్లారింది. ప్రయాణికులు లేచి ఒక్కొక్కరే బాత్‌రూమ్‌లకు వెళ్ళటం, బ్రష్ చేసుకోవటం, కాఫీలు తాగటం చేస్తున్నారు.

"అబ్బ! దర్జాగా కూర్చుని కాఫీలు తాక్కుంటూ, సిగరెట్లు కాలుస్త కూసున్నారు. ఆడవాళ్ళు కాఫీలు తాగి చిన్నిచిన్ని అద్దాల్లోముఖాలు చూసుకుంటూ మేకప్ చేసుకుంటున్నారు. భీముడికి అమ్మ గుర్తుకొచ్చింది. "అమ్మ ఎప్పుడు ఇట్ల అద్దం జూస్కుంట కూసోంగ సూడలేదు. అవును. తను జెప్పకుంట వచ్చేసిండు. అమ్మగిట్ల ఏడుస్తావుందో, ఏమో. నాయనేమన్నడో. వచ్చేటప్పుడు తను అమ్మ గురించి ఆలోచన చెయ్యలేదు. పాపం అమ్మ! ఇప్పుడనుకుంటే ఏం లాభం? కానీతియ్. పట్నంల తను గూడ ఏదన్న పనిజేసి డబ్బులు సంపాయిస్తడు. డబ్బులు జమజేస్కోని అప్పుడు అమ్మతానికి పోవాలె" భీముడు ఊహల్లో చాలా దూరమే ప్రయాణించాడు.

ఇంతలో పట్నం రానే వచ్చింది. అందరూ లగేజీలు తీసుకొని దిగటం మొదలుపెట్టారు. కొందరికయితే చుట్టాలెదురొచ్చి సామాన్లందుకుంటూ, పలకరిస్తూ వున్నారు. భీముడు అవన్నీ చిత్రంగా చూస్తూ, చివరిగా దిగాడు. అందరితో పాటు వెనగ్గా నడిచాడు. అందరూ టికెట్లు బయటకు తీయటం, చూపించటం గమనించి వెనక్కి తగ్గాడు. అటువెళ్ళకుండా, మరో వైపుగా నడవసాగాడు. బైటికి ఏదో దారి కనిపించింది.

అటుగా నడిచాడు. దగ్గర్లోనే ఏదో గుడి వుంది. గుంటలు వినిపిస్తున్నాయ్. లోపలకు పోయాడు. దేవుణ్ణి చూసి, కళ్ళు మూసుకుని దండం పెట్టుకున్నాడు. ఇంతలో పూజారి ప్రసాదం పళ్ళెం పట్టుకొచ్చాడు. గబుక్కున చేయి జాపాడు భీముడు. గుప్పెడు పులిహోర దక్కింది. బయటకు తెచ్చుకుతిన్నాడు. అది ఏ మూలకు సరిపోతుంది. అయినా తప్పదు. నల్లా దగ్గరకు పోయి కడుపునిండా నీళ్ళు తాగాడు.

స్టేషన్ చుట్టూ బజార్లే. నాలుగు బజార్లూ తిరిగాడు. చిత్ర, విచిత్రమైన రంగురంగుల వస్తువులు, బస్సులు, ఒకటే రొద. విపరీతంగా జనం. తనకి పని ఎవరిస్తారో అర్థం కాలేదు. మళ్ళీ వచ్చిన తోవనే స్టేషన్‌లోకి వెళ్ళి ఓ చోటు చూసుకుని కునుకు తీశాడు. మెలకువ వచ్చింది. రైళ్ళు వస్తున్నయ్. పోతున్నయ్. లేచి రైలు వెంబడే నడవసాగాడు. ఎవరో పాప సమోసా తింటోంది. కిటికీలోంచి తొంగి చూస్తోంది. అంతలో చేతిలో సమోసా కాస్తా కిందపడింది. ఆ పిల్ల 'నా సమోసా' అంటూ ఏడవటం మొదలు పెట్టింది. 'గట్టిగా పట్టుకోలేవూ. మళ్ళీ కొనుక్కుందాంలే. ఏడవకు ఇదుగో ఈ మ్యాంగో జెల్లీ తిను. వాళ్ళమ్మ అంటోంది. జెల్లీ కోసం ఆ అమ్మాయి అటు తిరిగింది. భీముడు కిందకు వంగి సమోసా తీసుకు ముందుకు నడిచాడు. "ఊఁబాగుంది. కానీ ఈ కొంచెం ఏం సాల్తది' అనుకున్నాడు.

అట్లా మూడు రోజులు గడిపేశాడు. దొరికింది తినటం, స్టేషన్‌లోనే ఓ మూల పడుకోవటం, కాలక్షేపానికి టి.వి. చూడటం.. రకరకాల ఆలోచనలు.

వంటిమీద బట్టలు మాసినయ్. పలకరించే వాళ్ళు లేరు. ఎక్కడికి బోవాలో, ఏం చేయాలో తెలీడం లేదు. మళ్ళీ బండెక్కి ఊరెళితే అనుకొని నాయన కోపం యాదికొచ్చి "అమ్మో!" అనుకున్నాడు.

ఇంతలో ఎవరో ఒక మనిషి వేగంగా పరుగెత్తుతూ వచ్చి పర్స్ తన ముందు విసిరేసి క్షణంలో మాయమయ్యాడు. భీముడు ఆశ్చర్యంగా తీసి చూశాడు. ఖాళీ పర్స్ "ఇక్కడేసిండు ఎందుకో" అనుకుంటూ ఉంటే ఓ ముగ్గురు మనుషులు వేగంగా వచ్చారు.

"ఆ అదుగో పర్సు లోకమంతా దొంగలే. సూడబోతే పోరడు" గట్టిగా అన్నాడు ఒకాయన.

"ఏంది దొరికిండా" వెనకనే వచ్చినతను అడిగాడు.

"పర్సేంటి, దొంగేంటి" భయపడ్డ భీముడు, రెండో గొంతు బాగా పరిచయమయిందిగా వినిపిస్తే తలెత్తి చూశాడు.

"అరె! సైకిల్ షాపు ఎంకటసామి"

ఇద్దరి చూపులూ కలుసుకున్నయ్ "ఏందిర నువ్విక్కడ! అక్కడ మనూళ్ళ మీ అమ్మ ఒక్క తీరుగ ఏడుస్తా వుంది. నువ్వు ఈడకొచ్చినావ్" అన్నాడు.

వెంకటస్వామి తననుకున్నట్లుగా కోపంగా లేకపోయేసరికి భీముడికి కొంచెం ధైర్యమొచ్చింది. "సైకిల్ పడేసినందుకు అయ్య కొడతాడని భయమైంది. వచ్చేసిన. సేటూ నేనైతే ఏం దొంగతనం జేయలే. ఎవులో పరుగెత్తుకుంటూ ఈ పర్సు ఇసిరేసి పోయిండ్రు. మా అమ్మమీదొట్టు" ఏడుస్తూ చెప్పాడు.

"నేను సైకిల్ టైర్లు కొననీకి పట్నమొచ్చిన. ఆడెవడో దొంగనా... పర్సుల పైసలు తీసేస్కుని ఇది ఈడ పడేసిండన్నట్లు. పోతే పోనీ ఆడేం బాగుపడతడు. అవుగానీ భీమా నాతోని వచ్చెయ్. మనూరు బోదాం" అన్నాడు వెంకటస్వామి.

పక్కనున్న ఇద్దరు అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

"రావాల్ననే ఉన్నది గాని మా నాయన... " అన్నాడు భీముడు. "మీ నాయన ఏమనడు. నేంజెప్త మంచిగ సదివేటోడివని ఇస్కూలు పంతులన్నడు.. నువ్వు దుక్నంల పని జెయొద్దు. ఇస్కూలుకుబో. ఫీజు పైసలు నేనిస్త. ఏమంటావ్?" అన్నాడు వెంకటస్వామి.

"నువ్వెట్ల జెప్తే అట్ల జేస్త. నువ్వు సానామంచోనివిసేటు" అన్నాడు భీముడు.

ఇద్దరూ తిరిగి రైలెక్కారు. ఈసారి భీముడు ధైర్యంగా, దర్జాగా సీటుమీద కూర్చున్నాడు. వెంకటస్వామి ఇడ్లీలు కొన్నాడు. ఎన్నాళ్ళ తర్వాతో తింటున్నట్లు అన్నాడు భీముడు. పొలమారింది.

"నీళ్ళు తాగరా. మీ అమ్మ యాది జేస్తుండొచ్చు" అన్నాడు వెంకటస్వామి.

టిఫిన్ తిని, చాయ్ తాగాక భీముడికి కొంచెం ఓపిక వచ్చినట్లయింది. జరిగిందంతా గుర్తుకు తెచ్చుకుంటున్నాడు భీముడు. "ఆ పర్సు వెంకటస్వామిది కాకపోతే వేరేవాళ్ళు తనను దొంగ అని, తిట్టి, కొట్టి జైల్లపడేసి, పోలీసులు కొట్టుడు. అమ్మో!" అనుకున్నాడు.

వెంకటస్వామి కూడా ఆలోచిస్తూ "రోజూ ఎంతమంది పిల్లలు ఇట్ల ఇల్లొదిలి, కన్నోళ్ళకు దూరమయి, కూడు, గుడ్డా లేక, దొంగలుగానో, బిచ్చగాళ్ళుగానో బతుకున్నారు. తనే పట్నం రాకుంటే, భీముడికి తను కనపడకుంటే, భీముడు కూడా...." ఊహించుకోడానికే మనసొప్పక "బాప్‌రే" అనుకున్నాడు.

"ఊరెళ్ళినంక అమ్మతోని తప్పుజేసిననని జెప్పాలె. సేటు ఫీజు కడ్తనన్నడు. మంచిగ సదూకుంట తమ్ముడు, చెల్లి ఎట్లున్నరో" ఏవేవో ఊహలు భీముడిలో

అందరి గుండెల సొదలను వింటూ రైలు కర్తవ్యోన్ముఖుడైన అర్జునుడిలా ముందుకు కదిలిపోతూనే వుంది. ☆

భారత వ్యవసాయాన్ని కళ్ళముందుంచిన పుస్తకం

స్వాతంత్ర్యానంతరం నాలుగు దశాబ్దాలపాటు ఆ తర్వాత నూతన ఆర్థిక విధానాలు మొదలైన 1990 దశకం నుండి భారత వ్యవసాయ రంగంలో తలెత్తిన సంక్షోభం గురించి ఈ పుస్తకంలో కళ్ళకు కట్టినట్లు వివరించారు. పత్రికారంగంలో నాలుగున్నర దశాబ్దాల సుదీర్ఘ అనుభవం గలిగిన వి. హనుమంతరావు గత ఎనిమిది ఏళ్ళుగా వ్యవసాయరంగం గురించి రాసిన అనేకవ్యాసాల్లో కొన్నింటిని పుస్తకాన్ని రూపొందించారు. వ్యవసాయ వ్యవసాయ నిధులు, బడ్జెట్, రుణాలు, వ్యాసాలను ఇందులో చేర్చారు. విద్యార్థులు, పాత్రికేయులు ఓపిక చేసుకుని గడిచిన పది సంవత్సరాలుగా వ్యవసాయం పంటలకు బదులుగా వాణిజ్య పంటలను హనుమంతరావు తూర్పారబట్టారు. భూ ప్రభుత్వాలు ఇపుడు తాజాగా కార్పొరేట్ కారణాలను విశ్లేషించారు. బడా పెట్టుబడిదారులకే వ్యవసాయ కడుతున్నదో, ప్రపంచబ్యాంక్ చెప్పు చేతల్లో దిగజారుతున్నాయో వివరించారు. ఇవే వ్యవసాయం పేరుతో సన్న చిన్నకారు మారే రోజులు ఎంతో దూరంలో లేవని పరిశ్రమలు ధ్వంసమైన తీరు, ఉత్పాదకత సంఘాల నిరుపయోగం గురించి కూడా

రచన : వి.హనుమంతరావు, వెల : రు.25/-, ప్రతులకు, వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ఫ్లాట్ నెం.85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్-28

ఒక క్రమంలో సంకలనం చేసి ఈ విధానం- వ్యవసాయ స్థితిగతులు- ధరలు అని మూడు భాగాలుగా 29 వ్యవసాయరంగం పట్ల ఆసక్తి గలవారు, తప్పక చదవవలసిన పుస్తకంగా చెప్పవచ్చు. నానాటికి దిగజారుతున్న వైనం, ఆహార ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ విధానాన్ని సంస్కరణలను భ్రష్టు పట్టించిన కేంద్ర, రాష్ట్ర వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి గల స్వాతంత్ర్యానంతరం పెద్దరైతులు ఇపుడు విధానం ఏ విధంగా ఉపయోగ ఉన్న ప్రభుత్వాలు ఈ రంగాన్ని ఏవిధంగా విధానాలు కొనసాగితే కార్పొరేట్ రైతులు తమ భూముల్లో తామే కూలీలుగా కూడా హెచ్చరించారు. వ్యవసాయాధార పెరగకపోవడం, నీటి వినియోగదారుల వివరించారు. వ్యవసాయ రుణాలు కూడా పెద్ద రైతులకే ఉపయోగపడుతూ, చిన్న సన్నకారు రైతులు క్రమేణా వ్యవసాయాన్ని వదిలిపోయే పరిస్థితులు కల్పిస్తున్న స్థితి గురించి పేర్కొన్నారు. ఎగుమతులపై ఆధారపడే పంటలపైనే ఆధారపడకుండా ఆహారధాన్యాలను పండించాల్సిన ఆవశ్యకత, చిన్న, సన్నకారు రైతులకు రక్షణ కల్పించి, దేశంలో భూసంస్కరణలు అమలుజరపాల్సిన ఆవశ్యకతను రచయిత నొక్కి చెప్పారు.

-ఇ.వి. బాలాజీ

స్వీకారం



ఇందులో మూడు నాటకాలు, ఎనిమిది రూపికలు వున్నాయి. రాజరాజు నాటకం తన రచనలన్నిటికీ తలమానికంగా కవి శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి స్వయంగా చెప్పుకొన్నారు.

శ్రీపాదసుబ్రహ్మణ్య శాస్త్రి నాటకాలు, రూపికలు

వెల : రూ. 125/-, ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

ఎయిడ్స్ చుట్టూ నేటి ప్రపంచం పరిభ్రమిస్తోంది. కేవలం రెండు దశాబ్దాల క్రితం గమనించిన ఈ వ్యాధి మానవ జీవితపు పార్శ్వాలన్నిటి పైనా తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని కల్గించింది, కల్గిస్తోంది.



ఎయిడ్స్

రచన : డా॥ యనమదల మురళీకృష్ణ, వెల : రూ. 15, ప్రతులకు : వై.గీతాదేవి, 4-32, నేరెళ్ళమ్మ గుడివద్ద, ఇంద్రపాలెం, కాకినాడ - 533 006.



మెడికల్ లాబొరేటరీ టెక్నాలజీని అనేక మంది తెలుగు మీడియం విద్యార్థులు అభ్యసిస్తున్నా నేటికీ తెలుగులో మెడికల్ లేబొరేటరీ మేన్యువల్ లేకపోవడం పెద్ద లోటు. మన విద్యార్థులు తమ భాషలోనే విషయ పరిజ్ఞానం పొందడానికి తొలిసారిగా తెలుగులో ఈ మేన్యువల్‌ను రూపొందించారు. లాబ్‌టెక్నాలజీ విద్యార్థులకే కాక లాబరేటరీలకు కూడా ఈ పుస్తకం ఉపయోగపడే విధంగా వీలైనంత ఎక్కువ సబ్జెక్టును సరళంగా చెప్పాలనే ప్రయత్నాన్ని రచయిత్రి చేశారు. తెలుగులో ఈ తరహా పుస్తకం ఇదే మొదటిది.

మైక్రోబయాలజీ

రచన : డా॥ ఆర్.లక్ష్మీకుమారి, వెల : రూ. 75/-, ప్రతులకు: వై.గీతాదేవి, 3-50, ఇంద్రపాలెం, కాకినాడ.

మరో ప్రతిఘటన

నాకో పాట పాడాలనుంది, ఇది తప్పెట్లు ఉప్పెనలవుతున్నకాలం, తెడ్డుల రోడ్డు రోడ్డును బ్లాస్ట్ చేస్తా, దళిత గులేర్ దెబ్బను రుచి చూయిత్త వంటి ఈటెల లాంటి పదాలతో ఒక పరిపూర్ణతను సాధిస్తూ దళిత కవితా సంకలనం "కడుపుమీద కొట్టకండ్రి" సెంట్రల్ యూనివర్సిటీ దళిత రీసెర్చర్‌లు వెలువరించింది. దీనిలో మొత్తం నలుబదైదు కవితలున్నాయి. దేని ప్రత్యేకత దానిదే. ఎవరి వాయిస్ వారిదే. సాహిత్య బాటలో నూతనత్వాన్ని అన్వేషిస్తూ ఏదైనా అక్కడి నుండి ఒక కవిత వస్తుండటం కొందరి వెన్నుల్లో వణుకొన్నుంది. కొందరికి ఆనందం ఏదో బ్లాస్ట్ అవుతుందని. ఈ కవితల్లో కొన్ని పలు పత్రికల్లో అచ్చయినవే మరో విశేషం తన చుట్టూ వున్న సంకెళ్ళని త్రెంచుకొని స్వేచ్ఛ కోసం కలం పట్టారేమోనన్నంత వాడిగా వేడిగా గుండెల్లో కలికేంత విషాదంగా రాశారు కవయిత్రులు. ఈ మధ్య కాలంలో గ్లోబలైజేషన్, ప్రైవేటీకరణ, లిబరలైజేషన్, సామ్రాజ్యవాద వ్యతిరేకతను దళిత కవులు నిశితంగా గుర్తిస్తున్నారు. అద్భుతంగా స్పందిస్తున్నారు. చాలా మంచి

సంకలనకర్త : గుండెదప్పు కనకయ్య, వెల : రు.25/-, ప్రతులకు,: విశాలాంధ్ర బుక్‌హౌస్, అబిడ్స్, హైదరాబాద్

పరిణామంగా చెప్పుకుంటే ఈ కవితా సంకలనంలోని కొన్ని కవితలు ఆ క్రమంలో ముందు వరుసలో నిల్చుంటాయని ఈ క్రింది పంక్తులు చూస్తే తెలుస్తుంది. "గ్లోబలైజేషన్ అరచేతిలో స్వర్గం, ఇంటర్నెట్ మోహినీరూపం, మరో మిలీనియం దాకా వెతికినా నాకిక అక్షరం ముక్క మళ్ళీ కన్పించదేమో అని దార్ల తన కూలుతున్న లైబ్రరీలో ఆందోళనను వ్యక్తం చేస్తూ అన్నం ముద్ద కంటే అక్షరాన్నే హత్తుకుంటాను ఆబగా అంటాడు. అద్భుతమైన ఎక్స్‌ప్రెషన్, ఉరికొచ్చే సూర్యకిరణాల్ని ఎక్స్‌రే తీసినట్లుగా "జమిడిక మోతలో నీకు, రహమాన్ సంగీతాన్ని వినిపిస్తాను, ప్రతీకలు వాడటంలో నేర్పరి జిలుకర "జమిడిక". బైండ్ల కళలకు ప్రతిబింబం, దళితులు క్షేమమే, దండోరాక్షేమమే, మాదిగ సాహిత్యం క్షేమమే, విద్యాలయాల్లో నీ కవితలు అధ్యయనాలయ్యాయి అని 'సుందర్రాజుకో ఉత్తరం'లో కాకాని గుండెలు పిండుతాడు. దళిత సాహిత్యాన్ని ఉవ్వెత్తుకు ఎగసి ఎగిరిపోయిన సుందర్రాజును మర్చిపోలేకపోయాడు. అసలు దళిత సాహిత్యమే మర్చిపోలేదతనిని. సెలిమె ఎండిపోతుంది, సకాలంలో పించనిచ్చే నాథుడేడీ? ప్రస్తుత దళిత స్థితి కొత్త కోణంలో కోడ్ చేశాడు కనకయ్య. నా గుండెపుడు మండే కలిమి... సంద్రాన్ని తాగినా అవి చల్లారదు, తరతరాల బానిసల్లోకెల్ల బానిస స్త్రీ బానిసత్వాన్ని నిరశిస్తుంది రాజేశ్వరి. కావలసినంత ఆవేశం, చెప్పాల్సినంత ఉద్వేగంలో చెప్పడం ప్రత్యేకమైనదే. బతుక్కోసం మెతుక్కోసం, ఈ భూమిపై ఉనిక్కోసం అని తన పోరాట లక్ష్యాన్ని జాజులగౌరీ వెల్లడించింది. కవిత్వంలో స్పష్టత కావలసినంత కన్పిస్తుంది. రావలసిన సమయంలో వచ్చింది. మరికొంత స్పష్టతను తెలపడం అవసరమని వీళ్ళు గమనించాలి.

- ఐనాల సైదులు

'పుట్టపాకకు మరో జాతీయ పురస్కారం'

ఉపరాష్ట్రపతి కృష్ణకాంత్ నుండి అవార్డు అందుకుంటున్న గోలి సాంబయ్య, గంజి రాంబాయమ్మ

'గతమెంతో ఘనకీర్తి' అన్న నానుడికి విరుద్ధంగా నేటికీ చేనేత రంగంలో తమ ప్రతిభను చాటిచెప్పుతున్నారు నల్గొండ జిల్లా పుట్టపాక గ్రామ చేనేత కార్మికులు. అపురూపమైన చేనేత వస్త్రాలు తయారు చేయడం ద్వారా పుట్టపాక గ్రామం చాలా ఏళ్ళ క్రితమే జాతీయ, అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. టై అండ్ డై, తెయిలీ రుమాల్, డబుల్ ఇక్కత్, ఇక్కత్ వంటి అగ్రశ్రేణి వస్త్రాలను ఇక్కడి కార్మికులు ఎంతో సుందరంగా తయారు చేస్తారు. ఆ వారసత్వ చరిత్రను మరోసారి నిలబెట్టారు గోలి సాంబయ్య, గజం రాంబాయమ్మ. వారిద్దరు సంయుక్తంగా తయారు చేసిన ఇండోనేషియా ట్రైబల్ డిజైన్ టైఅండ్‌డై ఇక్కత్ దుప్పటికి జాతీయ చేతివృత్తుల అవార్డు లభించింది. 1998-99 సంవత్సరపు విభాగంలో ఈ బహుమతి ప్రకటించగా ఈ ఏడాది ఆగస్టు 8న బహూకరించారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన భవనంలో జరిగిన ఒక కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి కె. కృష్ణకాంత్ ఈ అవార్డులను అందచేశారు. కేంద్ర జౌళి శాఖ, హస్తకళ అభివృద్ధి సంస్థ సంయుక్తంగా ప్రతి సంవత్సరం చేతివృత్తి కళాకారులు తయారు చేసిన వస్తువుల ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నాయి.

'గతంలోకి వెళితే...'

ఈ గ్రామం నుండి మొదటిసారిగా జాతీయ బహుమతి పొందిన వ్యక్తి గజం రాములు. ఆయన తయారు చేసిన తెయిలీ రుమాలును టోక్యో, లండన్, పారిస్ తదితర నగరాల్లో ప్రదర్శించారు. 1983లో ప్రభుత్వం ఆయనకు 'విశ్వకర్మ' అవార్డును ప్రదానం చేసింది. అప్పటి దేశ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ చేతుల మీదుగా ఆయన అవార్డును, నగదును అందుకున్నారు. 1983లోనే హస్తకళ జాతీయ అవార్డుకు గజం రాములు సోదరుడు గజం గోవర్ధన్ ఎంపికయ్యారు. అప్పటి రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ ఈ అవార్డును అందచేశారు. 1989లో గజం రాములు మరో సోదరుడు గజం అంజయ్య హస్తకళ జాతీయ అవార్డుకు ఎంపిక కాగా అప్పటి రాష్ట్రపతి కె.ఆర్. వెంకట్రామన్ ఈ బహుమతిని అందచేశారు. ఇప్పుడు 1998-99 సంవత్సరానికి గోలి సాంబయ్య, గజం రాంబాయమ్మ సంయుక్తంగా అవార్డు గెలుచుకోవడంతో మరోసారి పుట్టపాక అందరి దృష్టిని ఆకర్షించింది.



అవార్డు వచ్చింది
ఈ డిజైన్‌కే...

'ప్రతిభ అపురూపమే...ఆదరణే లేదు'

'ఇక్కత్' కళలో ఆంధ్రప్రదేశ్ పెట్టింది పేరుగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగానే అనేకమంది చేనేత కళాకారులు ఈ కళలో నిష్ణాతులుగా ఉన్నారు. ప్రతి రంగంలోనూ విదేశాలతో పోటీపడాలని చెప్పే మన పాలకులు అంతర్జాతీయంగానే అందరినీ ఆశ్చర్యపరుస్తున్న దేశీయ కళాకారుల పట్ల మాత్రం నిరాదరణతో వ్యవహరిస్తున్నారు. తమ కళ ద్వారా రాష్ట్రానికీ, తద్వారా దేశానికి ఎన్నో కీర్తిప్రతిష్ఠలు సముపార్జిస్తున్న ఈ కళాకారుల సంక్షేమానికి పాలకులు ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు. నల్గొండ జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో గల ఈ పుట్టపాక గ్రామంలో సుమారు వేయి మంది వరకు ఈ చేనేత వృత్తినే ప్రధాన జీవనాధారంగా కలిగి ఉన్నారు. కేంద్ర నూతన జౌళి విధానం వలన వందలాది మంది కార్మికులు చేసేందుకు పనిలేక, తినడానికి తిండిలేక దుర్భర జీవితాలను గడుపుతున్నారు. ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో పాటు పెద్ద పెద్ద పరిశ్రమల్లో తయారైన వస్త్రాలు చౌకగా లభిస్తుండడంతో చేనేత కార్మికులకు పెద్దగా గిరాకీ ఉండడం లేదు. అవార్డులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న ప్రభుత్వం ఆ తరువాత వారు ఏమయ్యారనే విషయాన్ని పట్టించుకోవడం లేదు. అగ్గిపెట్టెలో ఇమిడేంత సన్నని చీరను తయారు చేసిన ప్రతిభ గల ఈ కళాకారులకు ఎలాంటి ఆర్థికసాయం లేక, వేరే పనిచేయలేక కొట్టుమిట్టాడుతున్నారు. అవార్డులు వస్తున్నా ఆకలిచావులు తప్పని చేనేత కార్మికులను ఆదుకోవడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తేనే వారి కళ నిలబడుతుంది.

-సిహెచ్. అంజయ్య

'నన్ను చంపుకోండి, ఈ యువకుడ్ని వదిలేయండి'

యు.రామకృష్ణ

1950వ సంవత్సరం, మేనెల 12వ తేదీ...

సాయం సమయం...

చుట్టూ పొలాలు... వాటి మధ్య ఓ పెద్ద చెట్టు...

ఇద్దరు యోధులు ఆ చెట్టుకు బలమైన తాళ్ళతో కట్టివేయబడి ఉన్నారు...

ఎదురుగా పోలీసు ముష్కరులు...

కట్టివేయబడిన వారికి తుపాకులు ఎక్కుపెట్టబడ్డాయి...

కొద్దిక్షణాల్లో ఆ యోధుల ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోబోతున్నాయి...

"చనిపోయే ముందు నాదో చిన్న కోరిక. నాతోపాటు కట్టివేసిన ఈ యువకుడిని వదిలేయండి. ఈ మధ్యనే వివాహం చేసుకున్నాడు. నన్ను చంపుకోండి. నాకేం అభ్యంతరంలేదు" ఎంతో ధీరోదాత్తంగా పలికాడా నడివయస్సు వ్యక్తి.

ఆ మాటలు తమనెంతో జాలిగొలిపినట్లు... ఆ యువకుడి కట్లు విప్పి వదిలివేసినట్లు నటిస్తూ... కన్ను మూసి తెరిచేలోగా అతనిని వెనుక నుండి కాల్చి చంపారా పోలీసులు

ఆమరుక్షణమే ఆ నడివయస్సు వ్యక్తి తొడలోకి గురిచూసి కాల్చారు కిరాతకాలకు ప్రతిరూపాలైన ఆ పోలీసులు...

"ఒరేయ్, మనిషి ప్రాణం తొడలో కాదురా ఉండేది. హృదయంలో ఉంటుంది. మీకు దమ్ములుంటే, ఈ గుండెకు గురిపెట్టి కాల్చుకోండిరా" అంటూ ఆ నడివయస్సు వ్యక్తి చొక్కావిప్పి పోలీసులకు తన ఛాతీని చూపాడు.

ధన్... ధన్... ధన్... ఆ ఛాతీ గుండా ఎన్ని తుపాకీ గుళ్ళు దూసుకుపోయాయో లెక్కలేదు. ఆ యోధుని శిరస్సు వాలిపోయింది. ఆ యోధుని గొంతు మూగబోయింది. ఆ యోధుని ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయింది.

* * * *

పోలీసుల తుపాకీ గుళ్ళకు బలైన ఆ నడివయసు వ్యక్తే కామ్రేడ్ చల్లపల్లి నారాయణరావు. కొత్తగా పెళ్ళయిన ఆ యువకుడే కామ్రేడ్ గోగినేని తాతయ్య.

కృష్ణాజిల్లా కొత్తపాలెం సమీపంలో దాగి ఉన్న వారిరువురినీ భూస్వాములు పట్టుకొని అవనిగడ్డ పోలీస్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నాయకత్వాన ఉన్న పోలీస్ బృందానికి అప్పగించారు. వారిద్దరినీ కాల్చిచంపిన తరువాత పోలీసులకూ, కమ్యూనిస్టులకూ మధ్య జరిగిన సంఘర్షణగా వారు దానిని పేర్కొన్నారు. అయితే ఆ తరువాత ఆ ఇద్దరు యోధులను పట్టి ఇచ్చిన వారికి బహుమతులు అందజేసినట్లు వార్త వెలువడింది.

* * * *

దేవరకోట ఎస్టేట్ జమీందార్ ముఖ్య గ్రామమైన కృష్ణాజిల్లా చల్లపల్లిలో 1913లో ఒక సనాతన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు కామ్రేడ్ చల్లపల్లి నారాయణరావు. తండ్రి గోపాల కృష్ణయ్య. తల్లి రుక్మిణమ్మ. ఆయన సోదరులు వెంకట రామదాసు చల్లపల్లి కరణంగా పనిచేసేవారు. వీరికి ముగ్గురు సోదరీమణులు కూడా ఉన్నారు.

ప్రాథమిక, ఉన్నత పాఠశాల చదువులు చల్లపల్లిలోనే పూర్తిచేసిన నారాయణరావును 1928వ సంవత్సరంలో ఇంటర్ చదవడానికి గుంటూరులోని ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో చేర్పించారు. కాలేజీలో

అమరజీవి చల్లపల్లి నారాయణరావు

చదువుతుండగానే ఆయన సత్యవతమ్మను వివాహం చేసుకున్నారు.

బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, స్వరాజ్యంకోసం దేశమంతటా ముమ్మరంగా ఆందోళనలు జరుగుతున్న కాలమది. 1930వ సంవత్సరంలో అంటే తన 17వ ఏట 'దేశభక్త' కొండా వెంకటప్పయ్య పంతులు, ఉన్నవ లక్ష్మీనారాయణ నాయకత్వంలో జాతీయోద్యమ శంఖారావాన్ని విన్నాడు. ఎఫ్.ఎ. ఫైనలియర్ పరీక్షలు వచ్చాయి. అదే సమయంలో మహాత్మాగాంధీ నాయకత్వాన దేశమంతటా ఉప్పు సత్యాగ్రహం ప్రారంభమైంది. దీనికి నారాయణరావు తన కాలేజీ విద్యార్థులను సమీకరించాడు. విద్యార్థులంతా తరగతులకు వెళ్ళకుండా బహిష్కరించారు.

ఉద్యమంలో పాల్గొనవద్దని, తెలివితేటలు, సామర్థ్యం ఉన్న నీవు ఎఫ్.ఎ. ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణుడవు కాగలవని, మంచి ఉద్యోగం పొందగలవని కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావుకు హితబోధ చేశారు. అయితే నారాయణరావు తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. కళాశాలను విడిచి పెట్టాడు. అంతేకాదు తన స్వగ్రామంలో కరణీకం చేస్తున్న సోదరుడు రామదాసును ఉద్యోగం వదిలిపెట్టి, స్వేచ్ఛా భారత నిర్మాణం కోసం సాగే పోరాటంలో పాల్గొనేందుకు గుంటూరు రమ్మని పొలికేకవేశాడు. ఆవిధంగా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి తన తమ్ముని వద్దకు వెళ్ళిన రామదాసు గుంటూరు సత్యాగ్రహంలోనూ, నారాయణరావు అదే జిల్లా నర్సరావుపేటలో జరిగిన సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిరువురికీ ఓ ఏడాది కఠిన కారాగారశిక్ష విధించి రాజమండ్రి, ఆలీపురం (బళ్ళారి) జైళ్ళల్లో నిర్బంధించారు.

విద్యార్థులుగా ఉంటూ జాతీయోద్యమంలో పాల్గొన్న పోలేపెద్ది నరసింహమూర్తి, పులుపుల శివయ్య, బద్దం ఎల్లారెడ్డితో నారాయణరావుకు సాహచర్యం ఏర్పడింది. ఫలితంగా ఆయన దృష్టి సాంఘిక, రాజకీయ కార్యక్రమాలవైపు మళ్ళింది. వర్ణాంతర భోజనాలను ఏర్పాటుచేసి తానూ చేశాడు. తన మేనకోడలు భర్త చనిపోతే సనాతన సంఘాన్ని వ్యతిరేకించి పునర్వివాహం చేయించాడు. ఆ రోజుల్లో వితంతువులకు, అందునా బ్రాహ్మణులలో తిరిగి పెళ్ళి చేయడమంటే ఎంతో కష్టసాధ్యం. సనాతన బ్రాహ్మణులు నారాయణరావు కుటుంబాన్ని కులం నుండి వెలివేశారు. కాలం గడిచేకొద్దీ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న మితవాద వైఖరిని అర్థం చేసుకున్న నారాయణరావు క్రమంగా అతివాద రాజకీయాల వైపు మొగ్గారు.

* * * *

స్వస్థలమైన చల్లపల్లి జమీందారీ గ్రామాలలో రైతాంగం అనుభవిస్తున్న నికృష్ట పరిస్థితులను అర్థం చేసుకున్న నారాయణరావు, దేశానికి వెన్నుముకలాంటి వారైన రైతు, కూలీలను వారి వృత్తి సంఘాలలోకి సమీకరించాలనుకున్నాడు. అప్పటికే తాలూకా రైతు సంఘాన్ని స్థాపించి రైతు ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న చలసాని వాసుదేవరావు, కాకర్ల చంద్రశేఖరరావుతో పరిచయం ఏర్పాటు చేసుకొని రైతు సంఘ కార్యకర్తగా పనిచేయడం ప్రారంభించాడు.

జస్టిస్ పార్టీకి చెందిన జమీందారుకు భయపడి ఎవరూ రైతుసంఘం ఆఫీసుకు ఇల్లు ఇవ్వకపోతే నారాయణరావు తన స్వంత ఇంటిని రైతుసంఘ కార్యకలాపాలకు నిలయం చేశాడు. చల్లపల్లి ఎస్టేట్ జమీందారీ గ్రామాలలోని రైతులు, వ్యవసాయకూలీల పరిస్థితులు దుర్భరంగా ఉండేవి. జమీందారీ వ్యతిరేక పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ నిర్వహిస్తున్న చారిత్రాత్మక పాత్రను అర్థం చేసుకున్న నారాయణరావు కమ్యూనిస్టుపార్టీ వైపు ఆకర్షించబడి

1939లో సభ్యత్వం పొందారు.

★ ★ ★ ★

కృష్ణాజిల్లా దివి తాలూకా మంగళాపురం గ్రామ రైతాంగం చల్లపల్లి జమీందారు పలుకుబడిలో ఉండేది. కమ్యూనిస్టుపార్టీ అగ్రనాయకులు చండ్ర రాజేశ్వరరావు ఈ గ్రామ వాస్తవ్యులే. ఆయన భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ ఉన్నత విద్యనభ్యసించి కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్న రోజులవి. అప్పటికే గంటిరెడ్లు అనబడే ముదిరాజు బీదరైతులు చండ్ర రాజేశ్వరరావు నాయకత్వంలో పాటిదిబ్బ, పొట్టి మెట్ట పొలాలు దున్ని పైర్లు పండించి జీవనోపాధి సాగిస్తున్నారు. ఆ బీద రైతులు కమ్యూనిస్టుపార్టీ, రైతు కూలీ సంఘాల ప్రాబల్యంలోకి రావడం సహించలేని చల్లపల్లి జమీందారు, ఆ రైతులను భూముల నుండి వెళ్ళగొట్టి తాను స్వాధీనం చేసుకునేందుకు కుయుక్తులు పన్నాడు. దీనితో చండ్ర రాజేశ్వరరావు, చల్లపల్లి నారాయణరావు, గుంటూరు బాపనయ్య రైతాంగానికి అండగా నిలబడి జమీందారీ వ్యతిరేక పోరాటం నిర్వహించారు. 1943లో జరిగిన ఈ పోరాటంలో వీరి ముగ్గురితోపాటు 300మంది చిన్న, సన్నకారు రైతులను జమీందారు అరెస్ట్ చేయించాడు. ప్రభుత్వం వీరికి మూడు నెలల జైలు శిక్ష విధించి రాజమండ్రి జైలుకు పంపింది.

జమీందారు దుష్టపన్నాగాలకు వ్యతిరేకంగా రైతు, కూలీలను సమీకరించడంలో కామ్రేడ్ చల్లపల్లి నారాయణరావు మేధాశక్తి, నిర్మాణ పటుత్వానికి బెదిరిపోయిన జమీందారు ఎస్టేట్ గ్రామాలలో అన్యాక్రాంతం చేసిన భూములను అమ్ముకోవడం మొదలుపెట్టాడు. శ్రీకాకుళం మొదలగు గ్రామాల్లో కొంతవరకు అమ్మాడు. అచ్చెంపాలెం, మరికొన్ని గ్రామాలలో నారాయణరావు నాయకత్వాన రైతులు జమీందారు దురాక్రమణను అరికట్టారు.

కృష్ణానది లంకల్లో గాజుల్లంక, తడికలపూడి, తిప్పలకట్ట, ఆముదాల్లంక, జువ్వలపాలెం మొదలగు గ్రామాల రైతుల భూములు నదికి వరదలు వచ్చినప్పుడు నదిలో విరిగి పడిపోవడం, మరోచోట లంకలు ఏర్పడటం, అలా ఏర్పడిన లంక భూములు తమవేనని ఆక్రమించడం జమీందారుకు అలవాటైపోయింది. అలాంటి లంకభూముల్లో రైతులు రెల్లుగడ్డి కోయడం, దున్ని విత్తనాలు వేయడం జరుగుతుండేది. ఫలసాయం చేతికి వస్తుండగా జమీందారీ ముఠా తమ మందీమార్బలంతో వచ్చి దౌర్జన్యంగా ఎత్తుకుపోవడం జరిగేది. దీనిని గమనించిన నారాయణరావు రైతులను సమీకరించి జమీందారీ ముఠాను ఎదుర్కొంటూ ఉండేవాడు.

1946లో కృష్ణలంకల పేదరైతుల హక్కులకై నడిపిన పోరాట ఫలితంగా ప్రభుత్వం 'ఎస్టేట్ భూముల అన్యాక్రాంత నిషేధ చట్టం' తెచ్చింది. నారాయణరావుపై ఈ చట్టం కింద అరెస్ట్ వారెంట్ జారీకావడంతో ఆయన రహస్య జీవితం గడపవలసి వచ్చింది.

1947 ఏప్రిల్ 10, 11 తేదీలలో గాజుల్లంకలో జమీందారీ వ్యతిరేక పోరాటం తీవ్రదశకు వెళ్లింది. ఏమైనాసరే రైతులను లంకభూముల నుండి తరిమివేసి, తిరిగి తాను ఆక్రమించాలనే పట్టుదలతో జమీందారు పోలీస్ బలగంతో సిద్ధమై గాజుల్లంకలో తన బలాన్నంతా కేంద్రీకరించాడు. చావుకైనా సిద్ధమేగాని భూములను వదిలిపెట్టేది లేదని నారాయణరావు నాయకత్వాన గాజుల్లంక రైతాంగం భూముల నుండి కదల్లేదు.

జమీందారు బెదిరింపులకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో రాటుదేలిన గాజుల్లంక రైతాంగం మొక్కవోని ధైర్యంతో, నిరాయుధులై ఉండగా నిర్దాక్షిణ్యంగా పోలీసులు కాల్పులు జరిపారు. ఆ కాల్పులలో నలుగురు వీరమరణం చెందారు. వారు బాలిరెడ్డి వియ్యమ్మ, మత్తి సుబ్బారావు, తాడిశెట్టి వెంకటేశ్వర్లు, సనకా సుబ్బారావు.

నారాయణరావు లంక గ్రామాలలో ఉంటూ రైతాంగంలో చీలిక తెచ్చేందుకు జమీందారు వేసే ప్రతి ఎత్తుగడకు ధీటుగా రైతులను ఐక్యపరుస్తూ జమీందారీ వ్యతిరేక ఉద్యమాలు నడుపుతూ వచ్చారు. కృష్ణలంకల రైతాంగం పోరాటం ప్రారంభం నుండి తన అంతిమ శ్వాస విడిచే వరకూ చల్లపల్లి నారాయణరావు రహస్య జీవితం గడుపుతూనే ఉన్నారు. పేద రైతాంగం, వ్యవసాయ కార్మికులు, ప్రజలు నారాయణరావును కంటిలో పాపలాగా కాపాడుకుంటూ వచ్చారు.

★ ★ ★ ★

నైజాం సంస్థానంలో ఒక భాగమైన తెలంగాణా జిల్లాల్లో భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు, పోలీసు బలగాలు జరిపే దౌర్జన్యాలకు, అక్రమాలకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ, స్టేట్ కాంగ్రెస్ పోరాటాలు సాగించాయి. వెట్టి చాకిరికీ, దోపిడీకి, బీద ప్రజలపై అక్రమ వసూళ్ళకు వ్యతిరేకంగా 'సంఘం' పేరుతో జరిగిన పోరాటాలు ఉధృతమయ్యాయి. 1946లో కమ్యూనిస్టు పార్టీని నైజాం ప్రభుత్వం నిషేధించింది. తెలంగాణా గ్రామాలలో నైజాం ప్రభుత్వం సైనిక శిబిరాలు ఏర్పరచింది. కాసిం రజ్వీ నాయకత్వాన రజాకార్ల గుంపు ప్రజలపై అకృత్యాలు సాగించింది. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీలు 1947 సెప్టెంబర్ 11న నిజాం ప్రభుత్వ ఏజెంట్లయిన రజాకార్లకు వ్యతిరేకంగా సాయుధ పోరాటానికి పిలుపు ఇచ్చాయి.

ఆ సమయంలో ఇండియన్ యూనియన్‌లోని ఆంధ్రరాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం తన వాగ్దానాలకు భిన్నంగా వ్యవహరిస్తూ వచ్చింది. 1947 జనవరి 22న పబ్లిక్ సేఫ్టీ (ప్రకాశం ఆర్డినెన్స్) జారీ చేసింది. కమ్యూనిస్టు పార్టీ మీద నిర్బంధాలు ప్రారంభమయ్యాయి. ఆంధ్రజిల్లాల్లో కూడా కమ్యూనిస్టులు రహస్యంగా ఉండి పనిచేయాల్సి వచ్చింది. ఈ పరిస్థితులలో చల్లపల్లి నారాయణరావు కూడా రహస్యంగా ఉంటూ ప్రజలమధ్య పనిచేయాల్సి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం క్రూర నిర్బంధాన్ని అమలు జరుపుతోంది. గ్రామగ్రామాన పోలీసులు క్యాంపులు పెట్టి దొరికిన నాయకులను చిత్రహింసలు పెట్టి కాల్చివేస్తోంది. నారాయణరావు గారి మీదకూడా దాడులు తీవ్రమయ్యాయి. ఆయన భార్య సత్యవతమ్మను ఎన్ని చిత్రహింసలు పెట్టినా భర్త ఆచూకీ చెప్పలేదు. ప్రజల మధ్య రహస్యంగా ఉంటూ వివిధ గ్రామాల ప్రజలను, పార్టీ కార్యకర్తలను కలుసుకునేందుకు వివిధ వేషాలలో కామ్రేడ్ నారాయణరావు వస్తూపోతూ ఉండేవారు. నిన్న మా వూరు వచ్చాడంటే, మొన్న మావూరు వచ్చాడని ఆప్యాయతతో తమ ముద్దుబిడ్డగా భావిస్తూ ప్రజలు నారాయణరావును అభిమానించేవారు.

దివి తాలూకా దివి ఐలెండ్‌లోని తలగడదీవి కొత్తపాలెం గ్రామంలో రహస్యంగా ఉండగా 1950 మే నెల 12వ తేదీ తెల్లవారుజామున కామ్రేడ్ చల్లపల్లి నారాయణరావును, ఆయనకు కొరియర్‌గా ఉన్న కామ్రేడ్ గోగినేని తాతయ్యలను భూస్వాములు ఇచ్చిన ఆచూకీనిబట్టి పోలీసులు నిర్బంధించారు. పగలల్లా వారిని చిత్రహింసలకు గురిచేశారు. అయినా వారినుండి ఒక్క విషయం రాబట్టలేకపోయారు. ఆ సాయంత్రం ఊరి చివర పొలాల్లోకి తీసుకొని పోయి వారిని ఓ చెట్టుకు కట్టివేసి పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ కాల్చి చంపాడు.

ఆ అమర వీరులు నేలకొరిగిన చోట ప్రజలు కామ్రేడ్స్ నారాయణరావు, తాతయ్య పేరిట చల్లపల్లి సమీపంలోని మైదానంలో అమరవీరుల స్మారక చిహ్నంగా పెద్ద స్థూపాన్ని నిర్మించారు. కామ్రేడ్ నారాయణరావు తన 38 ఏళ్ళ జీవితాన్ని పీడిత ప్రజల విముక్తికే అంకితం చేశారు. చివరి వరకూ వారి కోసమే కలవరిస్తూ అమరజీవులయ్యారు.

(వేమూరి నాగేశ్వరరావుగారు అందించిన సమాచారం ఆధారంగా)

చెవినిల్లు కట్టుకుని చెప్పడం...

కొండబాబు

" ఏం కూరలు ఆంటీ" అంటూ ఇంట్లో కొచ్చింది శ్రావణి.

"రా.. శ్రావణీ.. టిఫిన్ అయిందా? పెట్టనా?" పిలిచింది సుజాత.

"టిఫిన్ అయింది కానీ.., అంకుల్ ఆఫీసుకెళ్ళలేదా? వరండాలో చదువుకుంటున్నారు?

"ఆc.. బాగాలేదని లీవ్ పెట్టారు. కాలేజీ లేదా?"

"మాది మార్నింగ్ షిఫ్ట్‌గా.. క్లాసులు జరగలేదు.. అందుకే వెంటనే వచ్చేశా..

"ఈ కాఫీ అంకుల్‌కిచ్చిరా.." అంటూ చనువుగా పురమాయించింది సుజాత.

శ్రావణి కాఫీ ఇచ్చి వస్తూ "సుబ్రహ్మణ్యం యూనివర్శిటీకి వెళ్ళాడా ఆంటీ?" అనడిగింది.

"అవునమ్మా.. ఇవాళ వాడి ఫస్ట్ సెమిస్టర్ రిజల్ట్స్ తెలుస్తాయట" చెప్పింది సుజాత.

"అరె.. మాటల్లోనే సుబ్బు వచ్చేశాడాంటీ.." చెప్పింది శ్రావణి.

"ఏరా.. ఏమైంది" అంటూ కొడుకు వెనకే లోపలికొచ్చాడు శ్రీనివాసం.

"ఏమవుతుంది పాసయ్యా.." నవ్వుతూ కూల్‌గా బదులిచ్చాడు సుబ్రహ్మణ్యం.

"మార్కులెలా వచ్చాయని అడుగుతున్నా" కోపంగా అన్నాడాయన

"యాభైయేడు పర్సెంట్" ఇబ్బందిగా చెప్పాడు.

జరగబోయే ఉత్పాతాన్ని తలుచుకుని సుజాత మాట మార్చబోతుండగానే..

శ్రీనివాసం ఇంతెత్తున లేచాడు.

"అసలా జర్నలిజమే చదవొద్దురా అంటే వినలేదు. చదివేదేదో సరిగ్గా ఏడుస్తున్నావా? అంటే అదీ లేదు. విద్యార్థి సమస్యలంటావు.. సంఘాలంటావు.. ఊరు పట్టుకు తిరుగుతావు.. వచ్చాయి బోడిమార్కులు.. ఈ రోజుల్లో కుర్రాళ్ళంతా కెరీర్ గురించి ఆలోచిస్తున్నార్రా! నీ భవిష్యత్ గురించి ఆలోచించు.. బుద్ధిగా చదువుకోమని చెవినిల్లుకట్టుకుని మరీ చెప్పాను కానీ విన్నావా? చావు.. నీ ఏడుపు నువ్ చావ్" అన్నాడు కోపంగా.

సుబ్రహ్మణ్యం కూడా తండ్రి మీద గొంతుపెంచాడు.

"ఎన్నిసార్లు చెప్పాలి? కెరీర్ పేరుతో కేవలం నా కోసం ఆలోచించడం, నా గురించి చదవటం నావల్ల కాదని చదువు అయినా మరొకటయినా నలుగురికి ఉపయోగపడాలి. అయినా చదువుతున్నాను గదా! ఫస్ట్‌క్లాసులు లాంటి వాటి మీద నాకు పెద్ద ఆసక్తులు లేవు" అన్నాడు ఖరాఖండిగా.

ఈ రోజుల్లో కొందరు కుర్రాళ్ళు కేవలం చదువు, తను, తన కుటుంబం గురించి తప్ప మిగతా వాటి గురించి ఆలోచించరు. మరికొందరు సరదాలు, షికార్లు, ఎంజాయ్‌మెంటే జీవితమంటారు. కొందరు మాత్రమే చదువు, సరదాలు జీవితంలో ఒకింత భాగమే తప్ప అవే జీవితంగా ఉండరు. సమాజంలో తమ పాత్రను నిర్వర్తించే ప్రయత్నం చేస్తారు. అలాంటి సుబ్రహ్మణ్యం లాంటి కుర్రాళ్ళ మనోవికాసాన్ని, సామాజిక స్పృహను అందరూ గుర్తించాల్సిన అవసరముంది. ప్రోత్సహించాల్సిఉంది.

సామాజిక స్పృహను పెంచడం కోసం చుట్టూ ఉన్నవారికి చెవినిల్లు కట్టుకుని చెప్పాలి. అదీ సంగతి. 'చెవినిల్లు కట్టుకోవడ'మే ప్రస్తుతం మన సంగతి.

'ఇల్లు కట్టిచూడు పెళ్ళిచేసి చూడు' అన్నారు పెద్దలు.. అవి చేయడం ఎంత కష్టమో బెదిరింపుగా చెప్తూ.

ఇల్లు కట్టడమే కష్టమైతే, మరి 'చెవిన ఇల్లు కట్టడం' మరీ కష్టమేమో. అసలు చెవినిల్లు కట్టడం అంటే ఏమిటి? అంటే ఎవరైనా చెప్తారు. 'ఒకే విషయాన్ని అవతల వారి మనసుకు పట్టేటట్లు పదేపదే చెప్పడం' అని.

ఈ పదాన్ని పామర జనం నుంచి పండిత ప్రజ వరకూ అందరూ వాడతారు. కానీ ఈ పదానికి అంత పెద్ద అర్థానికి సంబంధం ఏమిటో ఒక పట్టాన అర్థంకాకపోవచ్చు. కానీ చాలా సులువుగా ఏర్పడిన అర్థవంతమైన పదమిది. ఇది స్వచ్ఛమైన దేశీయం. అచ్చ తెలుగు పదం.

పదాన్ని పరిశీలిద్దాం. చెవిన ఇల్లు కట్టుకోవడం అంటే చెవిలో ఇల్లు కట్టుకోవడం అని.

చెవి, ఇట్లు అనే రెండు నామవాచకాలు, న/లో అనే విభక్తి ప్రత్యయం కలిపి ఈ నానుడి.

జ్ఞానేంద్రియాలలో శబ్దగ్రాహ్యత కలిగినది 'చెవి'. ఒక విషయాన్ని ఒకసారి చెప్పడం, మామూలుగా చెప్పడం సర్వసాధారణం. కాని పదేపదే చెప్పాలనుకుంటే. ఆ వ్యక్తిని వెంటాడి చెప్పాలి. వెంటాడి చెప్పడం సాధ్యంకాదు కాబట్టి ఆ వ్యక్తి చెవిలోనే ఇల్లుకట్టుకుని అక్కడే నివాసముంటూ అదే పనిగా ఆ విషయాన్ని చెప్తుండాలి. ఇది అత్యుక్తి. కానీ, అలా చెప్పడమే పరిష్కారం కాబట్టి, చెవిలోనే ఇల్లుకట్టుకుని చెప్పితే, ఎంత వేధించి మరీ చెప్తామో అంతగా చెప్పడమన్నమాట. దాని భావం.

ఒక విషయాన్ని పదేపదే చెప్పి ఒప్పించడాన్ని 'చెవినిల్లుకట్టుకుని చెప్పడం'గా ప్రాచీనకాలం నుంచే వాడుక ఉంది. 'సుగ్రీవ విజయం'లో రుద్రకవి

"...చెవినిల్లుగట్టుకుని చెప్పి చంపించె నీ
రవి సుతుడే ద్రోహి రాముడేమెరుగు?" అని పేర్కొన్నారు.

మొల్ల కూడా " ఎల్లవేళల నే జెవినిల్లుగట్టి
విన్నపము చేయు నా మాట వినవు నీవు"

అని రాశారు.

ఈ పదం గురించి ఇంతగా చెవినిల్లు కట్టుకుని మరీ చెప్పాలా? అంటారా? సరే! ☆

పాఠక స్పందన

పిల్లల శీర్షికలు బాగున్నాయి

ఆదివారం ప్రజాశక్తిలో ప్రచురిస్తున్న బాలనేస్తాలు బాగుంది. అంతేకాకుండా బాలవికాసం, బాలల కథ మాకు చాలా చాలా నచ్చాయి. 'సంశయం' కథ ఆకట్టుకుంది. జి.కె.బిట్స్ ప్రతివారం ప్రచురిస్తే చిన్నపిల్లలకు చాలా ఉపయోగకరంగా వుంటుంది.

– సయ్యద్ ఆసిఫ్‌వుద్దీన్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లా

నటరాజ రామకృష్ణ వ్యాసం బాగుంది

21 అక్టోబర్ ఆదివారం అనుబంధం కళాసాహితి పేజీలో ప్రచురించిన 'నృత్యరూపక కర్త శ్రీనటరాజ రామకృష్ణ' గారి జీవిత చరిత్ర బాగుంది. ఆయన ఎందరో కళాకారులను నృత్యాభినయంలో తీర్చిదిద్దారు. ఇలాంటి మహానుభావుల జీవిత చరిత్ర చదివే అవకాశం కలిగినందుకు మాకు చాలా సంతోషంగా వుంది.

– మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా

కొత్త నిర్వచనాన్నిచ్చిన కుందేలు - తాబేలు

21 అక్టోబర్ 2001 ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో మనలో మాట శీర్షికన ప్రచురించిన 'కుందేలు–తాబేలు' ఓ కొత్త నిర్వచనాన్ని విశదపరిచింది. ఈ కథలోని కుందేలు అహంకారానికి ప్రతీక. తాబేలు ఆత్మవిశ్వాసానికి నిదర్శనం. మనిషిని ప్రగతి పథంలోకి నడిపించేది ఆత్మవిశ్వాసమే అనే నిజాన్ని చక్కగా వివరించారు. ఈ వారం కథ 'కొమ్ములేని ఎడ్లు' కాలం మారిన దళిత జీవన విధానంలో మార్పేమీ రాలేదని తెలియపర్చింది. బాలనేస్తాలు శీర్షికను మరికొంత శ్రద్ధ తీసుకొని నిర్వహించగలరు.

– ఆనందగజపతిరావు, తెట్టంగి, శ్రీకాకుళంజిల్లా

మొదటి, చివరి పేజీలు మూలస్తంభాలు

ఆదివారం అనుబంధం పుస్తకం మొదటి పేజీలో మనలో మాట, చివరి పేజీలోని పలుకుబడి శీర్షికలు మూలస్తంభాలు. ముఖ్యంగా మనలోమాట శీర్షిక చాలా బాగుంటోంది.

– పళ్ళెం కిషోర్, శృంగవృక్షం, ప.గో.జిల్లా

బ్రతుకు బాటలో...

ఫోటో : నరహరి, హైదరాబాద్.

బాలకార్మిక పునరావాస పథకం-కడప

బాలకార్మికుల సమస్యలు - పరిష్కారాలు

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 24,39,45, ప్రకారం 14 సంవత్సరాల లోపు వయస్సుగల పిల్లలను ప్రమాదకర పనులకు వినియోగించుట, వారిని దోపిడికి గురిచేయుట చట్టవిరుద్ధము. భారతదేశంలోఉంటూ శారీరకంగా, మానసికంగా అభివృద్ధినిరోదక వాతావరణ పరిస్థితులలో పనిచేయుచున్న 70నుండి 80 మిలియన్ల పిల్లలకు ఉచిత నిర్భంధవిద్యను భారతప్రభుత్వం కల్పించింది. 1991 జనాభాలెక్కల ప్రకారం దేశంలోవున్న 16, 61,940 మంది పిల్లలలో బాలకార్మికులే ఎక్కువ. తల్లిదండ్రుల అజ్ఞానం, చాలీచాలని సంపాదనలు పిల్లలను బాలకార్మికులుగా చేయించడానికి మూలకారణంగా భావించబడుతున్నది. బీడితయారీ, గ్లాస్ తయారీ, తివాచీ తయారీ, రాళ్ళుచెక్కుట, అగ్గిపెట్టెలు, అత్యంత ప్రమాదకరమయిన మందుగుండు సామాగ్రి తయారీ వంటి పరిశ్రమలు తక్కువ జీతంతో పనిచేయు ఈ బాలకార్మికుల శ్రమశక్తిపైనే ఆధారపడియున్నవి.14 సంవత్సరాల లోపు పిల్లలకు ఉచితంగా తగిన విద్యనేర్పించడమే మొదటి చర్యగా ప్రభుత్వ ధ్యేయంగా ఎంచుకున్నది. ఈచర్య బాలకార్మికులను బలవంతంగా పనిచేయించడంనుండి నిరోధించబడుతున్నది. పిల్లలను ప్రత్యేమైన పాఠశాలల్లో చేర్పించడంతో పాటు అందుకు అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వమే కల్పిస్తోంది. ఈధ్యేయంతోనే కడపజిల్లా బాలకార్మికుల పునరావాస కార్యక్రమం 1995- 96 సంవత్సరంలో ప్రారంభించబడింది.

ప్రాజెక్టువారిచే నడుపబడుతున్న ప్రత్యేక పాఠశాలలు

ప్రత్యేక పాఠశాలల నిర్వహణా భాధ్యత ఎంపిక చేయబడిన ఎన్‌జివోలకు, ట్రేడ్ యూనియన్లకు అప్పగించబడుతున్నది. పిల్లలను చిన్నతనంలోనే పనికి పంపకూడదన్న చైతన్యాన్ని తల్లిదండ్రులలో కలిగించుట. పిల్లలకు స్వయంఉపాధి కల్పించడానికి వీలుగా టైలరింగ్, ఎంబ్రాయిడరీ, కుట్టుపని, మోటార్ రీవైండింగ్ తదితర వృత్తివిద్యాకోర్సులు నేర్పించుట జరుగుతోంది. వాటికి కావలసిన ఒ.బి కిట్స్, మ్యాపులు, గ్లోబులు మొదలగు సామాగ్రి ప్రాజెక్టు డైరెక్టరుగారిచే ప్రత్యేక పాఠశాలలకు సమకూర్చబడుతున్నవి. నేసనల్ చైల్డ్‌లేబర్ ప్రాజెక్టువారిచే ప్రతిఒక్కరికి 100 రూపాయల ప్రకారం స్టైఫండు చెల్లించబడుతోంది. జిల్లాలో అపాయకర పరిస్థితులలో పనిచేయుచున్న వేలాది బాలకార్మికులకు ఈపథకం కొనసాగించుట వాంఛనీయం.

శ్రీమతి లలనకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్,
బాలకార్మికుల పునరావాస కార్యక్రమ పథకం,
కడప.

కె. చంద్రమౌళి, ఐ.ఎ.ఎస్,
ఛైర్మన్ మరియు కలెక్టర్,
కడప.